న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 ఫిబ్రవరి 1960

మూల్యం : రూపాయి

న వ భా ర తి కా ర్యా ల యం

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * ఫిబ్రవరి 1960 | సంచిక 5

ప్రాచ్య, పాశ్చాత్య విద్యాప్రమాణ వ్యత్యాసము

మనము ఫలములను పుష్పములను చూచుచున్నాము. వాటి గుణతత్వములను గురించి పరిశీలించుచున్నాము. వాటిస్వరూప స్వభావములను గురించి వివరించుచున్నాము. ఈ వివరణ అనంత కాలముగా జరుగుచునే యున్నది. ఫలములు ఫలించుచునే యున్నవి. పుష్పములు వికసించుచునేయున్నవి. వాటిరుచి, వాటి పరిమళపరివ్యాప్తి పరిపరివిధముల ప్రభవించుచునే యున్నది. ఇది యిది యని నిర్ధారణ చేయగలశక్తి మానవునిబుద్ధికి మానవుని విజ్ఞతకు కలిగియున్నదని చెప్పలేము. కాని వ్యవహారధర్మములో ఒకొక్క పండు ఒకొక్క రంగు కలిగియుండునని, ఒకొక్కరుచిని నిరూపించుకొనునని, ఒకొక్క పరిమళపరివ్యాప్తిని చెందియుండునని నిర్దేశించియున్నారు. ఒకొక్కపుష్పము ఒకొక్కరుచి కలిగియున్నదని, ఒకొక్క పుష్పము ఒకొక్క పరిమళపరివ్యాప్తిని ప్రభవించునని విశదముగా వ్యవహారనిర్దేశము చేయుచున్నాము ఈవీటి రసనిష్పత్తిని రుచులతో వివరించి విశదీకరించగలమా? ఈ వీటి పరిమళ పరివ్యాప్తిని విభాగించి ఇది యిదియని నిర్ధారణచేసి చెప్పగలమా? వీటి సారాంశమును సరిచూచి, సమభావముచేసి, విభాగించి, వివరించి యేది యెలా భావించుకొనవలెనో పోలిక చూపకనే నిర్ధారణచేసి నిరూపించగలమా? ఇవి యేవీ చేయకనే మనము ఇది సత్యమని ఇది అసత్యమని చెప్పునది అవివేకము కాదా? అవివేకమునకు వివేకమునకు అంతరమనునది సూక్ష్మీకరించి నిర్ధారణచేయగలమని మానవుని మేధస్సులోనున్న శక్తికి అర్హతయున్నదని నిర్ధారణచేసి నిరూపించగలమా? ఇది యిప్పుడు పరిశీలించియున్న వారిలో యే ఒక్కరైనను వివరించియున్నారని సప్రమాణముగా నిరూపించలేమనియే రూఢి అగుచున్నదని భావించబడుచున్నది. దీనిని కాదనివాదము చేయువారున్నారా? ఎవ్వరైనను ఉండియున్నచో సశాస్త్రీయముగా నిరూపించి నిర్ధారణచేయవచ్చును. వాద ప్రతివాదములలో రూఢిచేసి నిర్ధారణచేయవచ్చునని నిరూపించవచ్చును కాని అట్టివారు యీశరీరధారణ కలిగియున్నంతవరకు చేయగల శక్తిసంపన్నులు కారనియే లోకములోని విద్యావిధానము, నిరూపించుచున్నది

లోకములోని విద్య అంతయూ వ్యవహారోపయోగమేనని వివరించి యున్నారు. వ్యవహార విద్యాప్రమాణము, ఆత్మ విద్యాప్రమాణము వేరువేరు శాఖ లని వివరించబడియున్నది, ఆత్మవిద్య యనునది ప్రపంచమంతటా వ్యాప్తిచెందియే యున్నది. అయితే ఆత్మానుభూతి యన్నది అక్షరరూపము ధరించకలిగినది మాత్రము కాదని భారతీయులు భావించుచున్నారు. వ్యవహారవిద్యను అవిద్యగాను, ఆత్మ విద్యను జ్ఞానముగాను వివేచన చేయగలవారికి వ్యక్తమగునని వివరించి విపులీకరించి యున్నారు. ఇది ఎవరెవరి శక్తి ఏయే పరిమితులు కలిగియుండునో ఆయా పరిమితు లలోనే యిది అనుభవైకవేద్యమగునని చెప్పియున్నారు. వ్యవహారమనునది యంతయు తాత్కాలికము. జ్ఞానమనునది సార్వకాలికము. ఈ రెండింటికి యే అంతరమున్నదో ఆ అంతరమును యెవరు గ్రహించగలరో వారికి జ్ఞానార్జనమునకు ప్రాదిపదిక యేర్పడునని భారతీయులు భావించినటుల యెంచబడుచున్నది.

ఇది మామిడిపండు, ఇది నారింజపండు, ఇది బత్తాయిపండు, ఇది కమలాపండు, ఇవి అన్నియూ తీయనిరుచినే ప్రసాదించుచున్నవి. ఇవి వేరు వేరు రంగులలో దర్శన మిచ్చుచున్నవి. ఇవి వేరువేరు ఆకారములను కలిగియున్నవి. ఇవి వేరువేరు రస, స్వరూప, స్వభావములు కలిగి యివి తీయదనములో వివిధములైన అంతస్థులలో ప్రత్యక్షానుభవము నిచ్చుచున్నవి. ఈవీటి ప్రత్యక్షానుభవము ఇది యిదిఅని నిర్ధారణచేసి చెప్పగలిగిన శక్తి మానవుని వివేక, విజ్ఞాన వికాసములకు లేదనియే భావించవచ్చును. ఈ వీటిలో దేనిరుచిని అదియే కలిగియున్నదని చెప్పవచ్చును. అది ఏరుచిని యిచ్చు చున్నదో దానిని నిర్ధారణచేయుట సామాన్యపరిమితులలో సాధ్యముగాని, ఉత్తమ పద్ధతులలో నసాధ్యమని చెప్పవచ్చును. ఈ రుచి ఆత్మగతమేగాని వ్యక్తము చేయుట సాధ్యముకాదని చెప్పకతప్పదు. ఈ తప్పనిదానిని గురించి వాదోపవాదములు చేయు వారు వివేకులో, అవివేకులో ఆలోచనచేయకయే నిర్ధారణకు రావచ్చును. ప్రతివానికిని సామాన్య పరిజ్ఞానమనునది యున్నది. మాధ్యమిక పరిజ్ఞానమను నది యున్నది. ఉత్తమపరిజ్ఞానమనునది యున్నది. ఉత్తమోత్తమ పరిజ్ఞానమనునది యున్నది.

ఈ నాలుగు శబ్దముల వెనుకనున్న భావపరివర్తనమును వేరువేరు విధము లుగా అంతఃకరణ తెలుసుకొనగలదు. ఆ తెలుసుకొనునదియే ఆత్మయని, అంత రాత్మయని, ఇవి వేరువేరు అంతస్థులను విడదీయగల శక్తిగలవని భావించుచుంటిమి.

ఇది యంతయు భావనయే. ఈ భావన అనుభవైకవేద్యమగునే కాని వ్యక్తము చేయగలది మాత్రముకాదు. మానవునికి వ్యక్తావస్థ, అవ్యక్తావస్థ అనునవియున్నవి. అవ్యక్తమంతయు ఆత్మపరముగా నిలచియుండును. అది వివరించ సాధ్యముకానిది. వ్యక్తమయినదంతయు మానసికము, మేధస్సంపన్నము, చిత్తవికాసము అయి యున్నది. ఇవి వ్యవహారధర్మమునకు నిలచియుండును. జ్ఞానమంతయు అవ్యక్తము. వ్యక్తమంతయు వ్యవహారము. వ్యవహారమంతయు, మనస్సును, బుద్ధిని, చిత్తమును ఆవరించియుండును అవ్యక్తమంతయు ఆత్మను పరమాత్మను ఆశ్రయించియుండును. ఆత్మ, పరమాత్మలను భావమే జన్మాంతర సంస్కారములకు పునాది. మనస్సు, బుద్ధి, చిత్తము అన్న భావమే యీజన్మ సంస్కారాలకు పునాది. ఇవి రెండూ పరస్పరాశ్రయములు. ఈ రెండింటిని యెవరు యేయే పరిమితిలో గ్రహించగలరో వారికి ఆయా పరిమితికి తగిన ముక్తి కలుగును. అంటే జన్మాంతరవాసనా ఫలితములను తప్పక అనుభవించవలయునని బోధపడును. భవిష్యజ్జన్మకు మార్గము దొరుకునని భావము కలుగును. ఇవి యన్నియూ పరస్పరాశ్రయములే. ఈ వీటిని ఒకదానినుండి మరొకదానిని వేరుచేసి అర్థము చేసుకొనకూడదు. ఇవి అన్నియూ కలసియేయున్నవి. ఇవి అన్నియూ ఒక వస్తువులోని ఒక భావములే. ఒకేవృక్షమునుండి అనేక ఫలములు వచ్చుచున్నవి. ఈ ఫలములు అనేక పర్యాయములు వచ్చుచున్నవి. ఒకే చెట్టునుంచి అనేక పుష్పములు వచ్చుచున్నవి. అనేక పర్యాయములు వచ్చుచున్నవి. ఫలములు రుచి నిచ్చుచున్నవి. పుష్పములు పరిమళములను యిచ్చుచున్నవి. ఇవి మనకిచ్చు చున్నవని మన మనుకొందుము. ఆ యిచ్చుచున్నవి వాటి సహజగుణములు ఆయా సహజగుణములను మన చిత్తవృత్తులు ఆస్వాదించి అనుభవించి అవి మన ప్రయోజనమునకే నని భావించుచున్నవి. మానవుల మనుకొను మనము యీ లోకమంతయు మనకొరకే యేర్పడినదని భావించుకొనుచుంటిమి. ఇది మానసిక వికాసమా? మేధోవికాసమా? చిత్త వికాసమా? ఆత్మవికాసమా? అనునది చర్చనీయాంశముగా నున్నది ఫలములను, పుష్పములను మనము తయారుచేయుటలేదు. అవి అసలు మానవునిచే సృష్టింపబడినవి కానేకావు, మన మాంసమును భుజించిన పులి తనకెంతో ఆహ్లాదము కలిగెనని భావించును. అయినచో పులి దృష్టిలో మనమందరము తన కోసమేనని భావించుకొనిన తప్పు కాదుకదా? లోకమంతయు తనకోసమే యేర్పడు నని యీనాడు మానవుడు యోచించుకొనుటలో యెంత స్వార్థము యిమిడి యున్నదో వివరించవలసిన అవసరములేదు. పాశ్చాత్యవిజ్ఞానము, ప్రపంచమంతయు

మానవుని కొరకేర్పడినదని యిదియే ప్రధానమైన భావమని శరీరసౌఖ్యమే ప్రధానమైనదని భావించమనుచున్నది. శరీరము, ఆత్మ భిన్నములైనవి యని శరీర సౌఖ్యమెంత రుచికరమైనదో, ఆత్మసౌఖ్యము అంతకన్ననూ రుచికరమని, శరీర సౌఖ్యమును ఆత్మవికాసమే తీర్చిదిద్దగలదని, యీశరీరము ఆత్మగతమైన ప్రయాణమునకు తాత్కాలిక ఆశ్రయమిచ్చునదియేనని, యిది ఒకచోటినుంచి మరొకచోటికి ప్రయాణము చేయువారికి విశ్రాంతి మందిరమువలే సౌకర్యముకొరకేర్పడినదని భావించువారికి భారతీయ జీవితవిధానము సప్రమాణముగా నిలచియున్నది. ప్రాచ్య పాశ్చాత్య విద్యాప్రమాణముల వ్యత్యాస నిరూపణమునకు యిదియే సప్రమాణనిరూపితము. ఇదియే నిర్ధారణము. ఉత్తమభావ విలసితములైన భారతీయ విద్యను చదువ నేర్చువారికి, వివేచించుకొని విజ్ఞత గణించువారికి, సర్వ పురుషార్థప్రతిభా ప్రాభవములను వికసింపచేయు సంకల్పము గలవారికి, అత్యుత్తమమైన విధానము యిది ఒక్కటి మాత్రమేనని సుస్పష్టము చేయవచ్చును.

విశ్వనాథమధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౧

బొచ్చెడు మోహంబు వేయియూహలు పుట్టించుదాని
పుచ్చిన వ్యర్థత యొక్కసారిగా మొగమునఁ గొట్టు
విచ్చిపోయిన యట్టి మోహవారిధి వీచిలో నీవు
విచ్చెదు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఉట్టికి నాలుగుచేర్లు తెగి కూరుచున్నాను నేను
ఉట్టికెక్కను పనిలేదు వెన్న నీ వూదుకోస్వామి
ఉట్టిచేర్లున్నచో నుండనీవే ప్రభూ! పనియిద్ది
పెట్టుకో నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

అల్పదుఃఖములకు నల్పసుఖముల కదియేడ్చి నవ్వ
నల్పపు బనిలేదు జన్మయెత్తి నందుకేడ్చెదను
నిల్పోపరాకుండఁ జేయుచుంటివి నిముస నిముసము
వేల్పవై నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

నాసామి! మనసులో మరచి పోవుచున్నానయ్య నిన్ను
మోసగించెదు నీవు నన్ను నీపెద్ద బొందలో దింపి
మాసరమ్మైన యీమాయ యెడఁదలో మరలించుకొంచు
వేసార నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

చచ్చును మానిసి యెప్పుడైనను జచ్చెడిదాఁకఁ
బచ్చి యారదు జీవి నీ విశేష కృపాస్పర్శలేక
అచ్చపు జీవితాలోనఁ బరిపక్వమగు నీదు వెలుగు
వెచ్చన నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

అలుపంబులందున మరియు నలుపంపు టధికారమునకు
దల తిరిగించిన నేమి యననీదు దయ యనవలెనె
అలయించి కికురించి తటపటాయించి యల మాయతుదకు
వెలయింతు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

కలలోన నేదియో పెద్దయాపద కలిగి నీ స్మరణఁ
దలఁగిపోవున యేని నద్దికూడ నీదయ యన్నదయయె
కలలోనఁగూడ నీ స్మరణభయముతోఁ గలసియుండెడిని
వెలకట్టి నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

పున్నెంబులని వేఱకలవె నీ ధ్యానమునఁ గూడి యున్కి-
నన్నియుఁ బున్నెంబులగున యటుగాక యన్ని పాపములె
నిన్నాశ్రయించి యున్నది యఖిల కర్మ నిచయంబు నిన్ను
వెన్నంటి నందమూర్నిలయ సంతాన వేణుగోపాల

ఖానికి నెందుకో అంతమైన కోపమ్ము నామీద
నేను నిన్నాశ్రయించితి ననుచు నాశ్రయించుట పూర్వు
లైన ఋషుల్ చెప్పినట్టి మార్గాన నని ధిషణాన
వీనుడు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

దేశమ్ము కాలమ్ము కలిసి బుద్ధికిదెచ్చు నజ్ఞాన
లేశముల్ కొండంతలేసి చేసి తూలెదఁ దూలనీకు
దేశకాలానవచ్ఛిన్నతయును నాదెసకొగ్గఁ గరుణ
వేశంత! నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

సంపూర్ణముగ నీ యనుగ్రహము నాకు సమకూడుటున్నె
వెంపరలాడి లాభమ్ము లేమిచే వెక్కసంబయ్యె
తంపటవేసిన యట్లుగా నయ్యె తమకు నా విన్న
వింపులు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ప్రొద్దు క్రుంకుచు నుండె మరలఁ దూర్పునఁ బొడుచుచునుండె
నిద్దుర పోవుచునుంటి పవలు తిండి తినుచునుంటి
కొద్దిగానైన నీ కరుణ కలదనుకొనరాద యేమి
విద్దియ నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఇందు రమించుచు నుంటినో లేదొ యెఱుఁగను బిట్టు
క్రందైన యలవాటు కొలఁది బ్రదుకుదుగాని నిత్యముగఁ
గందనకాయలో నీవు మసలుట కలదన్న తృప్తి
విందవై నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

మొదలు తుదల్ లేక సాగుచుండిన భూమి జంతువుల
పొదలికయును మృత్యుధారకును గట్టపోయఁగాఁ జాలు
సదయుడు లేనెలే డవధిలేకుండఁ జను జీవకోటి
చెదరుగా నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఏ చీమ కాచీమ బ్రదుకుచుండుట యింకొక్కడైన
యే చీమ తన ముక్కుచివరఁగల నూక కెగఁబడిపోరు
నో చెట్టచెదరుగా నిముసమౌ బ్రతుకూగాడ నూర్మి
వీచిగా నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఎన్నగా వ్యర్థమైనట్టి దీనికై యెన్ని వేదములు
నెన్ని శాస్త్రంబులు నెన్నివిద్యలు నేర్పాటు జరిగె
మన్నుందినెడు జీవి యెడఁదలోపల మత్సరంబెంతో
విన్నావు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

నన్నుఁగాని పరిత్యజించి పోవుచున్నావీవు స్వామి
కన్నారుగా నిల్వఁబెట్టి నిను సేనగదలింప నెంతు
మన్ను వ్రాలఁగనీకు నిలుము మారాకుగా లంచమెడఁద
వెన్నగా నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

నా యేడ్పు నాయేడ్పుగానె యుండగా నను వీడిపోకు
మోయయ్య యిదియొక క్రొత్తయేడ్పుగానోయి గోపాల
యీ యూరునకుఁ దెచ్చినదియు ననువీడి యేగుటకా న
పేయాంశు! నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

పిల్లల కాటవస్తువులొసఁగి బులిపించిన యట్లు
మెల్లమెల్ల వచ్చెదు త్రోవచూపినన్ మోసగించెదవు
చిల్లర బేరమ్ము గాని నాచేతఁ జేయించఁబోకు
పెల్లుగా నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఈ మేను కలిగినన్నాళ్ళు తప్పదయీూ పాడుసంత
ఏ మేను కలిగిన యేని యీూసంత యెపుడు తప్పదును
ఏ మేను లేకుండఁ జేయవే మరి యేమఱకుండ
వేమారు నందమూర్నిలయ సంతాన వేణుగోపాల

పురాణవర్ణిత విష్ణువెవరు ?

పండిత, శ్రీ గోపదేవ్

౨

జనవరి సంచికలో నుపర్యుక్త శీర్షికతో పాఠకులు విష్ణునామము, విష్ణువాహనము గరుత్మంతుడు. సుపర్ణుడు అమృతాహరణము నను విషయములను గూర్చి కొంత చదివి యున్నారు. ఈ సంచికయందు విష్ణువు సముద్రశాయి అను విషయమును గూర్చి పాఠకులకు విన్నవింతునని వ్రాసియుంటిని, పాఠకులీ క్రింది వాక్యములను తిలకింతురుగాక!

పురాణములలో ననేక స్థలములందు విష్ణుమూర్తి సముద్రమున శయనించియున్నట్లు వర్ణించుటను జూచియుందురు ఆకసమున ప్రకాశించు సూర్యభగవానుడే పురాణములలో విష్ణుమూర్తిగకల్పింపబడినట్లు పూర్వపు వ్యాసమున వ్రాసియుంటిని అట్టియెడల విష్ణువు సముద్రశాయి యనుటలో పౌరాణికుల యభిప్రాయ మేమైయుండును? విష్ణుమూర్తికి సంబంధించిన గాథలన్నియు సూర్యునిలో నున్న ప్రాకృతిక విశేషములకు జెందినవియై యున్నపుడే సూర్యుని స్థానమున విష్ణువు కల్పింపబడినాడనుట యుక్తమగునుగదా! అవును, సూర్యు డాకాశమున ప్రకాశించుచున్నాడు ఆకసమున నున్నాడు సూర్యుని యాకాశస్థితియే పురాణములందు గల విష్ణువుయొక్క సముద్రశయనము అంతకుమించి వేరేమియు లేదు.

వైదికభాషలో ఆకాశమును సముద్రమందురు ఆకాశనామములు వైదిక నిఘంటువున నిట్లు గణింపబడినవి

"అంబరమ్, వియత్, వ్యోమ, బర్హిః, ధన్వ, అంతరిక్షమ్, ఆకాశమ్, ఆపః పృథివీ, భూః, స్వయంభూః, అధ్వా, పుష్కరమ్, సగరః, సముద్రః, అధ్వరమ్- ఇతిషోడశ అంతరిక్షనామాని. ని 1.3"

ఆకసమునకుగల పదునారు నామములలో సముద్రముకూడ నొక నామమని నిఘంటువునందు జూడనగును ఈపదములను నిర్వచించిన మహర్షి యాస్కుడు సముద్రపదము నిట్లు నిర్వచించియున్నాడు.

"తత్రసముద్ర ఇత్యేతత్ పార్థివేన సముద్రేణ సందిహ్యతే సముద్రః కస్మాత్? సముద్రవంతి ఆపః అస్మాత్ - సమభిద్రవంత్యేనమాపః సమ్మోదంతె అస్మిన్ భూతాని సముదకోభవతి-సమునత్తీతివా" నిరుక్తం 2-10.

సముద్రమన భూమియందలి సముద్రమని సందేహము కలుగును. కారణమేమన ఆకాశపదమునకు గల యర్థమే భూతల సముద్రమునకు జెప్పబడును అర్థవివరణము చూడుడు

అస్మాత్-దీనినుండి, ఆకాశమునుండి ఆపః జలము, సముద్రవంతి ద్రవమై భూమి పై పడును. అతః- అంగువలన ఆకాశము సముద్రమనబడును.

ఆపః - జలము, ఏనమ్ - ఆకాశమును, సమభిద్రవంతి- ప్రాపించును అస్మిన్-ఇందు, భూతాని- ప్రాణులు, సమ్మోదంతె - ఆనందించుచున్నవి. ఆకాశమున ప్రాణులు విహరించి సుఖించుట లోకవిదితమేకదా! మరియు, సముదకః - ఆకాశములో నధికజలము భవతి - ఉండును, వా-లేక, సమునత్తి- అన్నింటిని ఆర్ద్రము చేయును

ఈ యర్థములన్నియు నాకాశ పదనిర్వచనమువలన దెలియనగును. భూతలసముద్రమునకు నీ యర్థములే వర్తించునని విజ్ఞులకు వేరుగ చెప్పనవసరముండదు భూమిపైనుండు జలము నదులుగా ప్రవహించి సముద్రమున జేరును. సముద్రమున నెన్నియో ప్రాణులు సుఖించుచుండును సముద్రములో జల మధికముగ నుండును ఇట్లు భూతల సముద్రమునకు గల యర్థములు ఆకాశము

నకుగల యర్థములు సమానములగుటచేత ఆకాశమే సముద్రమని చెప్పబడినది. వేద మంత్రములలో సముద్రపదమునకు ఆకాశ మనియే యర్థము. భాష్యకారులు వ్రాసి యున్నారు చూడుడు.

"ఏకః సుపర్ణః సముద్రమా వివేశ
స ఇదం విశ్వం భువనం విచష్టే
తంపాకేన మనసాన పశ్యమన్తితః
తంమాతారేఢి స ఉరేఢి మాతరమ్"

ఋ 1. 11. 4. 4

ఈ మంత్రమునకు శ్రీ సాయణాచార్యు లిట్లు భాష్యముచేసి యున్నాడు.

'ఏకః-సర్వకార్యేష్వ సహాయః, సుపర్ణః-సంపతనః - మధ్యమస్థానోదేవః, సముద్రమ్-అంతరిక్షం, ఆవివేశ - ఆవిశతి, (ఆవిశ్యచ) సఃఇదంవిశ్వం- సర్వం, భువనం-భూతజాతం, విచష్టే - అనుగ్రాహ్యతయా అభిపశ్యతి, తం-ఏవంరూపం దేవం, పాకేన- పరిపక్వేన,మనసా అంతితః- సమీపే, అహమపశ్యమ్- అదర్శమ్ కించ, మాతా-ఉదకానాం నిర్మాత్రీ మాధ్యమికావాక్, తంరేఢీ-ఆస్వాదయతి ఉపజీవన మాత్ర మత్రలక్ష్యతే, స ఉ- సఖలు మాత రః - వాచం. రేఢి-లేఢి, తామేవోపజీవతి. (విహ-ఆస్వాదనే.)

ఇందు సముద్రశబ్దమునకు సాయణాచార్యులు అంతరిక్షము ఆకాశము-అని యర్థము వ్రాసి యున్నారు ఇట్లే దుర్గాచార్యుల భాష్యమునందును సముద్ర శబ్దమున కాకాశ మని యర్థము చూడనగును.

"ఏకఏవ-అద్వితీయః, యస్యపతనే గమనే ప్రతిమాయానం ద్వితీయానాస్తి, ససుపర్ణః-సుపంతనః-వాయుః, సముద్రం-అంతరిక్షమ్, నిత్యమావివేశ - ఆ విశతి, నకదాచిదప్యనావిష్టస్తత్ర సచపునః సర్వభూతాను ప్రవేశీ, తదావిశ్వంభువనం - సర్వాణీ మానిభూత జాతాని, విచష్టే - అభివిపశ్యతి, యథాద్రష్టవ్యాని, తమేవం వర్తమానమహం, పాకేన మనసా - విపక్వప్రజ్ఞానేన, సర్వగతమపిసం తమ్, అంతికమివాపశ్యమ్, ఋషిః దృష్ట దేవతా సతత్వః కస్మైచిదాచక్షాణోబ్రవీతి తం మాతారేఢి, స ఉమాతరం, మాతా-మాధ్యమికావాక్, తముపజీవతి పరస్పరాశ్రయత్వాత్తయోర్ వృత్తేరధ్యాత్మ వదితి ఇతి"

ఉపర్యుక్త భాష్యకారుల భాష్యార్థముల ననుసరించి మంత్ర భావార్థమేమన సుందర పతనస్వభావముగల వాయువు (సముద్రం) ఆకాశమున వ్యాప్తమైయుండి సర్వప్రాణులకు ప్రాణించుటకు తోడ్పడుచు ననుగ్రహించుచున్నది ఆ వాయువును పరిపక్వజ్ఞాన సహాయమున నేనంతికమున జూచుచున్నాడ ఆ వాయువును జలనిర్మాణమొనర్చు మాధ్యమికదేవత విద్యుత్తు (మాతా) - మేఘము లందుండు విద్యుత్తు - ఆస్వాదించుచున్నది. ఆ విద్యుత్తును వాయు వాస్వాదించుచున్నది పరస్పరమయ్యావి కలిసియున్నవి

ఉపర్యుక్త మంత్రార్థములను జూచిన మీదట సముద్రశబ్ద మాకాశ వాచకమను టలో పాఠకుల కిసుమంతయు సందియ ముండదని యెంచెద ఇంతేకాక యథర్వవేద మున నొకచో నిట్లున్నది

"సహస్ర శృంగో వృషభోయః సముద్రాదుదాచరత్" అ-వే 45

సహస్రశృంగోవృషభః- వేయికొమ్ములు గల వృషభము - సహస్ర కిరణుడగు సూర్యుడు - సముద్రాద్-ఆకాశమునుండి, ఉదాచరత్ - ఉదితుడయ్యెను-ఉదయించెను ఈ మంత్రమునందు సముద్రము ఆకాశవాచకముగ ప్రయోగింపబడి యుండుట సుస్పష్టము. మరియు ఋగ్వేదమున నింకొక మంత్రమునందును సముద్రశబ్ద మాకాశమునకై ప్రయోగింపబడుట చూడనగును

"సో అర్ణవానద్యః సముద్రియః ప్రతిగృహ్ణాతి విశ్రితానరిభిః" 1 55 2.

ఈ మంత్రమునందలి 'సముద్రియః' అను పదమునకు సాయణులు సముద్రియః సము

ద్రవంత్యస్మాదా పతంతీతి సముద్రమ్ అంతరిక్షమ్ తత్రభవః సముద్రియః అంతరిక్షవ్యాపీ, అని వ్యాఖ్యానముచేసి యున్నారు. సముద్రియమన నంతరిక్ష్యవ్యాపియని సాయణాచార్యు లభిప్రాయపడుచున్నారు
ఇట్లే వేదములందనేక స్థలములలో సముద్ర పదము అకాశమునకు పర్యాయముగ ప్రయోగింపబడుటను విద్వాంసు లెరుగుదురు. కాబట్టి పురాణరచయితలు ఆకాశరూప సముద్రమునందు సూర్యరూప విష్ణువును శయనింపజేసియున్నారు విష్ణువీరూపమున సముద్రశాయి యనుటలో గల సౌందర్యమును పాఠకులూహింప జాలకపోరు.

ప్రప్రధమమున కల్పనా సౌందర్యమును గ్రహించినంతకాలము సముద్రమాకాశముగానే యుండెను. విష్ణువు సూర్యుడుగానే యుండెను. కాని వేదప్రచారము సన్నగిల్లిన కొలది జనులలో కల్పనను గుర్తింపగల శక్తి నశించినది. విష్ణువొక ప్రత్యేకదేవతగా భావింపబడజొచ్చెను. ఆవిష్ణుదేవునకు భూతల సముద్రము నివాసస్థానము, శయనమందిరమయ్యెను. వైదికపదములను గ్రహించి వానికిగల సమానార్థముల నూతగాగొని పౌరాణికు లిట్టిగాధలను కల్పించుటకు ముఖ్యకారణము భారతీయులకు నాడు వేదములందుగల గాఢవిశ్వాసమే నేడా కల్పితగాధలు నిజమనియెంచి జనులు పరమార్థము నెరుగక శైవవైష్ణవాది సంప్రదాయములను నిర్మించి పరస్పరము కలహించుట శోచనీయము. సముద్ర మాకాశవాచక మైనట్లు 'ఆపః' అను శబ్దముకూడ ఆకాశవాచకమే యని యీ లేఖలో ప్రదర్శించిన పదములను జూచిన పాఠకులకు స్పష్టము కాగలదు. 'ఆపః' శబ్దము ఆకాశ వాచకమని గ్రహింపక జలవాచకమని గ్రహించుటవలన గలిగిన యనర్థములను రాబోవు సంచికలో పాఠకులు చూడగలరు

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు, వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు · నవభారతి

పాత్ర చిత్రణములో మెలకువ

శ్రీ జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.

ధార్మికాధ్యాత్మికోన్నతికి తోడ్పడక కేవలము వినోదహేతువైన సాహిత్యమును ప్రాచీనభారతీయు లాదరింపలేదు. పరమార్థ పరిపంథియైన వాఙ్మయము హేయముగా భావింపబడుచుండెను. రమ్యత్వ ధర్మ్యత్వ సమ్మేళనమే సాహిత్యలక్షణముగా నిర్వచింపబడినది. "విశ్వశ్రేయః కావ్యం" అను మాటలలో పారమార్థిక ప్రయోజనమును "తదదోషౌ పరిష్కృతౌచవాగర్థౌ" అను మాటలలో సౌందర్య లక్షణమును నన్నయ నిర్దేశించియున్నాడు. మన యాలంకారికులుకూడ వేదోదిత ధర్మమునే కావ్యము రసవంతమైన ధోరణిలో ప్రతిపాదింపవలయునని "యద్వేదాత్ప్రభు సమ్మితాదధిగతం" ఇత్యాది స్థలములలో వెల్లడించియున్నారు. కావ్యమునకు ఉపదేశముతో నిమిత్తము లేదనియు, కళ కళ కొఱకే యనియు చెప్పుట అభారతీయము.

మాంగళ్యవాతావరణము మంగళభావములను గల్గించును, అమాంగళ్య వాతావరణము అమంగళభావములను గల్గించును "భద్రం కర్ణేభిః శ్రుణుయామదేవాః" ఇత్యాది వేదవాక్యములు మంగళమయ ప్రసంగముల మహిమను వెల్లడించుచున్నవి. "మంగళాదీనిమంగళమధ్యాని మంగళాన్తాని శాస్త్రాణి ప్రథన్తే" యను వచనము కావ్యములో మంగళవాతావర్ణమును విధించుచున్నది. అడుగడుగునకు 'శాంతిః శాంతిః శాంతిః' అని పఠించు భారతీయులకు సాహిత్యములోని మంగళసౌరభముమీద గల మక్కువను వేరుగా వ్యాఖ్యానింపనక్కఱలేదు. జుట్టు పట్టుకొని రక్తస్రవంతిలోనికి పాఠకునీడ్చుకొనిపోవు పాశ్చాత్య కవులకును ఆధ్యాత్మికోపదేష్టలైన భారతీయ కవులకును గల భేదమును శ్రీ అరవింద నిరూపించియున్నారు.

ప్రాయికముగా మానవ జీవితమును ఉన్నదున్నట్లుగా చిత్రించుటయే కళ యని పాశ్చాత్యులు తృప్తిపడుచుండగా భారతీయులు ధార్మికోత్తేజనమునకు తోడ్పడు రీతిగానే కావ్యములలో జీవితవిమర్శనము సాగవలయునని భావించినారు. పాశ్చాత్యసాహిత్య నిర్మాతలలో మానవజీవిత చిత్రణమునందు అద్వితీయఖ్యాతి గన్నవాడు షేక్స్పియరు. ఆతడు తన ముప్పదియాఱు నాటకములలో మానవ హృదయమునకు ఎక్సురే తీసినట్లు వివిధ ప్రకృతులను మనకు ప్రదర్శించి సహస్రమనస్కుడను (Myriad - minded Shakespeare) ఖ్యాతిని పొందినాడు. బహుముఖ పాత్రపోషణములోను వైవిధ్యవిలసితమైన మానవప్రకృతిని చిత్రించుటలోను ప్రపంచ సాహిత్యములో మహాభారతమునకు కలస్థానము అద్వితీయము. మహాభారతమునందు అర్జునుడు, భీముడు, కర్ణుడు, భీష్ముడు మున్నగు పాత్రలు నేటికిని సజీవములై మన కన్నులయెదుట నిలచును.

పాశ్చాత్య మహాకవుల పాత్రలకును వ్యాస పాత్రలకును నొక ముఖ్యభేదము కన్పట్టును. పాశ్చాత్యకవుల దుష్టపాత్రల దౌష్ట్యము ప్రబలమైనది. అది పాఠకుని లొంగతీయుటకుకూడ తగినంత ప్రబలముగా నుండును. సత్పాత్రలుకూడ దుష్టులకు లోనై నశించుటయు, యాదృచ్ఛిక సంఘటనలు మానవుల మంచిచెడ్డలతో నిమిత్తము లేకుండ వారి జీవితములను మలచుచుండుటయు తఱచుగా కన్పట్టు విషయము. అనేక సందర్భములలో ధర్మాధర్మముల విభాగము కష్టమగునట్లు పాత్రనిర్మాణము జరుగును. "ధర్మమే జయించును, అధర్మమే నశించును" అను చరమసిద్ధాంతమునకుకూడ భంగకరమగు రీతిగా పాత్రచిత్రణము గావింపబడును. ధర్మావలంబకులకు సహజముగా నుండదగిన "యతోధర్మస్తతో జయః" అను విశ్వాసమునకే మూలచ్ఛేదమగు రీతిగా పాత్రచిత్రణము గావింపబడినది అనేక ఘట్టములలో పురుషకారముపట్ల నైరాశ్యము గల్గునట్లుగా యాదృచ్ఛిక సంఘటనలకు ప్రాబల్యము కన్పట్టును. ఈ ప్రపంచము చుక్కానిలేని పడవా యనిపించు పద్ధతిలో సన్నివేశములు కూర్ప

బడును. మహాభారతములో నీ లోపములులేవు. ధర్మమందును పరమేశ్వరుని పరిపాలనమందును, అచంచలమగు విశ్వాసము కలుగునట్లును, ఆచరించువారిని ధర్మము, ఆశ్రయించువారిని ఈశ్వరుడును రక్షించునను విశ్వాసము సుదృఢమగునట్లును సన్నివేశములు కూర్చబడినవి అట్లని వాస్తవికతావిదూరముగా వాతావరణము సృష్టించబడలేదు

పాత్రలలో నెచ్చట నేలోపమున్నను దానిచే పాఠకు డాకర్షింపబడకుండునట్లుగా మెలకువతో పాత్రపోషణము గావింపబడినది. ద్రౌపది కయిదుగురు భర్తలున్నను ద్రౌపది పట్ల పాఠకులకు గౌరవభావమేయున్నను ఇంత కాలముగా మహాభారతము చదువువారిలోను, వినువారిలోను, ఒక్కరికిగూడ "నేడుకూడ బహు భర్తృకతలో దోషమేమి'' యను భావము తట్టలేదు. ఇట్లే యే పాత్రలోనను పాదేయాంశమున్నను అది మనపట్ల నిర్వీర్యమగునట్లుగా వ్యాసుడు పాత్రపోషణము, కథా సన్నివేశము గావించినాడు ఇది వ్యాసుని యైంద్రిజాలికశక్తి, ఈవిచారణము మొత్తము మీద ఉన్నతశ్రేణికిచెందిన పాశ్చాత్యభారతీయ కవుల నడుమ జరిగిన విమర్శగానే భావింపదగును. పాశ్చాత్య సాహిత్యములోకాని భారతీయ సాహిత్యములోకాని సామాన్యమున కపవాదము లుండకపోవు.

భారతీయ సాహిత్యములో నెచ్చటనైనను సచ్చరిత్రుల జీవితము విషాదాంతముగా చిత్రింపబడినను అందులకు కారణముగా పూర్వజన్మకృతమగు నొక దోషము వర్ణింపబడి యుండును జన్మపరంపరయందు దృఢవిశ్వాసము గలభారతీయుల దృష్టిలో కర్మఫలానుభవము ఉపాధిభేదప్రతిరుద్ధము కాజాలదు ఏజన్మలో చేసిన పాపపుణ్యములకైనను మరియొకజన్మలో ఫలము రావచ్చుమ కావున భారతీయ సాహిత్యములోని యా దృచ్ఛిక సంఘటనలుగాని యకారణములుగా పైకి కన్పట్టు నీయాపాత్రల శుభాఽశుభానుభవములుకాని పాఠకునియాశ్వరా స్తిక్యబుద్ధిని, ధర్మవిశ్వాసమును సడలింపజాలవు

భారతీయ సంస్కృతికి రామాయణము దర్పణము భారతజాతికి లోకములో ప్రతిష్ఠను గూర్చిన సత్యవ్రతమును, పితృభక్తి భ్రాతృభక్తి, మిత్రధర్మము, పాతివ్రత్యము మున్నగు ధర్మములు రామాయణములో బహురమ్యముగాను విపులముగాను ఉపదేశింపబడి యున్నందున నీ గ్రంథము జాతీయేతిహాసమని చెప్పదగియున్నది. గ్రిఫిత్ అను పాశ్చాత్య విద్వాంసుడు తన రామాయణోపోద్ఘాతములో రామాయణమును హిందువుల జాతీయేతిహాసముగా వర్ణించినాడు **(Ramayana the great National epic of the Hindus)** రామాయణము ప్రత్యేకముగా భారతజాతి కభిమానాస్పదము లయిన ధర్మములను బోధించు మహోత్కృష్ట గ్రంథముగా పాశ్చాత్యులకు గోచరించినది

లోకోత్తరములుగా, సర్వమానవాదర్శములుగానున్న సీతారామపాత్రలలోనేకాక దశరథుడు, భరతుడు మున్నగువారిలోకూడ భారతీయధార్మిక తత్త్వమును వాల్మీకి కన్పరిచి మొత్తముమీదనే తన గ్రంథమును భారతీయ జీవిత ప్రతిబింబముగా చేసినాడు సీతారాముల దివ్యతేజస్సుముందు మనలను అంతగా నాకర్షింపజాలని పాత్రలనుకూడ వాల్మీకి ధార్మిక వాతావరణ నిర్మాణసాధనములనుగానే యుపయోగించినాడు ''ఆడినమాటను తప్పకుండుటకై కుమారునికూడ విడచిపెట్టుకొన్న సత్యవ్రతుడు"గా దశరథుడనేక స్థలములలో వాల్మీకి చేత పేర్కొనబడినాడు, ఇది దశరథునిలోని మనము తఱచు విస్మరించు శీలసౌభాగ్యమును జ్ఞప్తికి తెచ్చును. ఇట్లే ప్రతిపాత్రయు ప్రగాఢ ధార్మిక సుగంధభరితమైనదిగా చిత్రింపబడినది. అయోధ్యలోనివారే కాక శరభంగుడు, శబరి, జటాయువు మున్నగు పాత్రలన్నియు సుకృతిపుంజములుగా చిత్రింపబడియున్నవి.

నిమ్నస్థితిలో నున్నవానిని మానవత్వము లోనికిని, మానవత్వములో నున్నవానిని దివ్య

త్వములోనికిని ఉద్ధరింపగలశక్తి యిట్టి సాహిత్యమునకే యుండును. రామాయణము ఉన్న లాదర్శములను ప్రదర్శించుచు దివ్యతమ గ్రంథమై యలరారుచున్నందున నీగ్రంథముఆదర్శ విషయములనే చిత్రించినది కాని ఆచరణోచితాంశములను చిత్రింపలేదని కొందరు భ్రాంతి పడిరి. కాని శ్రీ అరవింద చెప్పినట్లు ఆదర్శ జీవితమే రామాయణకాలమున ఆచరణములో సాధింపబడినదని వీరు మరచుచున్నారు

వివిధ మానవప్రకృతి పరిజ్ఞానము, వాస్తవిక.జగద్విమర్శనము పరమార్థపరములు కాక పోయినను లోకవ్యవహార జ్ఞానమును గల్గింపకపోవు. కావున నీవిషయమునుకూడ ప్రాచీన భారతీయ కవులుపేక్షింపలేదు వ్యవహారజ్ఞానముకొఱకు (వ్యవహారవిదే)కూడ కావ్యపరనముపకరించునని మన యాలంకారికులుకూడ చెప్పియున్నారు కాని మన కవులు, ఆలంకారికులు పాశ్చాత్యులవలె దీనికి ప్రాధాన్యమీయలేదు మానవ ప్రకృతి చిత్రణములో మోసములకు, కుత్రలకు దౌష్ట్యమునకు విశేషస్థానము నొసగుటవలన కవిపాఠకునకు లోకజ్ఞానమును హెచ్చుగా కల్గించినవాడు కావచ్చునుగాని దానివలన మానసిక వాతావరణము కలుషితమై భారతీయుల లక్ష్యమైన ప్రశాంత జీవితమునకు భంగము కలుగును, కావున భారతీయకవులు పాత్రచిత్రణములో విశేషమైన మెలకువచూపి "శాంతం శివం సుందరం" అను పరమేశ్వర లక్షణములను సాహిత్యమునకుకూడ సంపాదించుటకు యత్నించిరి.

అశ్లీలశృంగారము, హత్యలు, అపరాధ పరిశోధనములు మున్నగువానిని సాహిత్యములో తఱచు పఠించుటవలన పాఠకుల మనస్సులలో ధార్మికత, దయార్ద్రిత సన్నగిల్లును. అట్టి మానవులకు సామాన్య ప్రశాంతజీవితము నందు రుచి తగ్గిపోయి అసాధారణ దారుణ పరిస్థితులకొఱకై తహతహ బయలుదేరును. నేడు పాశ్చాత్యదేశములలో దారుణ కథానికల వలన (Tales of Horror) నేరములు పెరిగిపోవుచున్నవని అంకెలునిరూపించినవి. మానవ మన స్తత్వమును చక్కగా నెరిగిన మన ప్రాచీనులు కావ్యనాటకాదులలో అశ్లీలభావములను, అమంగళ వాతావరణమును ప్రవేశింపకుండునట్లు ప్రయత్నించిరి కావ్యనాయకుల లోను, ఇతర ప్రధానపాత్రలలోను దోషము లున్నచో లోకములో దోషములపట్ల హేయ భావము ప్రజలకు క్రమముగా తగ్గిపోవచ్చును. గావున ప్రధానపాత్ర చిత్రణములో వారు విశేషమైన మెలకువ చూపిరి

దుష్యంతపాత్ర చిత్రణములో నిప్పట్ల కాళిదాసు చూపిన మెలకువ యెట్టిదో చూతము.

దుష్యంతుడు శకుంతలను వివాహమాడి, యాడలేదని చెప్పి యామెను పలువురి సమక్షమున నిరాకరించినాడని మహాభారతములో నున్నది. భారతము సర్వధర్మములకు పెన్నిధానమగుటచే బహు శతస్థలములలో సత్యభాషణ ప్రస్తుతియు అసత్యవచన గర్హణమును అందుండుటవలన దుష్యంతు డసత్యమాడినాడనుటవలన వచ్చిన ధర్మహానిలేదు ఇంతకును మహాభారతము ఇతిహాసము, జరిగినదానిని యథాతథముగ చెప్పును. కాళిదాసు వ్రాయుచున్నది చిన్నగ్రంథము, అందు ప్రధానుడైన నాయకుడు పెద్దవిషయములో అసత్య మాడినాడనుచో నది లోకములో సత్యసంధతకుగల గౌరవమును తగ్గించును కావున కాళిదాసు తన నాటకనాయకుని అసత్య మాడనివానినిగా ప్రదర్శించినాడు. ఆతని దుష్యంతుడుకూడ శకుంతలను జూచి నిన్ను నేను వివాహమాడలేదని చెప్పినమాట వాస్తవమే కాని యా విషయమును పూర్తిగా మరచిపోయియే యట్లనినాడు.

నాయకుడు మందమతియు, తమోగుణభూయిష్ఠుడు నగుటమాత్ర మాక్షేపణీయము గాదా యన దుష్యంతుడు సహజముగా మందమతి కాడు, దూర్వాస శాపమువలన మరపుచెందినాడని కాళిదాసు కాచుకొన్నాడు.

కాని నాయకుడు పెద్దలచే చీవాట్లు, శాపములు తినువాడగుట మాత్రము సమంజసమాగునె, కాళిదాసు అక్కడకూడ గాడి తప్ప

కుండునట్లు ధర్మమును నడపినాడు. దుష్యంతుడు తన దోషమువలన శాపమును పొందలేదని యాతడు తెలిపినాడు. శాపమెందులకు వచ్చినదన- శకుంతల తప్పువలన వచ్చినది నాయకునిలోనే దోషముండకూడదనుచుండగా నాయకురాలిలో దోషము నెవరు సహింతురు?

ఇక్కడ ధర్మమును కాపాడుటలో కాళిదాసు లోకోత్తర ప్రతిభను చూపినాడు. శకుంతల శాపమునకు కారణమైన తప్పు చిత్రమైనది ఏది తప్పుకానితప్పో దానిని శకుంతలచేసినది. పతిసేవలో నిమగ్నమై యితర ధర్మమును వీడుట యొక్కటే స్త్రీకి తప్పుకానితప్పు. శకుంతల భర్తృధ్యాన నిమగ్నయై భిక్షకువచ్చిన దుర్వాసునిపట్ల ఏమరుపాటు చూపినది అట్టిచో మహర్షియైన దుర్వాసుడు శకుంతలచేసిన పనికి కుపితుడై శపించుటయేల?

ఈ రీతిగా దుష్యంతునినుండియు, శకుంతలనుండియు తొలగింపబడిన దోషము చివఱకు దుర్వాసుని నెత్తిమీద పడినది. దానిని కూడ కాళిదాసు తొలగింపవలెనా? అక్కఱలేదా? దుర్వాసుని కాపాడవలసినకర్తవ్యము కాళిదాసునకులేదు. దుర్వాసునిపై నిదిపఱకే పురాణములలో నూరు తొందరపాట్లు కలవు. ఇది నూటయొకటవది. వాని నన్నింటిని భరించుట కాతడు సమర్ధుడు కావున కాళిదాసంతతో నాగినాడు. ఇంత మెలకువతో కాళిదాసుపాత్ర చిత్రణము గావించినాడు.

ఒక్క దుష్టపాత్రకూడ లేకుండ కాళిదాసు శాకుంతల నాటకమును రచించినాడు దుష్టపాత్రల నింత సమగ్రముగా బహిష్కరించిన నాటకము ప్రపంచములో మరి యే భాషలోను లేదని నాతలంపు పందొమ్మిది సర్గల రఘువంశములో నొక్క దుష్టపాత్రకూడ లేదు ఇది యాదృచ్ఛికముకాదు పాశ్చాత్య సాహిత్యములో విషాదాంత గ్రంధములలోనే కాక సుఖాంతగ్రంధములలోకూడ దుష్టవాతావరణము విశేషముగా కన్పట్టును. భారతీయజీవితము సహజముగా పరమార్ధ పరాయణమగుటచే నందు ప్రతిబింబించు సాహిత్యము తదనుగుణముగా నుండుట సహజము అంతియేకాక భారతీయకవులు బుద్ధిపూర్వకముగానే లోకకల్యాణదృష్టితో మాంగళ్యవాతావరణమునకు ప్రాధాన్యమిచ్చిరి.

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

ఋషయ ఊచుః-

యదాప్రాప్త్యర్థ మర్థానాంతజ్జ్ఞై రభినయః కృతః
కస్మాన్నృత్తం కృతం హ్యేతత్కం స్వభావమపేక్షతే. ౨౫౬
నగీతకార్థ సంబద్ధం నచాప్యర్థ స్వభావకమ్
కస్మాన్నృత్తం కృతం హ్యేతద్గీతేష్వా సారితేషుచ ౨౫౭

అప్పుడు భరతుని ఋషులీ ప్రశ్నల నడిగిరి-

"కావ్యార్థములను సాక్షాత్కారయోగ్యముగా చేయుటకు నాట్యప్రయోగ కుశలులు ఆంగికాద్యభినయములను తీసికొన్నారు ఈ ప్రయోగమును నృత్తమను పేరుతో ఎందుకు పిలువవలెను? దీని లక్షణమేది? దీనికి ప్రయోజనమేమయినా కలదా? గీతము మొదలైన నాట్యాంగములలో నృత్తమును పేర్కొనలేదు గీతము మొదలగు వాటిలో నిరూపించుదాని ప్రాప్తికికూడ నృత్త ముపకరించదు కదా!"

భరతః-

అత్రోచ్యతే- నఖల్వర్థం కంచిన్నృత్త మపేక్షతే
కింతు శోభాం ప్రజన యేదితి నృత్తం ప్రవర్తితమ్. ౨౫౮
ప్రాయేణ సర్వలోకస్య నృత్తమిష్టం స్వభావతః
మంగల్య మితికృత్వాచ నృత్తమే తత్ప్రకీర్తితమ్. ౨౫౯
వివాహ ప్రసవావాహ ప్రమోదాభ్యుదయాదిషు
వినోదకారణం చేతి నృత్తమే తత్ప్రవర్తితమ్. ౨౬౦

భరతుని సమాధానము- నృత్తనాట్యములకు భేదమున్నదా, లేదా, అను ప్రశ్నను విచారించితిమేని నాట్యమున కావ్యార్థ సాక్షాత్కారప్రాప్తి కలదని ఒప్పుకొనవలెను నృత్తమున ఇట్టి సాక్షాత్కారప్రాప్తి అనవసరము రంజనయోగ్యమగు శోభను, చమత్కారమను అలౌకికప్రతీతిని కలుగజేయుటకే నృత్తము బయలుదేరినది వివాహము, పుత్రజననము, అల్లునితో కలసి కుమార్తె తనఇంటికి ప్రేమపూర్వకముగా వచ్చుట, ప్రమోదము, అభ్యుదయము మొదలగు మంగళప్రదమైన సమయములలో స్వాభావికముగానే మానవులు ఆనందపరవశమున నృత్తము చేయుదురు. ఇట్టి నృత్తము సకలజనులకు స్వాభావికము, ఆనందదాయకము అగుటచే నిది ప్రవృత్తమైనది.

అతశ్చైవ ప్రతిక్షేపాద్భూత సంఘైః ప్రవర్తితాః
యేగీతకాదౌ యుజ్యంతే సమ్యఙ్నృత్త విభాగకాః ౨౬౧
దేవేనచాపి సంప్రోక్తాస్తండుః సంతోషపూర్వకమ్
గీతప్రయోగమాశ్రిత్య నృత్తమే తత్ప్రవర్త్యతామ్ ౨౬౨

ప్రారంభమున పూర్వరంగమందు లక్షణపూర్వకముగా, నృత్తము యోజించబడుచున్నది. "ఝుంటు" మొదలుగాగల శుష్కాక్షరములతోఁగూడిన గీతకములతో నీపూర్వరంగము భూతసంఘములగు దైత్యాదులను సంతోషపరచుటకు ప్రయోగింపబడుచు నృత్తమున కవకాశమును కలుగజేయుచున్నది మద్రకాదిగీతములకు మొదట నృత్తమును జూపుటకు అభినేయ పదార్థరహితమైన నిర్గీతమే కన్పించుటచే ఈ నృత్తము అభినయరహితమైనదని శంకింపనక్కరలేదు. శుద్ధమగు నాట్యాంగము యొక్క విభాగకములు, విభాగప్రాపకములు మొదట ప్రయోగింపబడుటచే నృత్తము అభినయసంవలితమే యగుచున్నది.

గీతకముల ఉపోహనములను ప్రయోగించుచో శుద్ధనృత్తమునే చేయవలెను. గీతకాంగమధ్యమున నృత్తప్రవేశమున్నది. అంగ వ్యవహారాదికమున అర్థమును సామాజికుల కభిముఖమగునట్లుగా తీసికొనివెళ్ళగా వాచ్యము అభినీతమగును. ఇక్కడ అభినయమునకు సాక్షాత్కారకల్పతా పాదనమను నర్థమును చెప్పరాదు. కాని లయాద్యాహారిత్వమాత్రమే అర్థముగా చెప్పికొనవలెను వాచ్యార్థము నితరుల కవగాహనమగునట్లు లయతాలాద్యాహార్యము ద్వారా తీసికొనివెళ్ళుటయే నృత్తమునగల అభినయనము

గీతకము, ఆసారితకము మొదలైనవి నృత్తవైచిత్ర్యాశ్రయమై శోభించగలవు కనుక గీతాదికమువలె నృత్తముయొక్క ఉపయోగమును, నాట్యాంగత్వమును గ్రహింపక తప్పదు

ఇక నృత్తప్రధానమగు రాగకావ్యాది విషయమున కావ్యముగూడ నాట్యాంగమేయని చెప్పగోరి, ఇతివృత్తరూపమున తర్వాతి శ్లోకమును భరతుడు చెప్పినాడు. మహేశ్వరుడే ప్రకృష్టమైన ఆదరముతో సంతోషపూర్వకముగా తండు అనబడు నందీశ్వరుని "గీతప్రయోగము నాశ్రయించుకొని నృత్తమును ప్రవర్తింపజేయుము" అని ఆదేశించినాడు.

ప్రాయేణ తాండవవిధి ర్దేవస్తుత్యా శ్రయోభవేత్
సుకుమారప్రయోగశ్చ శృంగారరస సంభవః. ౨౬౩

తాండవశబ్దమున కిచట నృత్తమని అర్థము. సామాన్యముగా నృత్తవిధి దేవస్తుతిని ఆశ్రయించుకొని బయలుదేరినది సుకుమారమగు నృత్తము శృంగార రసము నాశ్రయించుకొని వచ్చినది

ఇక అంగహారములకెట్టి ప్రయోగమును చూపవలెనో చెప్పగోరి తర్వాతి శ్లోకమును చెప్పుచున్నాడు

తస్య తండుప్రయుక్తస్య తాండవస్య విధిక్రియామ్
వర్ధమానక మాసాద్య సంప్రవక్ష్యామి లక్షణమ్ ౨౬౪

పూర్వరంగమును యోగ్యముగా చేయుటకు తదుచితమైన అంగహారముల ప్రయోగము పూర్వము చెప్పబడినది తాండవయోగ్యమైనది వర్ధమానక తాలమే అని ముందు చెప్పబడును. మొదట వర్ధమానకమును గూర్చి చెప్పి. ఆపై గీతకాది విషయక విధిని చెప్పును.

తండు అనగా నంది. తండుచే చెప్పబడినది తాండవము. విధియనగా గాత్రము తాండవవిధియొక్క క్రియాత్మక లక్షణమును చెప్పబోవుచున్నాడు. ఈ క్రియాత్మకలక్షణము వెనుక కరణాంగహార విషయకముగా చెప్పబడినదేగాని గీత తాల సంమిశ్రముగా చెప్పబడలేదు. అందుచే వర్ధమానక తాలమును సామ్యాపాద నకై ఉపాయముగా తీసికొని లక్షణనిర్వచనము చేయుచున్నాడు. వర్ధమానక గీత తాలాభినయ సంబంధముతో తాండవము వచ్చినదని భావము.

కలానాం వృద్ధి మాసాద్య హ్యక్షరాణాంచ వర్ధనాత్
లయస్య వర్ధనాచ్చాపి వర్ధమానక ముచ్యతే. ౨౬౫

తాండవ యోగాభిధానమునకై వర్ధమానకరూపము నిట చెప్పుచున్నాడు.

కనిష్ఠాసారితకములైన కళలు పదునేడు. అదే ద్విగుణలయయైనచో లయాంతరమగును. ముప్పదిమూడుకళలున్న మధ్యమమని, అరువదియైదు కళలున్న జ్యేష్ఠమని విభాగము. లయద్వారా, సంఖ్యాద్వారాకూడ కళలకు వృద్ధికలుగును ఈవృద్ధి చేతనే పదవృద్ధి ఆక్షిప్తమగును కళల ననుసరించి అక్షరములకు వృద్ధి కలుగును. ఇట్లే నర్తకీవృద్ధి కలుగును ప్రథమాసారితమున ఒక నర్తకి, ద్వితీయాసారితమున ఇద్దరు అని క్రమముగా నర్తకురాండ్రకు వృద్ధియున్నది.

కళావృద్ధి, అక్షరవృద్ధి, నరకీవృద్ధి అను వృద్ధియోగముచే వర్ధమానకము సిద్ధించును అంగహారప్రయోగము, పరిపూర్ణమైన పిండీ బంధవిధి, ఈవర్ధమానక యోగముతో చక్కగా నిష్పన్నములు కాగలవని భావము

కృత్వా కుతపవిన్యాసం యథావ ద్ద్విజసత్తమాః
ఆసారిత ప్రయోగస్తు తతః కార్యః ప్రయోక్తృభిః ౨౬౬

కలాపాత విభాగార్థము ఆసారితక్రియ ఐదవ అధ్యాయమున విధింపబడినది ఈ ఆసారితము శుష్కాక్షరములతో కూడినది. స్తోభకపదయుక్తమైన ఆసారితప్రయోగమును చెప్పి, కుతపవిన్యాసమునకు పోవలెనన్నాడు కుతపమనగా వాద్యముల సమూహము. చతుర్విధాతోద్యము కుతపము కుతపవిన్యాసమున తద్గాయకుల విన్యాసముకూడ రాగలదు. దీనిని ప్రత్యాహారమను అంగముగా ముమ్ముందు చెప్పగలడు. స్వరతాల లయకళాదినివేశనమును ముందు గావింపవలెను. ప్రత్యాహారమను అంగము మొదలుకొని ఆసారితక్రియాంతమైన విన్యాసమును ఇక్కడ చేయవలెను. అభిఘాతాతోద్యమున గాయకునిచే ప్రయోగింపబడు ఆసారితగత కలాపాద

ప్రస్తావమును పూర్తి గావింపవలెనని భావము. అంతర్యవనికాంగముగా శుష్కాక్షర ప్రయోగమును గావించుచు ఆతోద్య ప్రయోగ ప్రస్తావనను చేయగా దైత్యులు సంతోషింతురు తద్ద్వారా విఘ్నములు శమించగలవు. అట్టి అంగకలాపమునే ప్రయోగవిధిగా నిచట గ్రహించవలెను.

తత్ర తూ పోహనం కృత్వా తంత్రీగాన సమన్వితమ్
కార్యః ప్రవేశో నర్తక్యా భాండవాద్య సమన్వితః ౨౬౬

ఇక ప్రయోగక్రమము చెప్పబడుచున్నది. కనిష్ఠాసారితమున పంచకలాత్మక మైన శుష్కాక్షరములను ఉపోహనమందురు సమాసవ్యాసత్వమున పదకలాతాల సమభిహితములైన స్వరములు గల అంగము ఉపోహనము. ఈ ఉపోహనమును తంత్రీగాన సమన్వితముగా ఒనర్పవలెను. స్థానస్వరాదుల నాలాపింపజేయు సుషిరా తోద్యగానము నాచరించి, భాండవాద్య సమన్వితముగా నర్తకిని ప్రవేశపెట్టవలెను. భాండవాద్యమనగా పుష్కరవాద్యము.

విశుద్ధ కరణాయాంతు జాత్యాం వాద్యం ప్రయోజయేత్
గత్వా వాద్యానుసారిణ్యా తస్యా శ్చారీం ప్రయోజయేత్ ౨౬౭
వైశాఖస్థానకే నేహ సర్వరేచక చారిణీ
పుష్పాంజలిధరా భూత్వా ప్రవిశే ద్రఙ్గమండపమ్. ౨౬౮

విశుద్ధకరణ జాతియందలి వాద్యమును ప్రయోగించవలెను. విశుద్ధకరణ జాతిలో ఏకాక్షరవాద్యమే సర్వమార్గములకు మూలము ఈ వాద్యమును మధ్యమ స్త్రీల విషయమున ఉపయోగించవలెను తథావిధ వాద్యానుసారము కాపాడుచు, తదుపలక్షణమగు చారీవిధిని ప్రయోగించవలెను. చారీవిధిలో కరణాంగహారముల ప్రసక్తి ఉండుటచే భాండవాద్య ప్రయోగముండవలెను. తర్వాత వైశాఖరేచిత కరణము నభినయించవలెను. ఇది సర్వరేచకచారిణియైనది. ఆపై తలపుష్పపుటకరణముతో అంజలియందు పూవులనుంచుకొని నర్తకి రంగమండపమును ప్రవేశింపవలెను

పుష్పాంజలిం విసృజ్యాథ రంగపీఠం పరీత్యచ
ప్రణమ్య దేవతాభ్యశ్చ తతోఽభినయ మాచరేత్. ౨౭౦

అంగక్రమమున పుష్పాంజలిని వదలి, రంగపీఠమున ప్రదక్షిణముగా వించుచు దేవతలకు నమస్కరించి, అభినయము నాచరించవలెను.

యత్రాభినేయం గీతం స్యా త్తత్ర వాద్యం నయోజయేత్
అఙ్గహారప్రయోగేతు భాండవాద్యం విధీయతే. ౨౭౧
సమం రక్తం విభక్తంచ స్ఫుటం శుద్ధప్రహారజమ్
నృత్తాంగ గ్రాహి వాద్యజ్ఞై ర్వాద్యం యోజ్యంతు తాండవే. ౨౭౨

గీయమానమగు వాక్యాభినయమున, వర్ణాలంకార లక్షణమగు గీతమును అభిముఖముగా తీసికొనిపోవలెను. అట్టిచో అవనద్ధవాద్యము గీతమునకు, అభినయమునకు ఆచ్ఛాదనకారి కాగలదు. గనుక వాద్యప్రయోగమును స్వతంత్రముగా

చేయించరాదు. అభినయశూన్యమై, శుద్ధమైన అంగహార ప్రయోగమున నృత్తప్రాధాన్య ముండుటచే, తదనుసారియగు భాండవాద్యమును ప్రయోగించవలెను. నర్తకీ సమాకర్షణమున పునరాసారిత గానముండునుగాన నిది శుద్ధనృత్తము గానసహితమగు వాద్యము, గానము, నృత్తము ప్రధానముగా గలదీ ప్రయోగము.

రెండవ శ్లోకమున భాండవాద్య మెట్లుండవలెనో చెప్పుచున్నాడు. అక్షర అంగ, తాళ, లయ, యతి, పాణిగ్రహ, న్యాస, వికృతములను అష్టవిధములతో కాల దేశ సమతాత్మకమైనది సామ్యము ఇట్టి లక్షణోపేతమైన సమత్వముకల్గి భాండ వాద్యముండవలెను.

కాలకృత విభాగముచేత స్వరోచ్చారణ స్థానదేశకృతమై తద్యోగముద్వారా సమరక్తస్వభావమును వాద్యము కల్గియున్నచో శబ్దమునకు హృద్యతరాగలదు. అనుహారానంతరము వాద్యమును ప్రయోగించినచో విచ్ఛేద ప్రతిభాసమానాక్షరమై యుండవలెను. ఇట్టి వాద్యమున కాదివర్ణానుహారము స్పష్టముగా నుండవలెను ప్రహారజములైన వర్ణములు శుద్ధవిశుద్ధ కరణాంతమున నుండిన అది శ్రేష్ఠమైన వాద్యము అంగహారాత్మకమైన నృత్తములోని కరణాంగములుగాని గీతాంగములు కాని సమత్వమున వాద్యముచే స్వీకరింపబడవలెను ఏవం విధమైన భాండవాద్యమును తాండవమున యోజించవలెను

ప్రయుజ్య గీత వాద్యేతు నిష్క్రాన్తే నర్తకీ తతః
అనేనైవ విధానేన ప్రవిశం త్యపరాః పృథక్ ౨౬౩

గీతవాద్యము ప్రధానముగా నుండగా నృత్తప్రాధాన్యమగు ప్రయోగమున తదౌచిత్యార్థము గీతవాద్యమును తన నృత్తమున కనుగుణముగా ప్రయోగించిన తర్వాత నర్తకి రంగమండపమున ముందు భాగమునుండి వెనుకకు పోవలెను, తర్వాత ఒకరి తర్వాత నొకరుగా ఇతర నర్తకురాండ్రు ప్రవేశింతురు

అన్యా శ్చానుక్రమేణాథ పిండీం బధ్నంతి యాః స్త్రియః
తావ త్పర్యస్తకః కార్యో యావ త్పిండీ నబధ్యతే. ౨౬౪

కనిష్ఠాదికములగు నాలుగు ఆసారితములలో నలుగురు నర్తకురాండ్రు ప్రవేశింపవలెను. వీరు పిండీబంధ ప్రకారణముల ననుసంధింతురు కేవల మాసారితాభిహిత లక్షణమగు ప్రయోగమెంతవరకు జరుగునో అంతవరకు పిండీబంధము జరుగదాదు. ఏకము, అభిన్నాత్మకమునగు అంగవిక్షేప మే ప్రయోగమున నుండునో దానిని పర్యస్తకమందురు ఇది అభినయశూన్యమగు ఆంగికవిధి పిండీబంధోపయోగి యగు నృత్తమును ప్రయోగించనంతవరకు, ప్రవిష్ట నర్తకీ నివర్తనద్వారా, ఏకాకిని యగు నర్తకిచే ఆసారితాభినయము ప్రయోగింపబడవలెను.

పిండీం బధ్వా తతః సర్వా నిష్క్రాన్తేయుః స్త్రియస్తు తాః
పిండీబంధేషు వాద్యంతు కర్తవ్య మిహ వాదకైః. ౨౬౫

పర్యస్తక ప్రమాణేన చిత్రౌషు కరణానిత్వమ్
తత్రోపవాహనం భూయః కార్యం పూర్వవదేవ హి. ౨౬౬

ఆసారిత నృత్తప్రయోగమును గావించి నర్తకురాండ్రు వెనుకకు పోవలెను. పిండీబంధములను చేయునప్పుడు వాదకులు వాద్యముల నాలాపింపజేయవలెను. ఆసారిత ప్రయోగాభినయమగు పర్యస్తకమున వాద్యమున్నను తదంతఃపాతియు, పిండీబంధోపయోగియునగు అంగహారప్రయోగమున నానాప్రకారములుగా వాద్యములను ప్రయోగింపవలెను. వాద్యవిధియందు చెప్పబడు కరణాదిరూపములతో అన్విత మైన వాద్యములు కావలెను ద్విమాత్రాత్మకమగు కలను చిత్రమార్గమని చెప్పుదురు.

ఒకరి తర్వాత నొకరుగా ప్రవేశించు నర్తకురాండ్రచే అభినయప్రయోగమున అంగహార ప్రయోగమును విధించి, తదనంతర మపసరణమును చెప్పి, తావత్కాలము వాద్యనృత్తములకు వైచిత్ర్యమును విధించి, ఇక లయాంతరమగు ఆసారిత ప్రయోగమును గూర్చి చెప్పుచున్నాడు. వెనుకటివలెనే మరల కనిష్ఠాసారిత ప్రయోగమును గావించవలెను.

తత శ్చాసారితం భూయో గాయనంతు ప్రయోజయేత్
పూర్వేణైవ విధానేన ప్రవిశేచ్చాపి నర్తకి ౨౬౭

గాయకులు ఆసారితమును మరల ప్రయోగించగా, వెనుక చెప్పబడిన విధానమును అనుసరించి నర్తకి రంగమండపమును ప్రవేశించగలదు.

గీతకార్థం త్వభినయే ద్వితీయాసాహితస్యతు
తదేవచ పున ర్వస్తు భూయో నృత్తేన దర్శయేత్. ౨౬౮
ఆసారితే సమాప్తేతు నిష్క్రామే న్నర్తకీ తతః
పూర్వవ త్ప్రవిశంత్యన్యాః ప్రయోగః స్సా త్య ఏవహి. ౨౬౯

అప్పుడు నర్తకి ఆసారితమై, తాలవిశేష సంబంధియగు గీతకములోని అర్ధమును అభినయించవలెను లయాంతరాసారితమైన అదే వస్తువును మరల పూర్వ ప్రవిష్టియగు రెండవ నర్తకి కేవలాంగహారాత్మకాభినయముతో ప్రదర్శింపవలెను. ఆసారిత ప్రయోగానంతరము ఈ ఇద్దరును వెనుకకు పోవలెను. ఇట్లు రెండు ఆసారితములు కాగలవు ఆ తర్వాత మిగిలిన నర్తకురాండ్రు వెనుకటివలెనే ప్రవేశించి ఉపవహానాది కృత్యమును నెరవేర్తురు.

ఏవం పదేపదే కార్యో విధి రాసారితస్యతు
భాండవాద్యే కృతేచైవ తథా గాన కృతేఽపిచ. ౨౭౦

ఒకేఒక ఆసారితమును ప్రయోగించినచో అందలి ముఖ, ప్రతిముఖ, శరీర, సంహరణ లక్షణములగు పదములు, వర్ధమానకమువలె నాల్గు అపసరణములతో, భాండవాద్యక్రియ గీతిక్రియలతో ఉండగలవు. దీనినే క్రింది శ్లోకమున వివరించుచున్నాడు.

ఏకంతు ప్రథమం యుంజ్యాద్వే ద్వితీయం తథైవచ
తిస్రో వస్తు తృతీయంతు చతస్రస్తు చతుర్థకమ్. ౨౮౧

వస్తువనగా అంగము. నాల్గు అంగములను నాల్గు తడవలు నృత్తముతో నర్తకురాండ్రు యోజన చేయవలెను. ఆసారితమును అభివ్యక్తము చేయు ప్రయోగము కండికల దశపరివర్తనముతో జరుగును. విశాలా, సంగతా, సునందా, సుముఖీ అను నాల్గు కండికలను ముందు చెప్పనున్నాడు ఈ కండికలు క్రమముగా తొమ్మిది, ఎనిమిది, పదునారు, ముప్పదిరెండు కలాత్మకములు. విశాల ననుసరించి సంగత, సునందా సంగతలు, సుముఖీ సునందా సంగతలు అను క్రమమున దశ పరివర్తములు రాగలవు. విశాలాది పరివర్తత్రయమున సంగతములగు పరివర్తములకు ఉభయత్ర సంబంధముండుటచే సప్తదశకలాత్మకమును ఆవృత్తము చేయగా కనిష్ఠ లయాంతరిత స్థానము రాగలదు. తర్వాత సునందాది పరివర్తత్రయమున ముప్పది రెండు కళలకు మధ్యమాసారితస్థానము వచ్చును. ఆపై సుముఖ్యాది చతుష్టయమున అరువదియైదు కళలకు జ్యేష్ఠాసారిత స్థానమువచ్చును. ఈ రీతిగా ఆసారితమున పదములయందు, స్థానములయందు, కండికా పరివర్తములలో కలుగు నాలుగు అపసారకములను నర్తకి ప్రయోగించకలదు.

పిండీనాం విధయశ్చైవ చత్వారః సంప్రకీర్తితాః
పిండీశృంఖలికాచైవ లతాబంధోఽథ భేద్యకః, ౨౮౨
పిండీబంధస్తు పిండత్వా దుల్మః శృంఖలికా భవేత్
జాలోపనద్ధాచ లతా స నృత్తో భేద్యకః స్మృతః. ౨౮౩

ఆసారితములయందు పిండీబంధ ప్రకారములను ప్రయోగించవలెనని చెప్పబడినది. ఈ ప్రకారముల నిచట నిర్వచించుచున్నాడు

పిండీబంధ ప్రకారములు నాల్గు విధములు. పిండీ, శృంఖలికా, లతాబంధము, భేద్యకము అని వీనిపేరులు. విశేషాంతరహృద్యము, ఏకప్రయోజ్యము నైన పిండీ బంధ రూపము మొదటిది. నర్తకీయోజ్యమై పరస్పరసంబంధము గలిగి, ఏకనాళావ బద్ధమగు కమలయుగళమువలె విజాతీయమైగాని, హంసవదన పరిగ్రహీతమగు నాళనలినమువలె గాని ఉండి, పిండీబంధద్వయ ప్రకార సజాతీయమై,గుల్మశృంఖలికా యని పిలువబడునది రెండవది. ఇది ఇద్దరు నర్తకురాండ్రచే ప్రయోగింపబడునది.

జాలమువలె వైచిత్ర్యము కలిగి వెనుకటిదానివలె సజాతీయ విజాతీయాత్మకముగా నుండి, ముగ్గురిచే ప్రయోగింపబడునది లతాబంధమను పిండీబంధము. నలుగురిచే ప్రయోగింపబడునది భేద్యకము. ఈ నాల్గవ పిండీబంధము వెనుకటి మూడింటి నృత్తప్రయోగములతో అన్వితమైనది.

పిండీబంధః కనిష్ఠేతు శృఙ్ఖలాతు లయాంతరే
మధ్యమేచ లతాబంధే జ్యేష్ఠే చైవాథ భేద్యకః ౨౮౪

పిండీనాం వివిధా యోని ర్యంత్రం భద్రాసనం తథా
శిక్షాయోగ స్తథాచైవ ప్రయోక్తవ్యః ప్రయోక్తృభిః ౨౮౫

కనిష్ఠాసారితమున పిండీబంధమును, లయాంతరమును శృంఖలమును, మధ్యమమున లతాబంధమున, జ్యేష్ఠమున భేద్యకమును ప్రయోగించవలెను,

ఆధారాదిభేదముల ననుసరించి పిండీబంధములు నిష్పన్నములగుచున్నవి పృథగ్భూతాంగములకే రీతిగా అనుసంధి కలుగుచున్నదో అట్లే భూమి, దేహా. కాశాద్యాధార ఖండలకాద్యను సంధానము కల్గినచో దానిని యంత్రమందురు, తద్ద్వారా మిశ్రభేదములు రాగలవు. భూమ్యాదులయందు కన్పించుటచే స్ఫుటమగు స్థానము సంక్రమించును. దీనిని భద్రాసనమందురు. ఈ రెంటితోను ఆధారాంగ భేదము చెప్పబడినది.

కరణాంగహార విశేషములలో అంగవిక్షేప వైచిత్ర్యాభ్యాసమును శిక్షా యోగమందురు. ఇది సాధకతమమగు భేదము.

పిండీబంధములకు వివిధకారణములు కలవని చెప్పుచు "వివిధ" శబ్దమును ప్రయోగించుటచే తద్వ్యామిశ్రణ పూర్వకముగా అనంతభేదము లున్నవని సూచించుచున్నాడు.

ఈ సమస్త పిండీబంధ ప్రకారము ఇచట ఉపయోగపడునా లేదా అన్నచో, సమస్తప్రకారములచేత పిండీ శృంఖలికాది బంధములను యోజించవలెనని సమాధానము.

ఏవం ప్రయోగః కర్తవ్యో వర్ధమానే తపోధనాః
గీతానాం ఛందకానాంచ భూయో వక్ష్యామ్యహం విధిమ్. ౨౮౬

వర్ధమానక ప్రయోగము నీ రీతిగా చేయవలెను. ఇక గీతవిధిని, ఛందక విధిని చెప్పబోవుచున్నాడు.

యాని వస్తునిబద్ధానియాని చాంగకృతానితు
గీతాని తేషాం వక్ష్యామి ప్రయోగం నృత్తవాద్యయోః. ౨౮౭

ఖండలకాది వస్తువులు, స్వల్పములైన అంగములు, మద్రకము, పరాంతకము, ప్రకరీ అను వస్తునిబద్ధములగు మూడు గీతకములు కలవు. నృత్తవాద్య సహితముగా వీటి ప్రయోగము చెప్పబడగలదు. వీటితోబాటు ఉల్లోప్యకము, రోవిందకము, ఓవేణకము, ఉత్తరము అను నాల్గంగములు కూడ వివరించబడగలవు.

ఆంధ్రతర్క సంగ్రహ దీపిక

శ్రీ కుప్పా బైరాగిశాస్త్రి

౨

మంగళము వేదబోధితమైన కర్తవ్యత కలది అని అనుమితి సిద్ధించినప్పంటికి మూలములో శిష్టాచారానుమిత శృతేరేవ ప్రమాణత్వాత్ అనుచోట శృతి (వేదము) యే ప్రమాణము అని చెప్పబడియుండుటచే ఆ శృతియే సాధించబడవలయును. గాని శృతిబోధిత కర్తవ్యత్వము సాధింపబడగుండదే అని ప్రశ్నించరాదు. శాస్త్రములో అనుమితికి పూర్వము సిద్ధించనటువంటిన్నీ విధేయు కోటిప్రవిష్టమైనదానికి విధేయత్వము గలదు, అను నియమముండుటచేత, వేదబోధిత కర్తవ్యత్వము అను విధేయకోటిలో (సాధ్యములో) వేదము (శృతి) ప్రవిష్టమైయుండుటచేత వేదమునకుగూడా విధేయత్వము సిద్ధించినట్లే అని చెప్పవలెను పై చెప్పిన నియమములో అనుమితికి పూర్వము సిద్ధించనటువంటి అని యుండుటచేత పర్వతమువహ్ని (నిప్పు)కలది అను అనుమితిలో వహ్నిత్వము (నిప్పు యొక్క ధర్మము) అనుమితము అను వ్యవహారములేదు. వహ్నిత్వము అనుమితికి పూర్వమే సిద్ధించినదగుటచేత వహ్నిత్వము జాతి నిత్యమైనదిన్నీ ఇచట ఇంకొకరకముగా చెప్పుకొనవచ్చును

మంగళముపక్షము, వేదము, స్వబోధిత కర్తవ్యతాకత్వ సంబంధముచే సాధ్యము. అలౌకిక అవిగతశిష్టాచార విషయత్వము హేతువు ఇప్పుడు వేదమే పైచెప్పిన స్వబోధితేత్యాది సంబంధముచే సాధించబడుటచేత దోషములేదు. ఇచట మూడు అనుమానములు చెప్పుకొనవలయును. 1 మంగళము. చేయతగినది సఫలమగుటవలన, 2 మంగళము సఫలమయినది, అవిగీతమైశిష్టాచార విషయమగుటవలన, 3 మంగళము, సమాప్తి ఫలముగాగలది సమాప్తికంటె ఇతరము ఫలము కానటువంటి దైవఫలమగుటవలన. మంగళమునకు సమాప్తిరూపమైనదృష్టము ఫలము కనబడుచుండగా అదృష్టమైన స్వర్గాదికమును ఫలముగా కల్పించుట అన్యాయముగాన-

మూ॥ తర్క్యంతె ప్రతిపాద్యంత ఇతితర్కాః ద్రవ్యాదిపదార్థాః తేషాంసంగ్రహః సంక్షేపేణ స్వరూపక థనంక్రియతె ఇత్యర్థః । కస్మై ప్రయోజనాయేద్యత ఆహ । సుఖబోధాయేతి। సుఖేన అనాయాసేనబోధః పదార్థతత్వజ్ఞానం తస్మై ఇత్యర్థః । ననుబహుషుతర్క గ్రంథేషు సత్స్వకిమర్థమ పూర్వాయంగ్రంథః క్రియత ఇత్యత ఆహ । బాలానామితి। తేషామతి విస్తృతత్వాత్తత్ర బాలానాం బోధోనజాయత ఇత్యర్థః। గ్రహణధారణ పటుర్బాలః నతుస్తనంధయః। కింకృత్యక్రియత ఇత్యత ఆహ । నిధాయేతి । విశ్వేశం జగన్నియక్తారం । హృది నిధాయ। నితరాం స్థాపయిత్వా । సదాతద్ధ్యానపరోభూత్వేత్యర్థః । గురూణాం విద్యాగురూణాం । వన్దనం నమస్కారం। విధాయకృత్వేత్యర్థః-

తర్కసంగ్రహము అనుచోట తర్కపదము అయథార్థానుభవాంతర్గతమైన తర్కముగాదు అని చెప్పుటకు తర్క్యంతే అని చెప్పుచున్నాడు తర్కములనగా పదార్థములు, వాట్లయొక్క సంక్షేపముగా స్వరూపమును చెప్పుట చేయబడుచున్నదని అర్థము ఎందుకొరకనగా, సుఖబోధాయ-సుఖముగా బోధకొరకు, బోధ అనగా పదార్థ తత్వజ్ఞానము, దానికొరకు, అయ్యా, చాలా తర్కగ్రంథము లుండగా ఎందుకు యీ గ్రంథము అని ప్రశ్న రాగా, బాలానామితి అని చెప్పుచున్నాడు. ఆ గ్రంథములు చాలా విస్తృతముగా ఉండుటచేత బాలురకు సుఖముగా బోధ కలుగదు అని అర్థము. బాలురనగా చెప్పిన అర్థమును గ్రహించువారున్నూ గ్రహించిన అర్థమును ధారణచేయువారున్నూ కాని, పాలుత్రాగు పసివారు

మాత్రంకాదు. ఏమిచేసి గ్రంథము చేయబడు చున్నది విశ్వేశ్వరుని అనగా జగత్తుకు నియంత అయినవానిని హృదయమందు ధ్యానించి (ఎక్కువగా స్థాపనచేసి) ఎల్లకాలము ఆయనను ధ్యానించుచూ, గురూణాం అనగా విద్యా గురువులయొక్క నమస్కారమునున్నూ చేసి-

మూ॥ పదార్థాన్ విభజతే । ద్రవ్యేతి । పదస్యఅర్థః పదార్థ ఇతివ్యుత్పత్యా అభిధేయత్వం పదార్థ సామాన్యలక్షణం లభ్యతే॥

పదార్థములు విశేష్యములుగా గలిగినటువంటివిన్నీ పరస్పరము విరుద్ధములైన సామాన్యధర్మములచే వ్యాప్యమైన విశేషధర్మములు ప్రకారముగా కలిగినటువంటి యే జ్ఞానముకలదో ఆ జ్ఞానమునకు అనుకూలమైన వ్యాపారమున కనుకూలమైన కృతి (ప్రయత్నము) కలవాడు అన్నంభట్టు మహాశయులుఅని అర్థము పదస్య అర్థః అను సమాసములో పదసంబంధి అభిధావిషయత్వము అని అర్థము వచ్చును అందులో పదసంబంధిత్వము అను అంశ అవ్యావర్తకమగుటచేత కేవల అభిధేయత్వమునే (అభిదావిషయత్వమునే) పదార్థ సామాన్యలక్షణముగా చెప్పుచున్నారు.

మూ॥ నను విభాగాదేవ సప్తత్వే సిద్ధౌపునస్సప్త పదగ్రహణం వ్యర్థమితిచేన్న । అధికసంఖ్యా వ్యవచ్ఛేదార్థకత్వాత్.

అయ్యా, విభాగము చేయుటవలననే సప్తత్వము సిద్ధించుటచేత ద్రవ్య- అభావాస్సప్త పదార్థాః అని మూలములో సప్తపదము వ్యర్థముగాదా అని అనరాదు ఏడుకంటె అధికముగా పదార్థములు లేవు అని తెలియపరచుటకొరకు సప్తపదమును వాడినారు.

మూ॥ నన్వతిరిక్తః పదార్థః ప్రమితోవానవా । నాఽద్యః ప్రమితస్యనిషేధా యోగాత్। నద్వితీయః ప్రతియోగి ప్రమితిం వినా నిషేధానుపపత్తేః ఇతిచేన్న.

ఏనుయ్యా,ఏడుకంటె అతిరిక్తమైన పదార్థము ప్రమలో విషయమా (ప్రమితమా) గాదా, ప్రమలో విషయమైనచో లేదు అని నిషేధించుటకు వీలులేదు. ప్రమలో విషయమే కానిచో లేదుఅని నిషేధించుటకు వీలులేదు. అభావబుద్ధినిగురించి ప్రతియోగి జ్ఞానము కారణముగాన ఏడుకంటె అతిరిక్త పదార్థములేదు అని నిషేధించుటకు ముందు ఏడుకంటె అతిరిక్తపదార్థము ఉండవలయును ఉన్ననే నిషేధము కుదురునుగాన దీనినే సిద్ధ్య సిద్ధిభ్యాం వ్యాఘాతమని అందురు

మూ॥ పదార్థత్వం ద్రవ్యాది సప్తాన్యతమత్వ వ్యాప్యమితి వ్యవచ్ఛేధార్థకత్వాత్.

పదార్థత్వము, ద్రవ్యము మొదలుగాగల ఏడు పదార్థములలో ఏదియో ఒకటి అగుట అను ధర్మముచే వ్యాప్యమయినది, అను నిశ్చయముకొరకు సప్తపదము వాడబడినందున సప్తపదము వ్యర్థముగాదు. బాధకము లేనిచో ఉద్దేశ్యతావచ్ఛేదకమందు విధేయ వ్యాప్యత్వము భాసించును అను నియమానుసారము ఉద్దేశ్యతావచ్ఛేదకమైన పదార్థత్వమందు విధేయమైన సప్తాన్యతముయొక్క వ్యాప్యత్వము భాసించినది.

మూ॥ నను సప్తాన్యతమత్వం సప్తభిన్నభిన్నత్వమితివక్తవ్యం । సప్త భిన్నస్యైవ అప్రసిద్ధత్వాత్కథం సప్తాన్యతమత్వ వ్యాప్తినిశ్చయ ఇతిచేన్న । ద్రవ్యాదిసప్తాన్య తమత్వం నామ ద్రవ్యాదిభేద సప్తకాఽభావవత్వం । అతో దోష విరహాత్ । ఏవమగ్రేపి ద్రష్టవ్యం ।

సప్తాన్యతమత్వమనగా సప్తభిన్న భిన్నత్వము లోకములో ఏడుకంటె భిన్నమైన (వేరయిన) పదార్థమే లేనందున సప్తభిన్నములేదు.ఆ పరిస్థితిలో సప్తభిన్నభిన్నత్వ వ్యాప్యత్వము మాత్రము ఎటుల ప్రసిద్ధమగును అని పూర్వపక్షమును చేసినారు. "ననుసప్తాన్యతత్వమని" దానికి సమాధానమును "ద్రవ్యాది సప్తాన్యతమత్వంనామ" అని చెప్పుచున్నాడు లోగడ చెప్పినట్లు ద్రవ్యాది సప్తాన్యత్వము అనగా ద్రవ్యాది సప్తభిన్న భిన్నత్వము అనిగాదు ద్రవ్యాది భేద సప్తకాభావతత్వము అని ద్రవ్యాది భేదమనగా ద్రవ్యభేదము, గుణభేదము, కర్మ

భేదము, సామాన్యభేదము, విశేషభేదము, అభావభేదము అని ద్రవ్యభేదము గుణాదుల యందు ప్రసిద్ధము, గుణభేదము ద్రవ్యము కర్మ మొదలగు వాట్లయందు ప్రసిద్ధము గాన ద్రవ్యాదిభేద సప్తకము ప్రసిద్ధమే దానియొక్క అభావము (ద్రవ్యాది భేద సప్తకాభావము) ప్రత్యేకము అన్ని పదార్థములయందు గలదు. ఏడు భేదములు ఎచ్చటను లేవు. ఏడు భేదముల అభావము ప్రత్యేకమందు గలదు, "ఏకసత్వేద్వయం నాస్తి" ఒకటి ఉన్నప్పంటికి రెండులేవు అను న్యాయముచే ద్రవ్యమందు గుణాదిభేదము ఉన్నప్పంటికి ద్రవ్యభేదము లేదు గాన ద్రవ్యాదిభేద సప్తకముయొక్క అభావము గూడా ఉన్నది అటులనే కర్మాదులయొక్క భేదము కర్మాదులయందు ఉండకపోవుటచేత ద్రవ్యాదిభేద సప్తకాభావవత్వము ప్రత్యేకము ద్రవ్యాదులయందు ప్రసిద్ధము. ఇటుల సప్తాన్యతమత్వము ప్రసిద్ధముగుటచే సప్తాన్యతమత్వ వ్యాప్యమితి వ్యాప్తి లభించినదని తాత్పర్యము.

మూ॥ పదార్థాన్ విభజతే । తత్రేతి । తత్ర ద్రవ్యాదిమధ్యే । ద్రవ్యాణిన వైవేత్యన్వయః। కానీ తానీత్యత ఆహ । పృథివీతి ।

పదార్థములను విభజించుచున్నాడు. తత్రఅని తత్ర అనగా ద్రవ్యము, గుణము మొదలగువాట్లలో ద్రవ్యములు తొమ్మిది అని సమన్వయము చేయవలయును, ఆ ద్రవ్యములు ఏవియని ప్రశ్నరాగా పృథివీ అని చెప్పుచున్నారు

మూ॥ నను తమః దశమ ద్రవ్యస్యవిద్యమానత్వాత్కథం నవద్రవ్యాణీతి । తథాహి । నీలం తమశ్చలతీతి ప్రతీతిబలాత్ నీలరూపాధారతయా క్రియాధారత యాచతమసః ద్రవ్యత్వం తావత్సిద్ధం । తత్ర తమసోనాకాశాది పంచకేన్తర్భావః రూపవత్వాత్ అతఏవనవాయౌ స్పర్శాభావాత్ సదాగతిమత్వాభావాచ్చ । నాపితేజసి భాస్వరరూపాభావాత్ ఉష్ణ స్పర్శాభావాచ్చ । నాపిజలె శీతస్పర్శాభావా న్నీలరూపవత్వాచ్చ । నాపి పృథివ్యాంగం దావాత్ స్పర్శరహితత్వాచ్చ। తస్మాత్తమో దశమ ద్రవ్యమితిచేన్న ।

తమస్సు (చీకటి) పదవద్రవ్యము ఉండగా పదార్థములు తొమ్మిది అని చెప్పుట ఎటులు కుదురును. ఆ చీకటిని పదవ ద్రవ్యముగానే నిరూపణ చేయుచున్నాడు "నీలంతమః" అని ద్రవ్యము అగుటకు గుణము, క్రియ కలిగి యుండవలయును "నీలం తమశ్చలతి" అను ప్రతీతివలన చీకటికి నలుపురంగు కదలుట అనుక్రియయు సిద్ధించుచుండుట చేత, చీకటి ద్రవ్యము, నలుపురంగు కలదగుటచేత, అటులనే చీకటిద్రవ్యము, కదలుట అను క్రియ గలదగుటచేత అను రెండు అనుమానముల వలన చీకటిద్రవ్యము అను అనుమితి కలుగును చీకటిపక్షము, ద్రవ్యత్వము (ద్రవ్యమగుట) సాధ్యము. నలుపురంగు కలదగుట, అటులనే కదలుట అను క్రియగలదగుట అనునవి హేతువులు. తర్కప్రక్రియలో మొదట అనుమానము, తరువాత పరామర్శ తరువాత అనుమితి వరసగా కలుగును. ఇచ్చట ద్రవ్యమగుట అను సాధ్యముచే వ్యాప్యమైనది నీలరూపమగుట అను హేతువు ద్రవ్యమగుటచే వ్యాప్యమైనది కదలుట అనుక్రియ అనునవి అనుమానములు. వీట్లను వ్యాప్తిజ్ఞానము అనియు చెప్పుదురు ద్రవ్యమగుట అను సాధ్యముచే వ్యాప్యమైనయే నలుపురంగు గలదో ఆ నలుపురంగు కలది చీకటి, అనునది (సాధ్య వ్యాప్య హేతుమాన్ పక్షః) పరామర్శ జ్ఞానము అటులనే ద్రవ్యమగుట అను సాధ్యముచే వ్యాప్యమైన కదలుట అను క్రియ గలది చీకటి అనునది పరామర్శజ్ఞానము. దాని తరువాత చీకటిద్రవ్యము అను అనుమితి సిద్ధించును చీకటి ద్రవ్యము అయినప్పంటికి లోగాచెప్పిన తొమ్మిది ద్రవ్యములలో అంతర్భావము కాగూడదా అనినచో అటుల చెప్పగూడదు అని చెప్పుచున్నాడు "తమసోనాకాశాది" అని ఈ చీకటి ఆకాశాది పంచకములో (ఆకాశ, కాల, దిక్,

ఆత్మ మనస్సు) అంతర్భావముగాదు నీల రూపము కలదగుటవలన చీకటిపక్షము. ఆకాశాది పంచకములో అంతర్భావము కాని ద్రవ్యమగుట సాధ్యము నలుపురంగు హేతువు. ఎచట ఎచట హేతువు ఉండునో అచట సాధ్యము ఉండవలయును నలుపు రంగు అగు హేతువు పృథివియందుఉన్నది సాధ్యమైన ఆకాశాది పంచకమందు అంతర్భావముగాని ద్రవ్యమగుటకూడా పృథివియందు ఉండుటచేత సద్ధేతువు ఆకాశాది పంచకమందు అంతర్భావముగాని ద్రవ్యమగుట అనుసాధ్యముచేత వ్యాప్యమైన నలుపురంగు గలది చీకటి అను పరామర్శవలన చీకటి ఆకాశాదిపంచకమందు అంతర్భావముగాని ద్రవ్యము అను అనుమితి సిద్ధించును "అతఏవ" అనుదానిచే గాలియందుకూడా అంతర్భావముగాదు అని చెప్పుచున్నాడు చీకటి (వాయువు) గాలియందు అంతర్భావముగాని ద్రవ్యము నలుపురంగు గలదగుటవలన స్పర్శ లేకపోవుటవలన, ఎప్పుడు చలించుట (సదాగతిమిత్వాము) అను క్రియ లేకపోవుటవలన ఈ మూడు ప్రత్యేక హేతువులు. వాయువునందు అంతర్భావముగాని ద్రవ్యమగుట అను సాధ్యముచేత వ్యాప్యమైన నలుపురంగు గలది చీకటి, వాయువునందు అంతర్భావముగాని ద్రవ్యమగుట అనుసాధ్యముచే వ్యాప్యమైన స్పర్శాభావము కలది చీకటి, వాయువునందు అంతర్భావముగాని ద్రవ్యమగుట అనుసాధ్యముచే వ్యాప్యమైన సదాగతి మత్త్వాభావరూప హేతువుకలది చీకటి అను పరామర్శలవలన చీకటి వాయువునందు అంతర్భావముగా ద్రవ్యముఅను అనుమితి సిద్ధించును అటులనే చీకటి తేజస్సునందు అంతర్భావముగాని ద్రవ్యము భాస్వరరూపములేని దగుటవలన, ఉష్ణస్పర్శ లేనిదగుటవలన తేజస్సునందు అంతరావ్భముగాని అవ్యమగుట అను సాధ్యముచే వ్యాప్యమైన భాస్వరరూపము లేనిది చీకటి అను పరామర్శవలన చీకటి తేజస్సునందు అంతర్భావముగాని ద్రవ్యము అను అనుమితి సిద్ధించుచున్నది చీకటిజలమునందు అంతర్భావముగాని ద్రవ్యము, శీతస్పర్శ లేకపోవుటవలన, నలుపురంగు ఉండుటవలన, జలమునందు అంతర్భావముగాని ద్రవ్యమగుట అను సాధ్యముచే వ్యాప్తమయిన శీతస్పర్శాభావముకలది చీకటి అను పరామర్శవలన చీకటి జలమునందు అంతర్భావముగాని ద్రవ్యము అని అనుమితి సిద్ధించును చీకటిపృథివియందు అంతర్భావముగాని ద్రవ్యము గంధము లేకపోవుటవలన, స్పర్శ లేకపోవుటవలన పృథివియందు అంతర్భావముగాని ద్రవ్యమగుట అను సాధ్యముచే వ్యాప్యమైన గంధములేకపోవుటను కలదిచీకటి అను పరామర్శవలన చీకటిపృథివియందు అంతర్భావము కాని ద్రవ్యము అని అనుమితి సిద్ధించును. చీకటి పదవద్రవ్యము క్లుప్తద్రవ్యములో అంతర్భావముగాని ద్రవ్యమగుటవలన అను అనుమానమువలన చీకటికిదశమ ద్రవ్యత్వము సిద్ధించుచున్నది. ఇది పూర్వపక్షము ఈ పూర్వపక్షము సరియయినది కాదని చెప్పుచున్నాడు

మూ॥ తమసస్తేజోభావరూపత్వాత్. తదాహి.
తమోనరూపిద్రవ్యం ఆలోకాసహకృత చక్షుర్గ్రాహ్యత్వాత్ ఆలోకాభావవత్। రూపిచాక్షుషప్రమాయామాలోకస్య కారణత్వాత్।తస్మాత్ప్రౌఢప్రకాశక తేజస్సామాన్యభావస్తమః। తత్రనీలంతమశ్చలతీతి ప్రద్యయోభ్రమః। అతోనవద్రవ్యాణీతి సిద్ధం

సిద్ధాంతము - చీకటి తేజోభావరూపమగుటవలన ద్రవ్యముగాదు దానిని సాధించుచున్నాడు. తదాహి అని తమస్సు రూపము గలిగిన ద్రవ్యముగాదు వెలుగుతో గూడుకొననికంటివలన ప్రత్యక్షమగుటచేత లోకములో రూపముగలవస్తువు ప్రత్యక్షమగుటకు వెలుగు కారణము చీకటి ప్రత్యక్షమగుటకు వెలుగు కారణముగాదు అందుచే చీకటిరూపముగల వస్తువుగాదు రూపములేదుగనుక ద్రవ్యము గూడాకాదు పై కారణమువలన ప్రౌఢప్రకశముగల తేజస్సుయొక్క సామాన్యభావము

చీకటి "నీలం తమశ్చలతి" అను ప్రతీతి భ్రమ రూపమయినది. అందుచే ద్రవ్యము లు తొమ్మిది మాత్రమే అని సిద్ధించుచున్నది

మూ॥ ద్రవ్యత్వ జాతిమత్వం గుణవత్వం వా ద్రవ్యసామాన్యలక్షణం.

పదార్థ తత్వజ్ఞానము మోక్షకారణము. ఆ పదార్థతత్వజ్ఞానము లక్షణము లేక కలుగదు అందుచే ద్రవ్యములకు సామాన్యలక్షణమును చెప్పుచున్నాడు "ద్రవ్యత్వ జాతిమత్వం"అని ద్రవ్యమునకు ద్రవ్యజాతి కలిగియుండుట అనునది వ్యావహారిక లక్షణము ఇతరభేదమును సాధించు వ్యావర్తక లక్షణమును చెప్పినాడు "గుణవత్వం"అని ద్రవ్యమునకు వ్యావహారిక లక్షణముగా చెప్పిన ద్రవ్యత్వ రూపజాతి సిద్ధించు అనుమానప్రకారము ఎటులననగా కార్యముయొక్క సమవాయి కారణత్వము యేదియో ఒక ధర్మముచే అవచ్ఛిన్నమైనది. కారణత్వమగుట వలన దండమందలి ఘటకారణతవలె, కార్యముయొక్క సమవాయి కారణత అనునది పక్షము యేదియో ఒక ధర్మముచే అవచ్ఛిన్నమగుట అనునది సాధ్యము కారణత్వ మగుటవలన అనునది హేతువు. ఘట నిరూపితమైన దండ (కఱ్ఱ)యందలి కారణత అనునది దృష్టాంతము. దండయందలి కారణత దండత్వావచ్ఛిన్నమైనది దండమందలి కారణతయందు కారణతాత్వమను హేతువు ఉన్నది. ఎచట ఎచట హేతువు ఉన్నదో అచట సాధ్యము ఉన్నందున ఇది సద్ధేతువే యేదియో ఒక ధర్మముచే అవచ్ఛిన్నమగుట అను ధర్మముచే వ్యాప్యమైన కారణతాత్వముకలది కార్యనిరూపిత కారణ అను పరామర్శవలన కార్యనిరూపిత కారణమేదియో ఒక ధర్మముచే అవచ్ఛిన్నమైనది అను అనుమితి సిద్ధించగా ఆద్రవ్యత్వము జాతియగుట లాఘవము అను లాఘవజ్ఞాన సహకృతమైన పరామర్శవలన ఆ కారణతకు తగ్గ నటువంటి హెచ్చునటువంటి ద్రవ్యత్వ రూపమైన జాతి సిద్ధించును.

*

బిరుద ప్రదానము

శ్రీ అయితం కాళీవరప్రసాదరాయకవి

౧

ఈతండపరవ్యాసుం డాతఁడు నవకాళిదాసుఁడతఁడే వాగ్భా
ధాతృండితఁడే యభినవ పోతన! వాల్మీకివాఁడె! భోజుఁడతండే.

అనుచు సభలయందు వినుతిఁగాంచిన యట్టి
కవులఁదలచి వారిఘనతఁ దలచి
యట్టి బిరుదమొకటి ప్రాప్తించు నెప్పుడో?
బ్రహ్మరథము బుధులు పట్టు నెపుడో?

అపరవ్యాసుఁడు వాఁడె విపులాంధ్రవనిలోన
నెట్టి పూబందిరుల్ గట్టినాఁడొ!
వాఁడె ప్రస్తుత కాలవాల్మీకి! ప్రథముఁడై
యెట్టి కావ్యము వెలి పెట్టినాఁడొ?
అభినవకాళిదాసాతఁడే ఘనుడు వాఁ
డెట్టి కైతను మేడ గట్టినాఁడొ
ఆతడే యభినవ పోతన! ప్రజలకై
యెట్టి భక్త్యమృతంబు పెట్టినాఁడొ

అట్టివారిలోన నగ్రగణ్యతఁ గూర్చు నబ్బురంబు బిరుదమబ్బ కొఱకు
నెవరి బట్టవలెనో! ఏమి సేయవలెనో ఎఱుఁగజాలను నిదమిత్థమనుచు.

కాళీభక్తుఁడ గావునఁ గాళీదయఁ గవనశక్తి గలిగెను గానన్
గాళీదాసుని గాదను బాళిని "జితకాళిదాస" పదము గ్రహింతున్,

దివ్యమిత్రులు పత్రికాధిపులు నాకు కలరు చెలికాండ్రు పెక్కురుకవులు నాకు
శిష్యవర్గము పండితశ్రేణి గలదు గూర్తు సభ రేపె బిరుదంబుఁ గొనెదఁ బ్రీతి

అని తబ్బిబ్బున మిట్టి మీనయిన భావానంద విభ్రాంతిలో
దినమెల్లంజనె, నంతవచ్చెనిశి, నిద్రింపంగఁ దల్పంబునన్
దనువుం జేర్చితి, నిద్ర రాదెదుట సత్కారంబు నిండోలగం
బును దానజ్జిత కాళిదాస బిరుదంబుంగందు మత్సన్నిధిన్.

ఎటులో కనుమూయఁగ దిన నటనానంతర సుఖజననస్థలి నిద్రన్
చటులభ్రూకుటి పటిమోద్భట నిటలాకృతి యొకండు దర్శనమిచ్చెన్.

స్నిగ్ధాయత లలాట సిందూర రేఖతో
నరుణీకృతాక్షి సఖ్యంబుసలుప
ఉన్నతాంసవతంస యుగ్మంబు మీఁదుగా
రత్నరుక్శాటి జీరాడుచుండ
సంభృత బ్రహ్మవర్చసముతోడి ముఖాన
నద్రిభిద్దర్భ్య మహస్సులొలయ
సంరంభకుంభీంద్ర సమగతి స్గుంజత్సు
వర్ణమంజీరము ప్రభలనింప

పైడిచేలంబు గట్టి పావలనుమెట్టి పొడవ్రడాకేల తాళసంపుటము బట్టి
తలసు పైకెత్తి చూపుతూపులను గొట్టి కట్టెదురనిల్చె సుకవి సమ్రాట్టతండు.

శూలసమాన దృష్టినిశిత సూక్ష్మమరీచులగుండెఁ జీల్చుచున్
మ్రోలను హుంకరించి చిరుపుర్వఁగ నగ్నని పాదతాడనన్
చాలనమై ధరాస్థలి భృశంబు వడంకఁ శిరంబు నూఁచుచున్
మాలనిఁగాంచు నైష్ఠికునిమాడ్కినిఁ జూచుచు నిల్చెఁ జెంగటన్.

ఆతనిచూపుతోఁ గనులయందలి తేజమదృశ్యమయ్యె నా
చేతము జల్లనెన్దిరిగె శీర్ణమనీషయు మంథరభ్రమిన్
పాతకుఁ డుగ్రదండధరు పజ్జను నిల్చినయట్టులయ్యె కా
ల్చేతులు కాళులున్నవడఁకెఁ జెమ్మటపుట్టెను ముమ్మరమ్ముగాన్.

అటులఁ దెలివిదప్పి యతనిఁజూడఁగఁ గొంకి తెమ్ముగానకున్న నన్నుఁగాంచి
పుండుమీద పెద్దబండ గొట్టిన యట్టు లుటిమి యనల కణములురులఁ బలికె.

ప్రతిభాజన్య జ్ఞానము

బెర్ ట్రండ్ రసెల్

అనువాదం · జి. ఎస్. ఎన్.

౧౧

నేడు మనము విశ్వసించు ప్రతి విషయమును సహేతుకముగా నిరూపించుటకుగాని అధికముగా సంభవమని చెప్పుటకుగాని సంపూర్ణావకాశము గలదను నభిప్రాయము విశేషముగ ప్రచారములో నున్నది. హేతువును చూపుటకు వీలులేని ప్రతివిషయమును మూఢవిశ్వాసముగ పరిగణించుటకద్దు ఒకవిధముగా నీ యభిప్రాయము చాలవరకు నిజమని చెప్పవచ్చును మన కెల్లఱకును సర్వసాధారణములై యొప్పు విశ్వాసములన్నియును అనుమితములో లేక అట్లగుటకు యోగ్యములో అయియుండవలయును. ఈ యనుమితులు తదితరములగు విశ్వాసములచే గమ్యమానములగుచున్నవి ఈ విశ్వాసము లే పై యనుమితులకు ప్రబలములగు హేతువులను సమకూర్చి పెట్టుచున్నవి సామాన్యముగా నట్టి హేతువు జ్ఞాపకము చేసికొనుటకు వీలుగా నుండదు ఎక్కడనో మనస్సునకు అట్టఅడుగున బడియుండును. ఉదాహరణకు - మనలో నెవ్వరును మనమిప్పుడే తినబోవు నాహారమెందుకు విషముగా పరిణమింపదనుటకు హేతువు నడుగరు కాని దానికి హేతువును చూపవలసినదని జిజ్ఞాసువు లెవ్వరైన సవాలుచేసినచో, సమీచీనమగు హేతువును చూపజాలని పరిస్థితిలో మనములేము. ఇట్టి విశ్వాసముండుటలో మనము పొరబడి యుండలేదు.

కాని సోక్రటీసువంటి తత్త్వజిజ్ఞాసు వెవ్వడో వచ్చి మనమే హేతువును జూపినను,ఆ హేతువునకు హేతువును జూపుమని ప్రశ్నింపబోడగెననుకొందము చివరకు మనమిక ఎట్టి హేతువును చూపలేనంతవఱకును, ఈవిచికిత్స కొనసాగుట కభ్యంతరములేదుగదా దైనిక జీవితములో సర్వసాధారణములగు కొన్ని విశ్వాసములలో ప్రారంభించి. నిరూపణ యక్కఱలేని ఒకానొక సాధారణ సిద్ధాంతమునో, లేక అట్టి సిద్ధాంత మన్వయించు ఒక యుదాహరణమునో నిర్ధారణముచేసికొనువఱకు, ఒక యంశమునుండి వేఱొక యంశమునుసిద్ధాంతీకరించుచుపోగలము దైనిక జీవితమునకు సంబంధించిన సమస్యల విషయమున, ముఖ్యముగా మనము తినెడు నాహారము మనకు పోషకమేగాని వెగటు కాదనుటవంటి సమస్యల విషయమున నిర్ణయించుటకు ఆరవ యధ్యాయమున మనమింతకుపూర్వము చర్చించిన వ్యాప్తిసాధక సిద్ధాంతమునకు పోవలసివచ్చును ఇంతకంటె మనకు వెనుకకు బోలేమనిపించును. ఈ సిద్ధాంతమునే తెలిసి యొకప్పుడు, తెలియక యొకప్పుడు, మనము మన హేతువిధానముతో వినియోగింతుము. కాని వ్యాప్తిసాధక సిద్ధాంతమును నిర్ధారణచేయుటకు ననువుగా నంతకన్న సులువైన స్వతసిద్ధ ప్రమాణమేదియును మనకు లభించుటలేదు తదితరములగు తార్కికసిద్ధాంతములకు గూడ పైవిషయమే యన్వయించును వాని యాథార్థ్యము విషయమై మనకు సందియమే కలుగదు. మన మనేక నిరూపణములలో వానిని వినియోగింతుము కాని వానినిమాత్రము అథమము వానిలో కొన్నింటినైనను తదితర హేతువులచే నిరూపింపవలనుపడదు.

ఏది యెట్లున్నను, ఈస్వతః ప్రామాణ్యము, నిరూపణకు నలవికాని సామాన్య సిద్ధాంతములలో నిమిడియున్నవానికే పరిమితము కాలేదు కొన్ని తార్కికసిద్ధాంతములను మన మంగీకరించినపుడు, వానినిబట్టి తక్కిన సిద్ధాంతములను నిర్ధారణ చేయవచ్చును కాని వానినిబట్టి తేలిన యంశములకు, నిరూపణ యక్కఱలేకయే యంగీకరించిన యంశములకువలె,స్వతః ప్రామాణ్యముగలదు. గణితశాస్త్ర మంతయును, సామాన్యతార్కిక సిద్ధాంతములను బట్టి నిరూపింపవీలగును కాని ఈ తార్కికసిద్ధాంతముల కెంత స్వతః ప్రామాణ్యముగలదో, రెండును,రెండును నాలుగగునన్న ప్రమేయవాక్యముల కంతస్వతః ప్రామాణ్యముగలదు.

ఇది కొంత వివాదాస్పదమైనను, మనము మంచినే అవలంబింపవలయును, వట్టి స్వతస్సిద్ధములగు నైతికసిద్ధాంతములు కొన్నియున్నట్లు కన్పట్టును.

సామాన్య సిద్ధాంతములకు సంబంధించిన యుదాహరణము లన్నింటిలో, పరిచితవిషయములనుగాని వస్తువులనుగాని తెలుపు ప్రత్యేకో

దాహరణములకు, సామాన్యసిద్ధాంతములకంటె నధికప్రామాణ్యము గలదని,తెలిసికొనవచ్చును. ఉదాహరణమునకు విరోధసూత్రము ననుసరించి ఏవస్తువునకైనను ఒకగుణ మేకకాలమున నుండుటయు, లేకపోవుటయు అనునది సంభవింపదు. ఇది యవగతమైనంతనే ఇందలి యాథార్థ్యము గోచరించుటలో కష్టమేమియును లేదు. కాని ఒక గులాబిపువ్వునకు ఏకకాలముననే ఎఱ్ఱిరంగు ఉండుటయు, లేకపోవుటయు ననునది సంభవింపదు అను వాక్యములో మనకు గోచరించినంత యాథార్థ్య మాసామాన్య సిద్ధాంతమున గోచరింపదు కాని గులాబిపువ్వు కొంత యెఱ్ఱగా నుండుటయు, కొంత ఆ రంగులో లేకపోవుటయు ననంభవముగాదు. లేక దానిని ఎఱ్ఱనిదిగా చెప్పుటకు చెప్పకుండుటకు గాని వీలు లేనట్లుగా గూడ నది యుండవచ్చును. కాని వెనుకటి సందర్భమున, గులాబిపువ్వంతయు నెఱ్ఱగా లేదనుట స్పష్టము రెండవ సందర్భమున, ఎఱుపు అనగానేమో స్పష్టముగా నిర్వచించుకొనగల్గినచో పరిస్థితి సుకరమగును కాని ప్రత్యేకోదాహరణములను బట్టియే, మనము సాధారణసిద్ధాంతము నవగతము చేసికొనగల్గుదుము దురవగాహములైన విషయములను ప్రతిపాదించుటలో సుశిక్షితులగువారేఉదాహరణముల యక్కఱలేక సామాన్యసిద్ధాంతమును శీఘ్రముగ గ్రహింపజాలుదురు

ఈ సామాన్య సిద్ధాంతములు కాక, ఇంద్రియ గ్రహణముచే నుపలబ్ధములగు మరికొన్ని స్వతస్సిద్ధసత్యములుగలవు అట్టిసత్యములను మనము ప్రత్యక్ష సత్యములని వ్యవహరింతము వానిని వ్యక్తీకరించు నిర్ణయములను ప్రత్యక్షనిర్ణయములని వ్యవహరింతము కాని స్వతస్సిద్ధములగు సత్యములనగా నేమో యవగతము చేసికొనుటకు ఇచ్చట కొంతజాగ్రత్త యవసరము. అసలు ఇంద్రియార్థములు యథార్థమును కావు, కాకనుపోవు ఉదాహరణకు, నేను చూచు రంగుగల వస్తువొకటి యున్నది ఇందులో నిజానిజములను మనకు నిర్ణయించుట కవకాశ మేర్పడినది అట్టి వొస్తువొకటి యున్నమాట నిజమే. దాని కొక యాకారముండుటయును, దాని కొకానొక యెరుపు ఉండుటయు, దానిచుట్టు మరికొన్ని రంగులుండుటయు నివి యన్నియును నిజమే కాని ఆరూపముమాత్రము, ఇంద్రియగోచరములగు సర్వవస్తువులవలెనే,యథార్థమో అయథార్థమో అనిచెప్పుటకు వీలైనవస్తువులకు పూర్తిగా విభిన్నమైనది కావున దాని యాథార్థ్యమును నిరూపింప వలనుపడదు. కావున మన యింద్రియములవలన నుపలబ్ధములైన స్వతస్సిద్ధ సత్యములమాట యెట్లున్నను, వానివలన నుపలబ్ధములైన ఇంద్రియార్థములకవి సంపూర్ణముగా విభిన్నమై యుండవలెను.

చివరిదశలో నొక్కటిగ పరిణమించినను, స్వతస్సిద్ధములగు ప్రత్యక్ష సత్యములు రెండు తెగలుగా కన్పట్టును వానిలో కేవలము ఇంద్రియార్థపు ఉనికిని (అవ్యాకృతదశలో) వ్యక్తము చేయు తెగయొకటి మనమొక యెఱ్ఱని వస్తువును గాంతుము. లే ఫలానా ఎఱ్ఱనిరంగుగలిగిన వస్తువు అనియో లేక ఇది యట్టిదనియో మనము నిర్ణయింతుము ఇది యొకానొక యలౌకికప్రత్యక్షము (ప్రతిభాగతమగుశక్తి) వలన చేసికొనిన నిర్ణయము. ఇంద్రియగోచరమగు వస్తువు పరిశీలనపైగాని గ్రహించుటకు వీలులేని దైనప్పుడు, రెండవతెగ కవకాశమేర్పడును దానివలన కలిగిన జ్ఞానమును తిరిగి విభజన మొనరింతుము. ఉదాహరణకు, మనమొక తెల్లని, గుండ్రని వస్తువును చూచినచో, మనమా ఎఱ్ఱనివస్తువు గుండ్రముగా నున్నదని నిర్ణయింతుము. ఇది ప్రత్యక్ష జ్ఞానమును గూర్చిన నిర్ణయము కాని యది వెనుకటి తెగకు విభిన్నమైనది మన యిప్పటితెగకు సంబంధించినంతవఱకు, రంగును రూపునుకలసి యున్న యింద్రియార్థమును మన కనుభూతమగును రంగు ఎఱ్ఱన రూపు గుండ్రన దానిని గూర్చిన మన నిర్ణయము ఆ యింద్రియార్థమును రంగు, రూపు, అవి రెండు విధములుగా విభజించును తరువాత ఎఱ్ఱనిరంగుగల వస్తువు ఆకారమున గుండ్రమైనదని తెల్పి రెండింటిని సంయోజనపరచును. ఇదియు, అదియు, అనువాని నేకకాలమున నవగతము చేసికొనునపుడు, ఇది దానికి కుడిగా నున్నది, అనునది యిట్టి నిర్ణయమున కొక యుదాహరణము. ఇట్టి నిర్ణయమున నింద్రియార్థము పరస్పరము సంబంధముగల కొన్ని యంశములతో గూడియుండును ఈ యంశములకిట్టి సంబంధమున్నదని యా నిర్ణయము తెలుపును

ప్రత్యక్షజ్ఞానమునకు సంబంధించిన నిర్ణయములకు పూర్తిగా విభిన్నమైన నిర్ణయకక్ష్య(Class of Judgment) యొకటి గలదు. ఆ నిర్ణయములు స్మృతికి సంబంధించినవి ఈ స్మృతి యెట్టిదాయని విచారణకువచ్చినపుడు ఎంతయో తికమకకు లోనగు ప్రమాదముగలదు ఒకవస్తువును జ్ఞాపకముంచుకొనునపుడు, దానితోపాటు వస్తువుకు సంబంధించిన ప్రతిబింబము నొకదా

నిని మనస్సులో కల్పించుకొనుట గూడ జరుగును. అయినను జ్ఞప్తిలో నున్నదియు, మనస్సులో దానివలన నిలిచిన ప్రతిబింబమును ఒక్కటిగాదు. ఏలన ప్రతిబింబము ప్రస్తుతకాలమునకు సంబంధించినది, మనకు జ్ఞాపకములో నున్నదానితో నీ ప్రతిబింబమును పోల్చిచూచుటకు వీలుండును. దీనినిబట్టి మన మనస్సులో నిలిచిన ప్రతిబింబ మెంతవరకు యధార్థమో తెలిసికొనుటకు వీలుపడును కాని ప్రతిబింబము కాక అసలువస్తువు యథాతథముగా మనమనో నేత్రమున గోచరముకాకపోయినచో నిది యసంభవమయ్యెడిది

కావున జ్ఞాపకములోనున్న దానిలో ప్రతిబింబములేదు కాని గత కాలమునకు సంబంధించినదిగా గుర్తింపబడిన వస్తువుగలదు ఈస్మృతి యనునదిలేకపోయినచో, గతమునునది యున్నట్లు మనకు తెలిసి యుండకపోయెడిది, కావున స్మృతికి సంబంబంధించిన నిర్ణయములు కొన్ని యుండి తీరవలెను. వానిమీదనే గతకాలమునకు సంబంధించిన సర్వజ్ఞానమును ఆధారపడి యున్నది.

కాని ఈస్మృతి విషయములో కొన్నిసందేహములకాస్కారము లేకపోలేదు సాధారణముగా దానివలన నేర్పడిన నిర్ణయము లెంతవఱకు విశ్వాసయోగ్యములా యనిపించును ఈ సమస్య యంతతేలికగా కొట్టివేయుటకు వీలులేదు కాని యది యెంతవరకు మన కుపాదేయమో విస్పష్టముగా తెలిసికొనుట మంచిది స్థూలముగా చెప్పవలెనన్న, మనకు గలిగిన అనుభవములోని చిక్కదనమును (స్పష్టతను) బట్టియు, కాలగతమగు సన్నిహితత్వమును బట్టియు స్మృతిని నమ్ముటకు వీలుండును. పక్క ఇంటిపై నొక్కసారి మెరపు మెరసినచో, నేను చూచి విన్నదానినిగూర్చిన స్మృతి అసలు మెరపు అనునది యున్నదా యను విషయమై సందేహమును వెల్లడించుట వెఱ్ఱియనిపించునంత నమ్మదగినదిగ నుండును అదియే అంతకంటె కొంత తక్కువగా అనుభూతములైన విషయములకు- ముఖ్యముగా నవి యిటీవలివైనచో - అన్వయించును. అరనిమిషము క్రింద, నేనిప్పుడు కూరుచున్న కుర్చీలో కూరుచుంటినను విషయమై నాకుగల జ్ఞాపకశక్తిని శంకించుటకు వీలులేదు అంతకు పూర్వము, ఒక్కరోజు వెనుక, నేను నమ్మకముగా నిజమని చెప్పదగిన విషయములను గూర్చియు, ఇంచుమించు నమ్మకముగా నిజమని చెప్పదగిన విషయములను గూర్చియు, తరువాత కొంత ఆలోచించి, ఆ సంఘటనకు త్రోవదీసిన ఇతర పరిస్థితులను జ్ఞప్తికి దెచ్చుకొని దానినిబట్టి నిర్ణయింపదగిన విషయములను గూర్చియు, చివరకు నమ్మకముగా చెప్పుటకు వీలులేని సంగతులను గూర్చియు, మనకు ప్రతీతి గలుగుచున్నది. ఈ ఉదయమే నేను భోజనముచేసిన విషయమై నాకు సందేహమేమియులేదు కాని దాని విషయమై యేమియు పట్టించుకొనని విషయమై యిట్టి సామాన్య సంఘటనము విషయమై సందేహము గలుగుట కాస్కారము లేకపోలేదు భోజనము చేసినప్పుడు జరిగిన సంభాషణము కొంత సులభముగా జ్ఞాపకము చేసికొనవచ్చును మరికొంత కష్టపడి జ్ఞాపకము చేసికొనుటకు పెద్ద యడ్డంకి యేమియు నుండదు. కొన్నిసంగతుల విషయమై చాలవరకు సందేహములు వెల్లడించుటకు వీలున్నది కొన్ని సంగతులు పూర్తిగా జ్ఞాపకము గూడ లేకపోవచ్చును కావున నేను జ్ఞాపకము చేసికొన్నదానిలో నెంతవరకు యధార్థముగ నమ్మదగినదో, అను విషయమై వరుసగా తరతమభేదములు గమనింపదగినవి దానినిబట్టి నా జ్ఞాపకశక్తి యెంతవరకు నమ్మదగినదో తెలిసికొనుటకు వీలుపడును

కావున స్మృతికి ఎట్టి ప్రామాణ్యమున్నదో, దానిలోగల తరతమ భేదము లెట్లుగలవో ఇటీవల మనకు విస్పష్టముగా ననుభూతములైన సంగతుల విషయమై యది యెంతవఱకు యధార్థముగా నమ్మదగినదో తెల్లమైనది

కాని మనము జ్ఞాపకము చేసికొనువానిలో పూర్తిగా నబద్ధమైనవి కొన్ని లేకపోలేదు ఇట్టి స్థితిలో నిజముగా జ్ఞాపకమున్నది-వెంటనే మనస్సులో పడినది అను అర్థములో - అయథార్థముగా విశ్వసింపబడుదానికి పూర్తిగా నతిరిక్తమైనది. నాల్గవజార్జి, తాను వాటర్లూ యుద్ధమునను న్నట్లు విశ్వసించుచుంటినని చెప్పుకొనుట కలదు. ఈ నమ్మకమునకు తాను యుద్ధములో నున్నట్లు చెప్పుటతప్ప వేఱుఆధారములేదు ఈ సందర్భములో, జ్ఞప్తిలోనున్నది, అసలు యుద్ధములో నుండుటట్లున్నను యుద్ధములో నున్నట్లు తాను చెప్పిన విషయము కాబట్టి ఇట్టి విషయమై జ్ఞాపకశక్తి నమ్మదగినదిగాదు. ఇట్టివే జ్ఞాపకశక్తిని నమ్ముటకు వీలులేని యుదాహరణములు మరికొన్ని గలవు

స్మృతి విషయమైగల స్వతః ప్రామాణ్యములో కొన్ని తరతమ భేదములు గలవనుట చాల ప్రధానమైన విషయము. అసలట్టి స్వతః ప్రామాణ్యమున్నదా లేదా యను విషయము

గాదు ప్రధానమైనది. కాని యీ ప్రామాణ్యము లోని తరతమ భేదములు అనగా పూర్తిగా అయ థార్థమని నమ్మదగిన దశనుండి యేమియు నిజ మని నమ్ముటకు వీలులేని దశవఱకుగల క్రమమే గమనింపదగినది. ప్రత్యక్షజ్ఞానమువలన, తేలిన సత్యములకును కొన్ని తార్కిక సిద్ధాంతముల కును అత్యధికమగు స్వతఃప్రామాణ్యముగలదు. ఆనంతరికమగు స్మృతివలన సిద్ధించిన సత్యము లకుగూడ నించుమించు నంతే స్వతః ప్రామా ణ్యముగలదు. వ్యాప్తిసాధక సిద్ధాంతము - ఒక హేతువాక్యము నిజమైనచో దానిని బట్టి యూహింపబడునదిగూడ యథార్థమే యను సిద్ధాంతమువంటి తదితర తార్కిక సిద్ధాంతము లకంటె తక్కువ ప్రామాణ్యముగలదు. స్మృతు లకు, వెనుకకుపోయినకొలది తక్కువప్రామాణ్య ముండును. గణితశాస్త్ర సిద్ధములగు సత్యము లకును, తర్కశాస్త్ర సిద్ధములగు సత్యములకును వాని సంక్లిష్టతనుబట్టి ప్రామాణ్యము తగ్గును. ఇవిగాక నైతికలక్ష్యములకు సంబంధించిన సత్య ములకుగూడ కొంతవఱకు ప్రామాణ్యముగలదు కాని యదియంత యధికముకాదు. జ్ఞానసిద్ధాం తము విషయమున స్వతః ప్రామాణ్యమునకు గల తారతమ్యములు చాల ప్రధానములైనవి. ఏలన కొన్ని ప్రమేయవాక్యములు, యధార్థము కాకున్నను కొంతవరకు స్వతః ప్రమాణములగు టకు నవకాశమున్నచో. స్వతః ప్రామాణ్యము నకును, సత్యమునకునుగల సంబంధమునంతను తిరస్కరింపవలసిన యావశ్యకత యేమియును లేదు. కాని స్వతః ప్రామాణ్యముగల రెండు ప్రమేయవాక్యములలో నేదియధిక ప్రమాణమను సమస్య వచ్చినపుడు, వానిలో దేనికి స్వతః ప్రామాణ్య మధికముగాగలదో, దానిని పరిగ్ర హించి, అల్పమగు స్వతః ప్రామాణ్యము గల్గిన దానిని తిరస్కరింపవచ్చును.

ఏమైనను, స్వతః ప్రామాణ్యమను దానిలో రెండు విషయములు ఇమిడియున్నవి. వానిలో దేనికధికతమమగు స్వతః ప్రామాణ్యముగలదో ఆ విషయమే యథార్థమైనదిగను, ఏవిధముగ నైనను నందు దోషమునకు తావులేదనుట యొకటి. ఆ విధముగ పూర్తిగా స్వతః ప్రామా ణ్యము లేక, అందులో తరతమభేదము లేర్పడు ప్రమేయవాక్యములలో ఆ తారతమ్యమును బట్టియే వాని యాథార్థ్యమాధారపడి యుండును. కావున యాదార్థ్యమేమో, తద్వ్యతిరిక్తమేమో ప్రతిపాదనము చేసినపిమ్మట జ్ఞానము, భ్రాంతి అను నీ రెండింటికినిగల భేదమును వివేచనము చేయు సందర్భమైన నీ స్వతః ప్రామాణ్యమును గూర్చి విచారింతము.

సమాధి

శ్రీ శనగన నరసింహస్వామి, ఎం. ఎ

ఎన్నిసారులు ప్రత్యూషమిచ్చగించి కాశ్యపీదేవి నిద్ర మేల్కనుట లేదు
నాడు తెలవారి నట్టులేనాడు గూడ తెల్లవారుట సృష్టి సంధిల్లలేదు.

రాజ మరాళమానస సరశ్శుభయాన వినోద కాకలీ
కూజనముల్ ప్రభాతకృత కోమలగాన సఖమ్ములై, సహాం
భోజ మనఃప్రియ ప్రథమపూజల నూర్ధ్వముఖుండు మా భర
ద్వాజుడొకండు నివ్వెఱగువడ్డయుషో మహసుల్ మహీయముల్.

పొడుచుకొని వచ్చు సూర్యదేవుని సహస్ర
మలిన కిరణాలు పశ్చిమాచల ముఖద్వ
యీ నత మహేంద్ర కార్ముకా నూనవర్ణ
సేచనమ్ముల కర్బురశ్రీ వహించె.

ఆచమించి జలమ్ము, ప్రాచ్యాగ్రదర్భ ప్రస్తరాధ్యాసి, ఘనజటాపారి, ధాతృ
ఛాత్రుడు, తపస్వి రామచారిత్ర సత్య సమ్యగన్వేషణా శీలశాలి యయ్యె.

కీర్తిధ్వజాంక సాకేతరాజ్య స్వర్గ సర్వాంగపూజ్య ప్రజాబలమ్ము,
సకలర్తు లక్ష్మీదశానిత్య నూతన దండకారణ్య సౌందర్యగరిమ,
అద్భుతావహవానరాహార్యధుర్య కిష్కింధా మహీజన్మ సిద్ధశక్తి,
లంకాపురీ ధరాలంకార లోకత్ర యీ గర్వభంజక భోగవార్ధి

భావనాధీనమై, ప్రతిభాబలీయ చతురాలీనమై, రసాధ్యనుసరణి
వాఙ్మనో గోచరమ్మయి వచ్చి, మౌనిలేఖిని వరించి మించి యాలేఖ్యమయ్యె.

ఎండిపోయిన మ్రాకుపిండు కొమ్మలమీద తలిరాకు గుబురులు దండగట్టె
తరుణ పల్లవరక్త కిరణజాలము నుండి మొగము జూపించెను మొగ్గచాలు
మందసౌగంధ్య కుట్మలగుచ్ఛములలోన పాండుహాసము జేసె ప్రసవపంక్తి
మకరంద పుష్పసామ్రాజ్యమ్ములో జొచ్చి పలుకరించెను ప్రౌఢఫలచయమ్ము

ప్రౌఢఫలము పచేళిమ ప్రాప్యమయ్యె; విశ్వజనరాజి పులకించి వివశమయ్యె
లోక కళ్యాణకారి వాల్మీకి వీరకరముతో ధీరఘంటము కదలువేళ.

అర్థమే ముందుతోచునో, యధికరించి శబ్దమే ముందుతోచునో శయ్యముందు
తోచునో వ్యవధానము తోచకుండ నహమహమికమ్ముగా మిశ్రమగుచునడిచె.

అదియేమి, జానకిసుదతి వాచికమన్న పదపదమ్మున భయభ్రాంతుడగును
అదియేమి, రామసౌహార్ద సత్యగుణరేఖ కగ్గిపోవుట కింత మొగ్గబోడు
అదియేమి, రావణోన్మద బాహుదుర్మార్గ బుద్ధిపేర్చుచు సానుభూతి జూపు
అదియేమి, రాక్షసీ మదిరావిలోకనా సాధ్వీత్వ కల్పనా శ్రద్ధపడును

అతడు కవిరాజు మునిరాజు నతనికేమి పక్షపాతములేదు ప్రత్యక్షమైన
పరమసత్యము జాలు నిర్భరధురీణ ఘంటము ధరించినాడు త్రైకాలికముగ.

ఒకనాడు మానస ముగ్ధ్రాతలూగునో భావనావీథిలో బరుగులెత్తు
ఒకవేళ నిగ్రహమ్మూని నానావిధ పాత్ర చిత్రణమున బరవశించు
ఒకసారి సృష్టి సాత్త్వికపర్యవేక్షియై ఋతుకల్పనమ్మున మతి మథించు
ఒకమాఱు వీరభావోల్లాస దాసుడై సమరాభి వర్ణనాసక్తి జెందు

నదనదీ దర్శనమ్మున ముదముపొందు
సాగరోల్లంఘనా శాక్రశత్వమందు
దూత్యభారమ్ము వహియింప తొందరపడు
కామగామియై బహురూపధాము డగును.

కౌటిల్యార్థశాస్త్రమ్

ఆంధ్ర వివరణము

శ్రీ పీడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి

౪

మూ॥ ప్రకృతి సంపదః। శమవ్యాయామికం
ఇతిమండలయోని షష్ఠమధికరణం.

ఆరవ యధికరణము మండలయోని. మండల మనగా సరిహద్దు రాష్ట్రముల కూటమి. (ఇది ద్వాదశ రాజమండలమని శాస్త్ర సంప్రదాయము) ఆ మండలమునకు మధ్యనుండి తన రాజ్యమును కాపాడుకొనుటకు సరిహద్దు రాష్ట్రాధిపతులతో మెలగవలసిన పద్ధతి. దానికై చేయదగిన కర్తవ్యము, కావలసిన విషయములు ఇందు సూచింపబడినవి ఇందు 2 ప్రకరణములు అధ్యాయములు గలవు. 1 ప్రకృతి సంపత్తులు. అనగా ప్రభులక్షణములు. (స్వామిసంపత్తు), మంత్రులు, గ్రామనగరాది నిర్మాణము, దుర్గములు, ధనము, సేన, మిత్రులు, శత్రువులు ఇత్యాదిరాజ్యాంగములు ఇందు వివరింపబడినవి 2 శమవ్యాయామికము. ఇతర రాష్ట్రములు తనరాష్ట్రమున చేరుటకై చేయు పెద్దపనులు వ్యాయామము. చేరిన రాష్ట్రములను తనతో విరోధించకుండ కాపాడుకొనుటకై చేసిన కార్యములవలని ప్రయోజనములను సమీక్షించుట శమము. ఈ శమవ్యాయామములు ఇందు నిరూపింపబడినవి. ఇది ఆరవ యధికరణము

మూ॥ 1. షాడ్గుణ్యసముద్దేశః। క్షయస్థాన వృద్ధి నిశ్చయః। 2. సంశ్రయవృత్తిః। 3. సమహీన జ్యాయసాంగుణాభి నివేశః। హీనసంబంధః। (సంధయః) 4. విగృహ్యాసనం,। సంధాయాసనమ్। సంభూయప్రయాణం 5. యాతవ్యామిత్రయో రభిగ్రహచింతా। క్షయలోభవిరాగ హేతవః। ప్రకృతీనాం సామవాయిక విపరిమర్శః। 6. సంహిత ప్రయాణికం।పరిపణితాపరిపణితాపశృతాశ్చ సంధయః। 7. ద్వైధీభావికాస్సంధి విక్రమాః। 8 యాతవ్యవృత్తిః అనుగ్రాహ్య మిత్రవిశేషాః। 9, 10, 11, 12 మిత్రహిరణ్య, భూమి అనవసిత, కర్మసంధయః। 13 పార్ష్ణి గ్రాహిచింతా। 14 హీనశక్తి పూరణమ్. 15. బలవతావిగృహ్యోపరోధహేతవః। దండోపనీతవృత్తం। 16 దండోపనాయివృత్తమ్। 17. సంధికర్మ సంధిమోక్షః। 18. మధ్యమచరితమ్। ఉదాసీనచరితమ్। మండలచరితమ్। ఇతిషాడ్గుణ్యం సప్తమమధికరణమ్.

ఆరవ అధీకరణమందు శమవ్యాయామికమను రెండవ ప్రకరణమున సంధి విగ్రహాదులయొక్క ఆవశ్యకత వాటి స్వరూపము (లక్షణము) వివరింపబడినది. ఈ ప్రకరణమున సంధివిగ్రహాదులను సంబంధించిన విషయము వివరింపబడెను. అందు 1. సంధి, విగ్రహము, యానము, సమాశ్రయణము, ఆసనము, ద్వైధీభావము అను నీ ఆరును షడ్గుణములు. వీటి సముదాయము షాడ్గుణ్యము షాడ్గుణ్యముయొక్క లక్షణములు,వాటిని సంబంధించి ఇతరుల వృద్ధిక్షయములు తన వృద్ధిక్షయములు సమస్థితి వీటి నిశ్చయము ఇదియే క్షయస్థాన వృద్ధినిశ్చయము. దీనింబట్టి సంధి విగ్రహాదుల నుపయోగించుటయు నీ 1వ ప్రకరణమున గలదు 2. సంశ్రయవృత్తి - క్లిష్టపరిస్థితులందొకని నాశ్రయించుట సంశ్రయము, ఇదియే సమాశ్రయణము. ఎపుడు ఆశ్రయింపవలెను? ఆశ్రయించి ఎట్లు మెలగవలెను? మొదలగు విషయము లిందుగలవు. 3. సమహీనాధికులయొక్క గుణాభినివేశము. హీనసంధులు ఇందు సములతో వివాదము వచ్చినపుడు హీనులతో వివాదము వచ్చినపుడు అధికులతో వివాదము వచ్చినపుడును ఏమిచేయదగినది? తనకంటె తక్కువవాడు హీనుడు, హీనునితో సంధి ఎట్లు చేయవలయును? సమహీనాధికులతో సంధి విగ్రహాది షడ్గుణములలో దేనివలన ఏయే లాభనష్టములు గలుగును? ఇదియంతయు వివరింపబడినది 4 విగ్రహించి యూరకొనుట,సంధిచేసి యూరకొనుట, విగ్రహించి (కలహించి) యుద్ధమునకు వెడలుట, సంధి చేసికొని యుద్ధమునకు వెడలుట, కలసి యుద్ధమునకు వెడలుట ఈ విషయము లిందు గలవు. 5. యుద్ధమునకు యాత్ర చేయదగినవాడు యాతవ్యుడు, మరియొకడు శత్రువు. ముందుగా నెవ్వరితో కలహింపవలెను? అను చర్చ తొలుత చేయబడెను. క్షయావస్థ లోభము, వైరాగ్యము గలుగుటకు కారణము లెవ్వి? ప్రజలు కొన్ని సంఘములుగ నేర్పడినపుడు వారిని ఎట్లు స్వాధీనము చేసికొనవల

యును? ఈ విషయము లిందు గలవు. 6 సంహిత ప్రయాణికము. పరిపణిత, అపరిపణిత, అపసృతములగు సంధులు. సామంతులగువారితో గలసి యుద్ధమునకై వెడలుచో చేయదగిన నిర్ణయములు, సంధి చేసికొనుటలో ప్రదేశనిర్ణయము కాలనిర్ణయము, కార్యనిర్ణయము. దేశకాలనిర్ణయము దేశకార్యనిర్ణయము, కాలకార్యనిర్ణయము దేశకాలకార్యనిర్ణయము ఇట్లు ఏడు విధములగు నిర్ణయములలో ఒక నిర్ణయముగల సంధి పరిపణితము, అదిలేనిది అపరిపణితము. తాను తన స్వతమును వదలి చేసికొనిన సంధి అపసృతము. వీటి యవాంతరభేదములు వాటి ప్రయోజనములు వాటి సమయములు మొదలగునవి గలవు. 7. ద్వైధీభావమువలన నగు సంధి విక్రమములు. ఇద్దరు దేశాధిపతులు కలహించునపుడు, ఇద్దరితోడను మిత్రునివలె నటించుట ద్వైధీభావము. అట్లు ద్వైధీభావముతోనుండి సంధి చేసికొనుట, లేక పరాక్రమించుట. ఏది ఎపుడు చేయదగినది వాటి దేశకాలాదిపరిస్థితులు. 8. యాతవ్యవృత్తి, 'అనుగ్రాహ్య మిత్రవిశేషములు, శత్రువు తనపై దండెత్తి వచ్చినచో తాను యాతవ్యుడు అట్టి తరితానెట్లు నడచుకొనవలెను? ఏమిచేయవలెను? ఇది యాతవ్యుని వృత్తి. అపుడు ఎట్టి మిత్రుల గ్రహింపవలెను వారిలక్షణములు మొదలగునవి, ఇందుగలవు. 9 మిత్రసంధి, హిరణ్యసంధి, మిత్రలాభమునకై దండెత్తుట, హిరణ్యాలాభమునకై దండెత్తుట. ఈయుద్ధయాత్రలందును మిత్రులతో సంధి గలుగును. హిరణ్యాలాభమునకై మిత్రునితో సంధి చేసికొని యాత్ర చేయవలసియుండును ఇట్టి సంధివిగ్రహములలో సంధియందలి లాభనష్టములు విగ్రహమువలని లాభనష్టములు చేయవలసిన కార్యక్రమము ఇందుగలదు 10 భూమి సంధి. భూలాభమునకై సంధి చేసికొని ఇతరునిపై దండెత్తుట భూమి సంధిప్రకరణమున వివరింపబడినది 11 అనవసితసంధి, ఒకపుడు ఏ విషయమునున్ను నిర్ధారణ చేయకయే గొప్పలాభము నపేక్షించి సంధి చేసికొనును దీనికి అతిసంధి యనియు నామాంతరము. దీనివలన లాభమునందు ప్రకారములు వివరము ఇందుగలవు. 12 కర్మసంధి, దుర్గాది నిర్మాణకార్యమునకై చేయుసంధి కర్మసంధి, 13. పార్ష్ణిగ్రాహచింత, ఒక దేశాధిపతి తనకు ముందుగల దేశముపై దండెత్తినపుడు వెనుకనుండి తనదేశముపై దండెత్తువాడు పార్ష్ణిగ్రాహుడు. అట్టి పార్ష్ణిగ్రాహునితో సంధివిగ్రహాదుల నెపుడెట్లు చేయవలెను? వానియెడల నడువవలసిన పద్ధతి. ఇత్యాది విచారమిందుగలదు. 14 హీనశక్తి పూరణము. తనకు తక్కువగ నున్న శక్తిని నిండించవలసిన పద్ధతి యిందు గలదు. 15 బలవంతునితో విగ్రహించి ఎదుర్కొనవలసిన కారణములు బలవంతుడు దండెత్తివచ్చినపుడు చేయవలసిన కార్యక్రమము 16, దండెత్తువాడు చేయదగినపని. 17 సంధికర్మ, సంధిమోక్షము, ఎవ్వరితో సంధి చేసికొనవలెను? ఆ సంధివలని ప్రయోజనములు, సంధిభేదములు. సంధిని భగ్నమెపుడు చేయవలెను? ఎట్లు చేయవలయును, ఇత్యాది విషయమిందు గలదు. 18. మధ్యమచరితము, ఉదాసీనచరితము మండలచరితము, అని ఈ ప్రకరణమున మూడు భాగములు గలవు. మధ్యస్థుడు నడవవలసిన పద్ధతి మధ్యస్థునిపట్ల నడవవలసిన పద్ధతి. అట్లు ఉదాసీనుని కర్తవ్యము ఉదాసీనునియందు నడువవలసిన పద్ధతి. ఇద్దరు దేశాధిపతులకును మిత్రునివలె నుండువాడు మధ్యముడు. ఎవ్వరితోడను సంబంధములేక యుండువాడు ఉదాసీనుడు. రాజమండలమందున్నరాజులు పరస్పర మెట్లుండవలెను? అందు ఒకడు ఇతరులతో నెట్లు నడుచుకొనవలెను? ఇత్యాది విషయములిందు వివరింపబడినవి. ఇది ఏడవప్రకరణము షాడ్గుణ్యా మనునది.

మూ॥ ప్రకృతివ్యసనవర్గః, రాజరాజ్య యోర్వ్యసనచింతా, పురుషవ్యసనవర్గః, పీడనవర్గః, స్తంభవర్గః, కోశసంగవర్గః, బలవ్యసనవర్గః. మిత్రవ్యసనవర్గః ఇతి వ్యసనాధికారిక మష్టమమధికరణం.

ఎనిమిదవ యధికరణము వ్యసనముల నుద్దేశించినది. శ్రేయస్సు కలుగకుండ చిక్కులను తెచ్చునవి వ్యసనములు. ద్యూతము, సురాపానము, వ్యభిచారము మొదలగునవి. 1. ప్రకృతి వ్యసనవర్గము ప్రభువు, మంత్రులు, మిత్రులు, సైనికులు మొదలగువారికి గలుగు వ్యసనములు. వాటి లక్షణములు, పరదేశాధిపతికిని వారి ప్రకృతులకును (అమాత్యాదులకునూ) వ్యసనము లున్న గలుగు ప్రయోజనము మొదలగు విషయములిందు విమర్శింపబడినవి. 2. రాజరాజ్యముల వ్యసనవిచారము. రాజునకు గలుగు వ్యసనములు వాటివలన నగు హాని, రాజ్యమునందున్నవారి వ్యసనములు.

కళాసౌందర్యము - మానవుడు

శ్రీ వి. అంకయ్య ఎం. ఏ.

దైవసంకల్పమగు సృష్టి - ఒక కళ. దాన విశ్వము కళామయము. ఈ కళలు త్రిగుణాత్మకములు, సత్య, శివ, సుందరములు. యుక్తి యుక్తమగు పరిజ్ఞానము కలిగించునది సత్యము (The object of legal knowledge is truth) అనగా సహేతుకమైన పరిపూర్ణత్వము కలిగియుండును. నైతికబలమును గలిగించు పరిపూర్ణత్వము శివము (Goodness) రస పరిజ్ఞానమయమైనది సుందరము (The object of aesthetic Knowledge is beauty) అనగా జ్ఞానేంద్రియములకు గోచరమగు పరిపూర్ణత్వమును గలిగియుండును

సత్య, శివ, సుందరములు మూడును మధురములు, సంబంధ సామ్యములును. ఇవి హృదయజనితములు సూక్ష్మపరిశీలనకివి భిన్నములయినను, స్థూలపరిశీలనమున సౌందర్యమే ప్రధానముగా గన్పట్టును. ఈ త్రిగుణాత్మక స్వరూపుడే యీశ్వరుడు సత్య, శివ, సుందరములను దెలిసికొనుట యన నీశ్వరుని దర్శించి బ్రహ్మానందమును బొందుటయే యగును.

ఇట్టి త్రిగుణాత్మకమయమైన యీశ్వరుని జగత్తులో మానవుని తొలుత నాకర్షించునది సౌందర్యము. సౌందర్యమయమైన యీసృష్టిని దర్శించి ఆహ్లాద, ఆవేశ, ఆవేదనలతో ప్రాక్తన మానవుడు పాడినపాటయే సంగీత, సాహిత్యములయినవి. ఆడినయాటయే నృత్త, నృత్యములయినవి. చేసిన కృత్యములే శిల్ప, చిత్రములయినవి ఇవ్విధముగా ప్రాక్తనమానవునితో నారంభింపబడిన కళలే నేడు చతుష్షష్టి కళలని పిలువబడుచున్నవి మానవుడు దైవ సంకల్పమునకు బ్రతిసంకల్పముతో సృష్టికి బ్రతిసృష్టిని గావించుచున్నాడు. అనగా దైవ కళలకు ప్రతికళలను సృష్టించు చున్నాడు సౌందర్యమే వీని లక్షణము వీనిలో గొన్ని యుపయోగకళలు (Useful arts) కొన్ని లలితకళలు (Fine arts) ఉపయోగకళలు జీవితోప యుక్తములయినను బ్రహ్మానంద తుల్యమగు నానందమీయజాలవు లలితకళలు కేవలమానందము కొఱకే ఇవి యాత్మానందమునకే గాని జీవితసౌఖ్యమునకు గాదు. సంగీతము, కవిత్వము శ్రవ్యకళలు. అనగా శ్రవణములే యీ కళల సౌందర్యమును నిర్ధారణచేసి యాత్మానందమును గలిగించునవి. చిత్రలేఖనము, శిల్పము దృశ్యకళలు. వీని సౌందర్యమును నిర్ధారణము చేయునవి నేత్రములు పాకకళలోని సౌందర్యము (రుచి) నాస్వాదించునది రసనేంద్రియము. సుగంధ, దుర్గంధములలోని సౌందర్యమును గనుగొన గలుగునది ఘ్రాణేంద్రియము మృదుత్వా మృదుత్వములను తెలిసికొనునది త్వక్కు- ఇవ్విధముగా మానవుడు జ్ఞానేంద్రియముల ముఖమున కళాసౌందర్యము ననుభవించుచున్నాడు జ్ఞానేంద్రియములు సక్రమముగా తమ ధర్మమును నిర్వహించనపుడు కళా సౌందర్యమును గ్రహించి యాత్మానందమును బొందలేడు చెవిటివాడు సంగీతమాధుర్యము, గ్రుడ్డివాడు చిత్రసౌందర్యమును గ్రోల గలరా? పంచేంద్రియము లుండియు కళాసౌందర్యము ననుభవించలేని మానవులు కొందఱు గలరు అట్టివారికి సహృదయత్వము లేదని చెప్ప వచ్చును. సహృదయత్వమనగా 'నాత్మవేదనోన్ముఖమైన యంతరంగము' కలిగి యుండుట.

దివ్యసౌందర్యము (Divine beauty) ప్రకృతి లేక సహజసౌందర్యము (Natural beauty) కల్పితసౌందర్యము (Artificial beauty) అని సౌందర్యము త్రివిధములు ఆధ్యాత్మికసంపన్నులు పరమాత్మను సాక్షాత్కరింపజేసికొని తన్మయత్వముతో బ్రహ్మానందమును బొందెదరు. ఆ పరమాత్మయే

దివ్యసౌందర్యము మనకు నిత్యము గన్పట్టు సచేతనా చేతన పదార్థముల సౌందర్యము సహజసౌందర్యము. ఇది దైవసృష్టి. జీవితోప యోగమునకై ఆత్మానందమునకై మానవుడు సృష్టించుకొనిన కళాసౌందర్యము కల్పిత సౌందర్యము. సురూపియై జన్మించుట సహజ సౌందర్యము కన్నులకు కాటుక, నొసట తిలకము, రెండుజడలు, జడలలో పూలు- ఇట్లు అలంకరించుకొనుట కల్పిత సౌందర్యము. కల్పితసౌందర్యము కంటె సహజసౌందర్యము దానికంటె దివ్యసౌందర్య మున్నతోన్నతములు నుత్కృష్టములును. ఈ తరతమ భేదములను జక్కగా నవగాహనము చేసికొని సాహిత్యములో జూపగలిగినది పింగళి సూరన యొక్కడే కన్పించుచున్నాడు. సుగాత్రీశాలీనుల కథ మనకందఱకు దెలిసినదేకదా, శాలీనునకు సహజసౌందర్యమునందెంత ప్రీతియో, తెచ్చిపెట్టుకొనిన యందమందంత భీతియు, వెగటును అందుచే వివిధభూషణ మహామకు వెక్కసపడి, యితడు భార్యను జేరదీయక పరాకుగానుండెను. వీరిద్దఱు తోటలోగలిసిరి 'తన్మతికి నట్టి సొంపులేగాని భూషణాలింపు గావు' అని సుగ్రాత్రి తరువాత తెలిసికొని, వాని యిష్టప్రకారమే ప్రవర్తించుచు దాంపత్య సుఖ మనుభవించినది

ప్రతికళలోను భావసౌందర్యము(Beauty of idea) రచనా సౌందర్యము (Beauty of expression) రూపసౌందర్యము (Beauty of form) బొడ గట్టును మచ్చునకీ పద్యము చూడుడు

"తమిఁ బూఁదీగెల యూగుటుయ్యేలలఁ బంతా
లాడుచుండూగు నా
కొమరుం బ్రాయపు గబ్బి గుబ్బెతల యంఘ్రు
ల్చక్కగాఁ జాఁగి మిం
టి మొగంబై చనుదెంచు రీవిగనుఁగొంటె
దివ్యమౌనీంద్ర' నా
కిమృగీ నేత్రలమీఁదఁ గయ్యమునకుఁ
గాల్దాఁచులా గొప్పెడున్."

దీనిలోని భావసౌందర్య మత్యద్భుతము. తమతమ పనులమీద ప్రవేశించినట్టి నారద మణి కంధరులు, రంభానలకూబరులు, కలభాషిణి మొదలయిన వీరందరు నీ పద్యభావముతో సంబంధము కలిగిన ముఖ్యపాత్రలే. కళాపూర్ణోదయ కథయంతయు నీపద్యముపై నాధారపడియున్నది. అసలీ పద్యమును మణికంధరునిచే చెప్పించుట యొక విశేషము. నారదునితో చెప్పుట, యంతకంటె గొప్ప విశేషము నారదుడు విని 'భళిరా! సత్కవి వౌదు' వని మణికంధరుని ప్రశంసించుట అన్నిటికంటె గొప్ప విశేషము.

కొమరుంబ్రాయపు గబ్బిగుబ్బెతలను(ముఖ్యముగా కలభాషిణిని) జూచి 'నాక మృగీ నేత్రలమీఁద గయ్యమునకు గాల్దాచులా గొప్పెడున్' అని చెప్పుటచే మణికంధరుని భావము వేరు. (ఆమె పొందును గోరుట) దానిని గ్రహించి 'భళిరా! సత్కవివౌదు' వని మణికంధరుని ప్రశంసించుటలో నారదుని భావము వేరు. (ముందు కథకవసరము గావున ప్రోత్సాహపరచుట) అంఘ్రుల్చక్కగాఁ జాగి మింటి మొగంబై చనుదెంచు రీవి గనుగొని 'వారల దోలాచలనోచ్చలచ్చరణముల్ త్రైవిష్టపస్త్రీల యౌదలదన్నం జనునట్లు మించె'నని కలభాషిణిని ప్రశంసించుటలో దివ్యమునీంద్రుని భావమువేరు. సౌందర్యగర్వముచే విఱ్ఱవీగు రంభను దవ్వనజూచి రంభా గర్వభంగమునకే యీ ప్రశంస. ఆ మాటలను విని కనలి మనసాక్షింత జేసికొనిన రంభభావము వేరు. ఈ విధముగా నీ పద్యమనేక భావములతో ననేక పాత్రలతోగూడి కథాప్రారంభమునకు విస్తృతికి బీజప్రాయమయినది. ఇన్ని భావముల నొక్క పద్యములోనిముడ్చుట గొప్ప విశేషము అదియే భావసౌందర్యము. రచనాసౌందర్యము - కొమరుంబ్రాయపు గబ్బిగుబ్బెతలాసక్తితో బూఁదీగెల తూగుటుయ్యేలలో పంతాలాడుచూగినట్లు చెవులకింపుగూర్చు సరళము,లలితమైన పదజాలముతో, రసవత్తర భావార్థములను గూర్చు శబ్దములతో రచన

సాగినది. పూఁదీగెల తూగుటుయ్యేలలు- పంతాలాడుట- కొమరుంబ్రాయము- గబ్బిగుబ్బేతలు- మింటిమొగంబు- రీవి- దివ్యమౌనీంద్రుడు- మృగినేత్రలు- కయ్యమునకుఁ గాల్దాచుట- ఈ పదములెంత సరళముగా సరసముగానున్నవో చూడుడు అసలీ పద్యములో నొక్క వ్యర్థ పదముకూడ గనిపించదు వ్యర్థరహితమైన భావముతో, రచనతో, రూపమును జిత్రించినపుడే సంపూర్ణసౌందర్యము బొడగట్టును.

ఇదే భావమును మిచెలాంగెలో (Michelangelo) అను పాశ్చాత్యకవి "Beauty is the purgation of superfluities" అను సూక్తిలో తెలువరించినాడు నిష్ప్రయోజనము నిరర్థకములయిన రచనతో నిండియుండిన సౌందర్యము సూన్యము తగినంతయే కాటుక దిద్దిన కన్నులకందము గాని, యున్నదికదా యని కంటినిండ పులిమిన అందవిహీనమే కదా! కళాకారు డనుచితభావాలతో, నిరర్థకమైన రచన సాగించిన కురూపమేగాని సురూపమురాదు

రూప సౌందర్యము - ఒక యుద్యానవనము, అందులో పూదీగెల తూగుటుయ్యాలలు- ఆ యుయ్యాలలో నందమైన కన్యలు (గబ్బిగుబ్బేతలు) పోటీలతో- ఎంతో యెత్తున కూగుచున్నట్లు మన నేత్రములకు స్పష్టముగా గన్పించుచున్నారు సహృదయుడయిన పరిశీలకుడీ త్రివిధ సౌందర్యములను సమగ్రముగా సానుభూతితో నవగాహనము చేసికొనినపుడే హృదయము స్పందించి, యాత్మానందము నొందగలుగు చున్నాడు.

ఆత్మాశ్రయ పరాశ్రయముల సంధానము సౌందర్యము. మనోగతములయిన కళాకారుని భావములే కళలో గన్పట్టునవి కళలోని భావసౌందర్యము దెలిసికొనుట యన, తత్కళాకారుని ఉత్కృష్టభావములను దెలిసికొనుటయే యగును. కళాకారుడు తన హృదయ జనితమైన యుత్కృష్టభావ సంచయముచే పరసాధన సంపత్తుల (కలము, కుంచె, ఉలి మొదలగు) సహాయముతో రచన సాగించి రూపమును దిద్దును కళా పరిశీలకుడు రూపమును జూచి, రచన నధిగమించి, కళాకారుని భావముల నందుకొనగల్గును. అప్పుడే యాత్మానందము

సౌందర్యము మరెక్కడనో లేదు. పరిశీలకుని ఆత్మయందే యున్నది. (Beauty exists not in the world but in the beautiful soul) ఈ భావము ఫిచెట్ Fichete, చెప్పినది ఆత్మసౌందర్యము గల వ్యక్తికి ప్రతి వస్తువు సుందరముగనే కన్పట్టును. దీనినే వర్డ్సువర్తు కూడ నిట్లు తేటపరచినాడు 'The beauty that never was on sea or land" meaning that it was supplied by the of observer నిజముగా సముద్రములో నందము లేదు. లేకపోయినను పరిశీలకుని సుందరాత్మ కది సుందరముగా గన్పట్టుచున్నది ఒకే వస్తువు కొందఱికి సుందరముగ గోచరించి, యానందమును, మఱికొందఱికి నసంతృప్తిని గలిగించుటయు గలదు ఆత్మసౌందర్యములేని వ్యక్తికి, జ్ఞానేంద్రియములు సరిగా పనిచేయని వ్యక్తులకు నసంతృప్తిని గలిగించవచ్చును. ఒక్కొక్కపుడు పరిశీలకులు లాక్షణికులు గీచిన వలయము లోపలనే తమ దృష్టిని ప్రసరింపజేయుటచే- కళాకారుని భావ సౌందర్యమును సమగ్రముగాఁ గాంచలేక పోవచ్చును ఆత్మ సౌందర్యముగల పరిశీలకులకు లాక్షణికుల సహాయ మనవసరము

Beauty attracts people as the sun attracts the planet- Adam Muller. సూర్యుడితర గ్రహముల నాకర్షించునట్లు సౌందర్యము మానవాళి నాకర్షించును. స్త్రీ పురుషులు భూషణాదులతో నలంకరించుకొనుట, యన్యోన్యమాకర్షించుకొనుట కొఱకే గదా! ఇట్టి సౌందర్య దిదృక్ష, పశుపక్ష్యాదుల లోను గన్పట్టును. నాగస్వరమును విని నాగులు తన్మయత్వముతో నాడుట, ఆ స్వర సౌందర్యమును గాంచియే గిజిగాడు చక్కగా గూడు నల్లుకొనుట సౌందర్య దిదృక్షచేతనే గదా!

మానవ కల్పితమైన కళలో గన్పట్టు సౌందర్యమును మానవుడు క్రొత్తగా సృష్టించు చున్నాడా? లేదు. ఆ సౌందర్యము సహజ సౌందర్యమున కనుకరణము (Art consists in imitating the beauty of nature-Batteux.) కళా సౌందర్యము స్వల్పకాలములోన నంత జ్ఞానము నమితానందము నీయజాలును ఒక చిత్రమునుగాని శిల్పమునుగాని గాంచినపుడా కొద్దికాలములో నెంత జ్ఞానము నెన్నియూహలు కలుగుటలేదు

సౌందర్యముయొక్క విలువ పరిశీలకుని యాసక్తి, ఆత్మ సౌందర్యములమీద నాధార పడి యున్నది కొందఱికిఁ గురూపిగా గనుపించిన వ్యక్తికోసమే మఱికొందఱు, ఆత్మార్పణము చేసిన ఘట్టములను మన మెన్నింటిని జూచుటలేదు. కోకిల గానము కాకికి రుచించునా? కాకిపిల్ల కాకికి వెగటా? లోకమున సౌందర్యములేనిది మానవుడొక్క నిమిషము కూడ జీవింపజాలడు జీవితమునకు సంతృప్తి యాత్మానందము నిచ్చు సౌందర్యము లేనిది మానవు డెంతకాలము జీవింపగలడు పశుపక్ష్యాదులు నంతే సౌందర్యమనగా నిచ్చట కేవలము దృశ్య సౌందర్యము కాదు. సర్వేంద్రియములకు సంబంధించు సర్వకళా సౌందర్యములు.

కళాకారుని, పరిశీలకుని, ఆత్మలన్యోన్యము సంభాషించుకొనునట్లు చేయుటయే సౌందర్యము యొక్క యుద్దేశము. కళాకారు డేస్థితిలో నున్నాడో, పరిశీలకుని కూడ నాస్థితికి దెచ్చునది నిజమైన కళాసౌందర్యము తన ఏడ్పులతో ప్రేక్షకుల నేడ్పించుట, నవ్వులతో నవ్వించుట, సంతోషముతో సంతోషపఱచుట, నటకుని యుద్దేశము అదియే సరియైన కళాసౌందర్యము నటకు డేడ్చునపుడు ప్రేక్షకులు నవ్వుట, నవ్వినపుడు ఏడ్చుట, కళాసౌందర్యమునకు నిదర్శనము కాదు ఏయే భావములను, ననుభూతులను కళాకారుడు పొందునో, ఆయా భావముల ననుభూతులను ప్రేక్షకుడు పొందవలెను

- ప్రకృతిలోని రహస్యములను వెలికిదెచ్చి చూపునది సౌందర్యము (The beautiful is a manifestation of secret laws of nature- Emerson.) ఆ సౌందర్యము నాధారముగా గొని, మానవుడు ప్రపంచమును బరిశీలించి, యాత్మానందమును బొందుటయే కాక దైవసంకల్పమునకు భాష్యకారుడగు చున్నాడు మానవ జీవితోద్దేశము పరమాత్మను దర్శించి బ్రహ్మానందమును బొందుటయేగదా! అట్టిది కళాసౌందర్యముచే సాధ్యము బౌద్ధ యుగమున జనించిన కుడ్యగత శిల్పములు, చిత్రములు పరమాత్మను సాక్షాత్కరింపజేసికొనుటకు సృష్టించినవేగదా!

ఎమర్సన్ ఉద్దేశములో సౌందర్యమనేక విధములు, నడవడిలో- నాజూకులో- మాటలో పాటలో- ఆలోచనలో- ఆత్మలో- నీటిలో- నియమములో- ఇట్లు మానవుడుచేయు ప్రతి విషయములో సౌందర్యమున్నది కళలో సరసత్వములేని సౌందర్యము ఎరలేని గాలము వంటిది. (Beauty without grace is the book with out the bait-Emerson) ఎరలేనిగాలము మత్స్యములను నాకర్షించునా? లేదు సరసత్వము లేని సౌందర్యమును నంతే. విభావానుభావ సాత్త్వికవ్యభిచారీభావ సంయోగ ఫలితముగా పర్యవసించు రసస్వరూపము, ఒక సుందర కళాఖండమును గాంచిన వెంటనే పెల్లుబికి ప్రవహించెనేని, అదిసంపూర్ణసౌందర్య రాశియని చెప్పవలెను.

సౌందర్యమునకు విలువదెచ్చునది కేవలము బాహ్యసౌందర్యమే కాదు. దాని యంతర్సౌందర్యమును గూడ చిత్రములోని పై రంగులేకాదు, చిత్రములో నణగి మణగి యున్న భావసౌందర్యమును గూడ గణించవలెను సంగీతము శ్రావ్యముగ నున్నదనుటే కాదు ఆ సంగీతములోని భావసౌందర్యమును గూడ గుర్తించవలెను. ప్రపంచ ప్రసిద్ధి జెందిన వక్తలు Burke, de Bouellon- వీరిలోసౌందర్యము మచ్చునకైన గనిపించదు, ఒకరిది మొద్దుమొగము, మరొకరిది యెద్దు

మొగము, అందుచే వీరిని సౌందర్యహీను లనె దమా? లేదు వీరిలో గనిపించు నట్టి మేధా శక్తిని, అతి సూక్ష్మగ్రహణ శక్తిని, సంభాషణా చాతుర్యమునుగూడ విలువ కట్టవలయును వీరెంత వికారముగా నున్నను, వీరిని చూడక, నిలువజాలని స్త్రీ పురుషులెందరో యుండి యుండవచ్చును "with the phy-siognomy of on ox, he had the perspicacity of an eagle" చూచితిరా, ఈ సూక్తి (Cardinal de- Rets) కార్డినల్ డిరెట్సు అను నతడు ప్రసిద్ధిగాంచిన (De-Bouillòn) డిబౌల్లన్‌ను గురించి చెప్పినది, కొందఱు బాహ్యసౌందర్యమునకే ముగ్ధులయ్యెదరు. మఱికొందరు, కురూపులయినను, ఆ కురూపులలోని అంతర్సౌందర్యమునే ప్రేమించి తనివి చెందక, వారికి దాసానుదాసులు కూడ నయ్యెదరు.

జీవితములో క్రొంగ్రొత్తభావముల రేకెత్తించుట కళాకారుని యుద్దేశము, అదియే నిజమైన కళ. అదియే జీవితానికొక సౌందర్యము ఆ సౌందర్యమే నూతనోత్సాహము గలిగించునది. ఆడిన ఆటను, పాడిన పాటను, గీచిన గీతను, మఱల ననుకరించుట జీవితాభివృద్ధికి నిరోధకము. అది పురోగమించని శకటము వంటిది. నవనవోన్మేషమై, శతధా పురోగమించు కళాసౌందర్యము జీవితమున కొక జ్యోతివంటిది. అదియే జ్ఞానమయము. అది లేనినాడంధకారమయ ప్రపంచమే

కళ కళకొఱకే సృష్టించవలయును గాని జీవనోపాధికై సృష్టించకూడదు జీవనోపాధికై సృష్టించు కళలలో సౌందర్యము మృగ్యము భర్తచే హృదయపూర్వకముగా ప్రేమింపబడు లలనామణికి, అలంకరణముల తోనేమి పని? అట్టి లలనామణి వంటిదే నిజమైన కళ ఆ కళలోనే సంపూర్ణ సౌందర్యము ట్టిపడుచుండును కృత్రిమ కళాసౌందర్యము వేశ్య వంటిది (Real art, like tha wife of an affectionate husband, needs no ornaments But Counterfeit art, like a Prostitute, must always be decked out- Leo Tolstoy) దంపతుల యనురాగాహ్లాదమునకు బరిణామము సుపుత్ర ప్రాప్తియైనట్లు, కళాకారుని భావావేశమునకు ఫలితము కళాసౌందర్యము వేశ్యకు ఫలితము ధనమే

కావున మానవుడు నిజమైన కళను సృష్టించి- నిజమైన సౌందర్యము నారాధించుటయన వాని పురోగమనమునే సూచించును, వాని జీవితము వినూత్నజ్యోతులతో విరాజిల్లును జ్ఞానము ప్రసన్నమగును అప్పుడే మానవాభ్యుదయము- దేశసౌభాగ్యము

ఉపనిషద్వాక్యములు

శ్రీ ధూళిపాళ రామచంద్రశాస్త్రి

అథాతస్సంగ్ంహితాయా ఉపనిషద వ్యాఖ్యాస్యామః। పంచస్వధికరణేషు। అధిలోకమధిజ్యోతిషమధివిద్య మధిప్రజ మధ్యాత్మమ్। తామహాసంగ్ంహితాఇత్యాచక్షతే॥

పూర్వానువాకమందు చెప్పబడిన వర్ణస్వరాద్యుచ్చారణాభ్యాసానంతరమున సంహితా సంబంధమగు ఉపాసనను చెప్పగలము ఈ యుపాసనీయమగు సంహిత, "పంచస్వధికరణేషు" అయిదు విధములగు ఆశ్రయములందు వ్యాఖ్యానము చేయబడుచున్నది ఆశ్రయభేదమునుబట్టి ఉపాసనాభేదము లేదనుటకొరకు ఒక విధమగు ఉపాసనయే ఐదు విధములగు ఆశ్రయములయందు బ్రతిజ్ఞాతమైనది. ఈ యాశ్రయము లేవియనగా

అధిలోక మధిజ్యోతిషమధివిద్యమధి ప్రజమధ్యాత్మమ్

లోక, జ్యోతిర్విద్యా ప్రజాత్మరూపములగు ఆశ్రయములు ఐదు విధములు ఈ విషయమే ఈ వాక్యమునకు తాత్పర్యార్థము.

అధిలోకమ్ - పృథివ్యాదీన్ లోకానధికృత్యవర్తత ఇతి అధిలోకమ్. అను విగ్రహవాక్యముచే లోకాశ్రయమగు ఉపాసన ప్రాథమికమనియు, ఈ విధముగనే జ్యోతీంషి అధికృత్యవర్తతఇతి అధిజ్యోతిషమ్ అను వ్యుత్పత్తిచే జ్యోతిషమగు ఉపాసన ద్వితీయమనియు ఈ క్రమము ననుసరించి, విద్యాశ్రయము, ప్రజ్యాశ్రయము, ఆత్మాశ్రయమునగు ఉపాసనలు ఐదు విధములైనవని తేలుచున్నది.

ఈ విధముగ పంచవిధములగు లోకాద్యాశ్రయ భేదములచే భిన్నములగు ఏ ఉపాసనలు గలవో అవియే

తామహాసగ్ంహితా ఇత్యాచక్షతే।

మహాసంహితలని అభిజ్ఞులగు ఉపాసకులు చెప్పుచున్నారు. ఈ ప్రకారము చెప్పబడిన ఉపాసనలు ఉత్కృష్టములగు లోకాదుల దృష్టితో ఉపాసితము లగుటంబట్టి మహాసగ్ంహితలని వ్యవహరింపబడు చున్నవని భావము.

అథాధిలోకం। పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్। ఆకాశస్సంధిః। వాయుస్సంధానమ్। ఇత్యధిలోకమ్

ప్రతిజ్ఞాతమగు ఉపాసనయందు ఉపాస్యమగు, ప్రాథమికమగు అవయము ఇందువివరింపబడుచున్నది అనగా లోకాది పంచక విషయమగు ఉపాసనను బ్రతిజ్ఞ చేసిన తరువాత ఉపాస్యమగు లోక విషయమైన అవయవము చెప్పబడుచున్నది. సంహితావయవములగు పూర్వోత్తర వర్ణములలో పూర్వవర్ణముయొక్క స్వరూపము పృథివీ దేవతారూపమని చింతించదగినదనియు, ఉత్తరవర్ణముయొక్క స్వరూపము ద్యులోకాభిమాని దేవతారూపమనియు, ఈ వర్ణములకు గల సంధి అనగా మధ్యదేశము ద్యులోక పృథివీ లోకములకుమధ్యగల ఆకాశాభిమాని దేవతా స్వరూపమనియు, ఈ వర్ణములకు మధ్యదేశమునగల సంధానము సంహితాస్వరూపము, వాయుదేవతా స్వరూపమనియుభావము

ఈ ప్రకారము లోకవిషయమగు సంహితాధ్యానము చెప్పబడినది.

ఈ ఉపాసనయందు ఈ క్రింది వాక్యములచే ద్వితీయావయవము నిరూపింపబడినది.

అథాధిజ్యోతిషమ్।అగ్నిః పూర్వరూపమ్। ఆదిత్య ఉత్తరరూపమ్। ఆపస్సంధిః। వైద్యుతస్సంధానమ్। ఇత్యధిజ్యోతిషమ్।

ఈ క్రిందివాక్యముచే మూడవ అవయవము నిరూపింపబడినది.

అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్ అంతే వాస్యుత్తరరూపమ్। విద్యాసంధిః। ప్రవచనగ్ం సంధానమ్। ఇత్యధివిద్యమ్

ఈ క్రింది వాక్యముచే నాల్గవఅవయవము నిరూపితమైనది,

అథాధిప్రజమ్ । మాతాపూర్వరూపమ్ । పితోత్తరరూపమ్ । ప్రజాసంధిః । ప్రవచనగ్ం సంధానమ్ । ఇత్యధిప్రజమ్ ।

ఈ వాక్యము చే పంచమావయవము నిరూపితమైనది.

అథాధ్యాత్మమ్ । అధరాహనుః పూర్వరూపమ్ఉత్తరాహను రుత్తరరూపమ్। వాక్సంధిః । జిహ్వాసంధానమ్ । ఇత్యధ్మాత్మమ్

ఇచట అధ్యాత్మమనగా దేహేంద్రియాది సాక్షీ చైతన్యాంతస్సంఘాతరూపమగు ఆత్మను ఉద్దేశించి ప్రవర్తించు ఈ ఉపాసనము ఐదవ ఉపాసనము ఈ విధముగ లోకజ్యోతిర్విద్యాప్రజాత్మ రూపములగు ఆశ్రయములు గల పంచవిధములగు ఉపాసనలు ఇంతవరకు నిరూపింపబడినవి తరువాత, "ఇతీమా మహాసగ్ంహితాః" అనువాక్యము మొదలుకొని ప్రతిపాదిత రూపములగు సంహితావయవములను ఉపసంహరించు గ్రంథము ప్రవృత్తమైనది.

పంచవటి

[స్వరచిత సంస్కృత కావ్యమున కనువాదము]

శ్రీ కె. వేం. న్ర. అప్పారావు, ఎం ఏ.

శ్రీ రఘురాముఁడాత్మసతి సీతనుగూడి యయోధ్యవీడి వేఁ
జేరెను దండకాటవిని స్వీయపితన్ ఋతువాక్యు జేయఁగన్
గూరిమి మీఱ నగ్రజుని గొల్వఁగఁగోరి సుమిత్రపట్టి కాం
తార గతాపదల్ దనమనంబున నెంచక వెంబడించెఁదాన్.

జనకజ భర్తృపాదముల చాయనె పాయక యేఁగఁ బూనుటల్
చనవున రాముఁ డక్లైయని సమ్మతిసేయుట వింత కాదు, జీ
వనదము వీడి యెట్టులు దివంబుననైనఁ దటిత్తునిల్చు, నే
జనుఁడును నీడవీడిచనఁ జాలుట యెట్లిల నా తపంబునన్.

స్వవిరహ దుఃఖితన్ సతిని వత్సలయౌ జననిన్ద్యజించి య
న్న వెనుక లక్ష్మణుండును జనన్ దలపోయుట చూడ నబ్రమౌ
రవికుల సోముఁడున్ వలదురా! యనుజా! యని మాన్పఁడయ్యె, నే
యవిదితబంధ మిర్వుర హృదబ్జములన్ గుదిగూర్చి లాగెనో.

ముందర నీలనీరదసముజ్జ్వల దేహుఁడు రామచంద్రుఁడా
మందల శక్రకార్ముక సమంచితచేల, నతాంగి, సీతయున్
మందగతిన్ జనన్ వెనుక నవ్యరవి ప్రభలొప్పు లక్ష్మణుం
డందముగూర్ప వర్ష సమయాంబర శోభ వహించెఁగానయున్.

అంచిత పక్షిజాతముల కాశ్రయమై నభమంటు శాఖలన్
గొంచక చేరి వస్త్రముల కొంగులు నోళులలాగు వేళలన్
సంచిత పింఛ మౌళులగు చంచలనేత్రల జెంచుభామలన్
గాంచుచు నేఁగఁ గానఁజనుగ్లాని గనంబడదయ్యె వారికిన్.

ఇటుచని కొన్నినాళులకు నింపుగ గౌతమి చెంతఁజేరి త
త్తటమున రమ్య పంచవటి దాపునఁగట్టిరి పర్ణశాల చె
మ్మటలురలంగనా నృపకుమారులు; స్వర్ణగృహంబుకంటె నా
యుటజమె సీత చిత్తమున కుత్తమమై కనుపట్టెఁ బ్రీతిచే.

వలసినవెల్ల లక్ష్మణుఁడవారిగనింటికిఁ జేర్చుచుండ, స్వీ
యలలన సీత తానుగ సమస్తమమర్పఁగ రాజ్యహీనతా
కలితుఁడెయైన రాఘవుని కాపురమొప్పెను సౌఖ్యదాయియై
చెలులు సమీపమందు నివసింపఁగఁ గానయు స్వర్గతుల్యమే.

సీతారాములు ప్రత్యహంబును బ్రతీచిన్ రక్తిమల్ నిండుచోఁ
జేతన్ జేతిని గీలుకొల్పి వనరాజిన్ గౌతమీసైకత
వ్రాతంబందు వివిక్తసీమల మరాళద్వంద్వముల్ వెంబడిన్
యాతాయాత మొనర్పఁగా విహరణ వ్యాసంగమోదాత్ములై.

చనిచనియంతికస్థమగు శైలశిఖాస్థలినుండి క్రిందకున్
ఘన నినదంబుతో దిగు నొకానొక నిర్ఝరిణిన్ బదాబ్జధా
వనమొనరించి వజ్జనొక ప్రస్తరమందు సుఖోపవిష్టులై
మునుపటి ముచ్చటల్ గలియఁబోయుచుఁ గాంచరు ప్రొద్దుపోవుటల్.

సానూత్తంభిత భూభృదగ్ర శిఖర స్యందజ్ఝరీ మర్దల
ధ్వానాయత్త గతిన్ మయూరములు సోత్సాహంబుగా నాట్య వి
ద్యా నైపుణ్యముఁ జూపమెచ్చిరి శిరంబల్లార్చుచున్ వారు తా
మేనాఁడైన నయోధ్యఁగాంచిరొకో! యీ దృగ్వన్యదృశ్యంబులన్.

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[చిత్రప్రదీప ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యాశాస్త్రి

ఎట్టులుగ రంగులు గలుగు నట్టి వస్త్ర
మందు నాలు గవస్థలు నమరియుండు,
నట్టులుగనె యప్పరమాత్మ యందుఁగూడ
నయ్యవస్థా చతుష్టయ మమరియుండు.

తత్పటము ధౌతమును ఘట్టితంబు లాంఛి
తంబు రంజిత మనెడు విధంబు గానె
ఆత్మయందు చిత్తనియు సూత్రాత్మయనియు
అల విరాట్టు అంతర్యామి యనఁగ నుండు

సహజముగఁ దెల్లనైన వస్త్రంబు ధౌత
మగును, గంజిని బెట్టిన యపుడు ఘట్టి
తంబు నగును, అన్య విలేపనంబు నెడల
లాంఛనముగ వేసెడి రంగు లాంఛితమగు,
రంగు పూర్తిగ నలఁదిన రంజితమగు

మాయ రహితుఁడైయుండు నిర్మలుఁడు నైన
యటి పరమాత్మ చిద్రూప మనఁగఁ బరగు,
మాయ యను దానితోడ సంబంధ పడిన
యట్టి బ్రహ్మ మంతర్యామి యనఁగ నెసఁగు.

అవని పంచీకరణము సేయంగఁ బడక
పంచభూత కార్య స్వరూపమ్మునైన
ఆత్మ సూక్ష్మ దేహమయి సూత్రాత్మయగును,
అవల పంచీకరణము చేయఁబడినపుడు
పంచభూత కార్య సమష్టిఁబడసినట్టి
స్థూలమగు శరీరోపాధి లీలఁదాల్చు
నట్టి పరమాత్మ య వ్విరాట్టనఁగఁబరగు.

బ్రహ్మ మాదిగ స్తంబ పర్యంతముగను
ప్రాణులును జడంబులు నగు వస్తువులును
ఉత్తమాధమ భావములొంది బ్రహ్మ
మందుఁ బట చిత్రముగ నుండు నట్టివయగు.

పటములో నరులకుఁ గట్టఁబడిన యట్టి
వస్త్రములు పలు రంగుల వరలు చున్న
నవియుఁ జవియుఁ బోగొట్టైడు నవియుఁగావు
పటముపై నద్దకము చేయఁబడినవె యగు.

పటపుఁ జిత్రాల కేర్పడు వస్త్రములుగ
ఆత్మయందు నారోపితులైన యట్టి
జీవులకుఁ జిదాభాసాఖ్య చెప్పఁబడెడు,
పశువులనియు జీవులనియుఁ బక్షులనియుఁ
జెప్పఁబడు నివి సంసృతిం జెందుచుండు.

చిత్తరువుల వస్త్రంబులఁ జెలఁగు వర్ణ
ములు పటమునకుండిన యట్లు దలఁచినట్లు
సకల జీవుల కొదవు సంసారబాధ
నజ్ఞు లాత్మకున్నటు లెంచునట్టివారు.

ధరణి భృన్నదులకును జిత్తరువులందు
వస్త్రములు లేని లీలఁ గన్పడెడునట్లు
అఖిలసృష్టిలోఁ గల పర్వతాదులకును
ఆ చిదాభాసు లనియెడు నాఖ్యలేదు

బ్రహ్మమందు సంసారంబు పారమార్థి
కంబుగా లేదు, భ్రాంతిచేఁ గల్గినదియె,
అయ్యవిద్యయే భ్రాంతియు ననఁగఁ బరగు
అయ్యవిద్యయు విద్యచే నంత మొందు.

జీవునకునె సంసారంబు చెలఁగుఁగాని
ఆత్మ కొండు సంసార మన్నదియ లేదు,
అనెడు జ్ఞానము విద్య నా నలరు, నట్టి
విద్య పరిశీలనముచే లభించు నెపుడు

అందుచేత జీవునిఁ బ్రత్యగాత్మఁ గూర్చి
జగముఁ గూర్చి విచారణ సంతతంబు
చేయవలయు జగద్భావ జీవభావ
ములును గల్పితా, లాత్మయే పొలుచు నెపుడు.

జీవజగములు బాధను జెందెననఁగ
గనఁబడమి గాదు, సత్యముల్ గాని వగును,
మూర్ఛవోయినయెడ నిద్రవోయినపుడు
జగము కనుపింప, దైన మోక్షమది యగునె?

బ్రహ్మమె మిగులు ననఁగ తద్బ్రహ్మ మొకఁడె
సత్య మైనది యనెడు నిశ్చయమె, ఈ జ
గము నశించుట కా, దట్లు కాని యెడల
బ్రతికియుండఁగ మోక్షము బడయరాదు.

జ్ఞాన మపరోక్షమని పరోక్షమని ద్వివిధ
మై యెలర్చు విచారణ మాచరింప
నందు నపరోక్షపుం జ్ఞాన మందెనేని
యంతతో నాత్మపు విచార మంతమగును.

ఆ పరబ్రహ్మ ముండె నటంచుఁ దెలియ
నయ్యదియె పరోక్ష జ్ఞాన మనఁగఁ బరగు,
ఆ పరబ్రహ్మమే నేనటంచు నెఱుఁగ
నయ్యదె యపరోక్షజ్ఞాన మనఁగఁ బరగు.

ఎట్టి యాత్మ సాక్షాత్కార మెనయు నెడల
అఖిల సంసార బంధము లణఁగిపోవు
నట్టి యాత్మ సాక్షాత్కార మందు కొఱకు
బ్రహ్మతత్త్వము విస్పష్ట పఱుపఁబడెడు.

ఆకసంబు ఘటాకాశ మనియు జలపు
టాకసంబని మేఘంపు టాకసమని
అమ్మహాకాశ మని యుండు నట్లుగానె
ఆత్మకూటస్థుఁడని బ్రహ్మ మనియు జీవుఁ
డనియు నీశుఁడనియు నాల్గగుచు నుండు.

ఘటము లోపలనున్న యాకాశ మందు
ఎట్టి జలముండెడి యదియొ, యట్టి జలము
నందుఁ బ్రతి బింబ మొందుచున్నట్టి దైన
సాభ్ర నక్షత్ర మైనట్టి యాకసంబె
ఆ జలాకాశమంచును ననఁగఁ బరగు.

ఆ మహాకాశ మందుండు నంబుదముల
యందునుండు జలంబుల యందుఁ బ్రతి ఫ
లించుచుండు నాకసమును గాంచి దాని
నఖిలజనులు మేఘాకాశ మనుచు నుంద్రు.

అంబుదమున జలము తెలియంగఁ బడక
యుండినను వాన కురియుచు నుంటచేత
జలము ననుమానమున నందుఁ గలుగునంచుఁ
గాంచు, కారణమును లేక కార్యమగునె?

స్థూలదేహము నందున సూక్ష్మ దేహ
మందుఁ జలియింపకుండెడు నట్టి యాత్మ
స్వర్ణకారుని దాగలివలెను నుండు
నట్టి కతన కూటస్థుఁడు ననఁగఁ బరగె.

అట్టి కూటస్థ చైతన్యమందుఁ గల్పి
త మగు బుద్ధిని బింబించు నటి వాఁడె
జీవుఁడగు, జీవము ధరింప జీవుఁడయ్యె
నట్టి జీవుఁడె సంసారమందు వాఁడు.

ఘటపు టాకాశ మా జలాకాశమునను
గప్పఁబడినట్లు జీవుచేఁ గప్పఁబడుచు
నుండుఁ గూటస్థుఁ డందుచే నుభయులకుఁ బ
రస్పరాధ్యాస కలదని ప్రకటితంబు
(ఒక్క వస్తువుఁగని మఱియొక్క వస్తు
వనుకొనుటయె యధ్యాసము ననఁగ బరగు.)

తనకు వేఱుగఁ గూటస్థుఁడని యొకండు
ఉండె ననియును జీవుఁడెన్నండుఁ దెలియఁ
డందులకు న విద్యయె హేతువని యెఱుంగు
మ య్యవిద్య సంసృతి హేతు వనుట నిజము.

ఆవరణము విక్షేపము ననియవిద్య
రెండు తెఱఁగులు కూటస్థుఁ డుండఁడనియు
అతఁడు భాసింపఁడనియును ననుటయెల్ల
ఆవరణ మిది కూటస్థు నావరించు.

ఈవు కూటస్థు నెఱుఁగుదువే యటంచు
అజ్ఞుఁ డాత్మజ్ఞు చేతను నడుగఁ బడియు
ఎఱుఁగఁ గూటస్థు నతఁడు లేడే యటంచు
పలుకుటావరణాను భవమ్ము సుమ్ము.

అఖిలమౌ స్వప్రకాశమౌ నాత్మయందు
అయ్యవిద్య యెట్లుండును? ఆ యవిద్య
యుండకుండ నావరణ మెట్లుండు? నను కు
తర్కముల స్వానుభూతియే తరలఁజేయు.

తన యనుభవాన విశ్వాసమును బడయక
యూరకయె శుష్క తర్కము లొక్క మొగిని
అంతు లేకుండ సల్పెడు నట్టి తార్కి
కుండెటుల తత్త్వ నిశ్చయాత్ముండు నగును.

అఖిల విషయము లనుభవ మగుటకొఱకు
అనుభవానుసారంబుగ ననవరతము
తర్కమును జేయఁబూనినఁ దగునుగాక
శుష్కమగు కుతర్కముఁ జేయఁ జూడరాదు.

ఆవరణమందున నవిద్యయందుఁ దనదు
ననుభవంబు ప్రదర్శితమయ్యె, దాన
నట్టి కూటస్థ చైతన్య మయ్యవిద్య
తో విరోధింప దనుట సంభావ్యమగును.

అట్టి కూటస్థుఁ డయ్యవిద్యకు విరోధి
యైనచో నవిద్య యతనియందు నుండ
దప్పు డావరణం బెవ్వఁ డనుభవించు?
అజ్ఞు నందనుభవమె కా యావరణము?

అందుచేతఁ గూటస్థున కా యవిద్య
కే విరోధము లేకుంట యెఱిఁగి నదియ,
జ్ఞానమున కవిద్యకు నట్లుగాదు, జ్ఞాని
యం దవిద్య కభావంబు ననుభవంబె.

భ్రాంతిచే శుక్తియందున రజతమట్లు
ఆవరణ మవిద్యయుఁ గలయట్టి ప్రత్య
గాత్మయందున స్థూల సూక్ష్మాఖ్యములగు
తనువులు గల జీవుఁడు కల్పితమగు చుండు
అతఁడె విక్షేప మనెడు నధ్యాసమగును

ముత్తెపుంజిప్పఁ గని భ్రాంతిఁబొంది యొకఁడు
ఇది రజత మనియును వచియించు చుండు,
అట్టి యెడ ముత్తెపుం జిప్పయందు నుండు
నిది యనునదియె సత్యత్వ మెంతయేని
ముత్తెపుం జిప్పఁ గల్పితము నగుచుండు
వెండి, శుక్తియందునఁ దోచుచుండు నట్లు
వాస్తవ మగు కూటస్థుని వస్తుతయును

ఆ స్వయంతయు విశేష మనెడుదాన
ప్రత్యగాత్మ కల్పితుఁడయి పరగుచుండు
నా చిదాభాసుఁడను వానియందుఁదోఁచు.

అట్లు శుక్తిలో నుండు నీలాదికములు
వెండియందునఁ గన్పింపఁ కుండునట్లు
అమల కూటస్థు నందుండు నా యసంగ
తాదికము మాటువడు జీవునందు నెపుడు.

ము త్తెపుఁజిప్పఁ గల్పితము నగు రజత
మెట్లు రజత నామమును వహించు, నట్లు
ప్రత్యగాత్మ నారోపింపఁబడిన యట్టి
జీవునకుఁ బేరు నేనని చెప్పువాఁడు.

శుక్తియం దిదియన దానిఁ జూచుచుండి
దాని రజతంబుగా నెదఁ దలచునట్లు
ఆత్మ దానుగాఁ జూచుచు నాత్మ కన్య
మైన 'నే' నను నభిమానమందు నరుఁడు

ఇదియనెడు నర్థమౌ 'నిదం' పదము, వెండి
యనెడు నర్థ మొసఁగు రూప్యమను పదమ్ము,
సమ మయిన యర్థ మీయఁగాఁ జాలనట్లు
తానను పదార్థము నహంపదంపు టర్థ
మును సమానార్థకము నొసంగునవి కావు
అవియు సామాన్యము విశేషమగుచు నుండు.

దేవదత్తుండు స్వయముగాఁ బోవుఁగాక
ఈ వు స్వయముగాఁ గన్గొను మేను స్వయము
గాగ శక్తుఁడ నంచు లోకంబునందు
స్వయమను పదంబు వాడంగఁ బడుచునుండు.

ఇదియు రజత మియ్యది వస్త్ర మిట్టు లియ్య
దను పదము వాడఁబడుచుండు నట్లు గాగ
అతఁడు వీఁడు నేనను తావులందు స్వయము
పదము సమముగా వాడంగఁ బడుచునుండు.

అహము పదమున కంటె స్వయం పదమున
అన్యమైన లాభం బేమి యందువేని
ఆ స్వయంబను నట్టి శబ్దార్థమిందు
నమల కూటస్థుఁ డగుటె నా యభిమతంబు.

స్వయము శబ్ద ధర్మంబన్య శబ్ద ధర్మ
మును నివారించు నంచు నీ వనెద వేని
ప్రత్యగాత్మకు నాత్మ భావమును జెప్పు,
మాకు నట్లు చెప్పుటయె సమ్మతము సుమ్ము.

ఆత్మయన స్వయ మనఁగను నర్థ మొకటె
వాని భిన్నార్థకములుగ వాడ రెండు,
నందుచే స్వయం శబ్దార్థ మాత్మ శబ్ద
భావ మొక్కఁడె యనియుఁ జెప్పంగఁ బడియె.

ఘటము స్వయముగఁ దా నెఱుగంగఁ జాల
దను ప్రయోగంబు నుండదే యందువేని,
ఆత్మచేతనా చేతనాలందు నిండి
యుంటచే నట్లు చెప్పంగ నొప్పుఁజూవె.

చేతనాచేతనములని చెప్పు భేద
మమల కూటస్థుచే వచ్చి నదయు కాదు,
బుద్ధిఁ బ్రతిబింబితుండయి పొలుచునట్టి
ఆ చిదాభాస కల్పితమైనదె యగు.

చేతనుఁడగు జీవుఁడు భ్రాంతిచేతఁ బ్రత్య
గాత్మ యందెట్లు కల్పితుఁడైన వాఁడొ,
అట్లె చేతన రహితమైనట్టి ఘటము
ప్రత్యగాత్మఁ గల్పితమయ్యె భ్రాంతిచేత.

అతఁడు నేను నీ వనఁగ స్వయంపద ప్ర
యోగమున నాత్మ తత్త్వమ్ము నొప్పి నట్లు,
అది యిది యని ప్రయోగించునపుడు గూడ
ఆత్మ తత్వము నొప్పు మటందువేని.

అది తదాత్మక, మిది యిదమాత్మక మని
ఆత్మ పదముతోడ ప్రయుక్త మగును నిజమె,
ఆత్మ మంచిదిగా చెడ్డ యదియుఁగాగ
నెట్టులుగ సంభవింపదో యట్టులుగనె
అది యిది పదంబు లాత్మత్వ మంద వెపుడు

అది యిది యనంగ, నీవు నేననఁగ, తాను
నన్యుఁడనఁగ-లోక వ్యవహారమందు
నొకటి కొకటి విరుద్ధార్థ మొసఁగుచుండు
నిందులకు సందియం బొకయింతలేదు.

స్వయమనుచుఁ జెప్పఁబడియెడు ప్రత్యగాత్మ
అన్యశబ్దమునకు విరుద్ధార్థకంబె,
'నీవు'నకు వైరి 'నే' నను జీవుఁడెపుడు
ప్రత్యగాత్మఁ గల్పింపఁగఁ బడిన వాఁడె.

శుక్తిఁగని యిది వెండి యంచును భ్రమించి
నప్పు డిదియన శుక్తిదై నట్టి ధర్మ
మగును, రూప్యత్వ మా శుక్తియందుఁ గల్పి

తమ్ము రజతత్వ ధర్మమౌఁ. దద్విధముగ
ప్రత్యగాత్మలోఁ దానను భావముండు
జీవునందు నహం శబ్ద భావముండు
ఇరువు రొకఁడని భ్రాంతిచే నెంచుచుండ్రు.

జీవ కూటస్థు లొకటని చెప్పుటకును
ఆ యవిద్యచేఁ గల్పిత మగుచునుండు
నట్టి యధ్యాసమే హేతు, వయ్యవిద్య
నణఁచు జ్ఞానము చేనె యధ్యాస మణఁగు.

అ య్యవిద్యచేఁ గలుగు నధ్యాస మావ
రణము, జ్ఞానము చేతనే యణఁగిపోవు,
అయ్యవిద్యా బలంబున నావహించి
నదియుఁ, బ్రారబ్ధమునఁ గూడి నట్టిదియును
నగు బహిర్దృష్టి ప్రారబ్ధ మడఁగ నడఁగు.

కారణము నశించిన కొంత కాలమునకు
కార్యము నశించునని తార్కికాళి పలుకు,
అట్లె అయ్యవిద్య నశించునంత మీఁదఁ
దనువు నిలిచి యుండెడు నన్నఁ దప్పులేదు.

మతవిశ్వాసం - నేటి విషమస్థితి

బెర్ట్రండ్ రసెల్

అనువాదం : శ్రీ జాస్తి జగన్నాథం

ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న విషమపరిస్థితికి, మనోవైకల్యానికి మత విశ్వాసం క్షీణించిపోవటమే కారణమన్న ఒక సిద్ధాంతం ఈనాడు పాశ్చాత్య ప్రపంచంలో విరివిగా ప్రచారమౌతున్నది, చాలవరకు విశ్వసించబడుతున్నదీ ఈ సిద్ధాంతం వాస్తవిక పరిస్థితికి, సత్యానికి పూర్తిగా విరుద్ధమని నేను అనుకొంటున్నాను. నేటి ప్రపంచపరిస్థితికి (మత)విశ్వాసానికి సంబంధం ఉన్నదనుకొంటే ఈనాడు ఇంతకు పూర్వంకంటె ఎక్కువ విశ్వాసము ఉన్నది ఈనాటి ప్రపంచంలో మనకు ఎదురవుతున్న విషమస్థితికి, మనోవైకల్యానికి కారణం మానవుల విశ్వాసాలుకాదు పైగా ఈ విశ్వాసాలు అనేవి నేటి విషమస్థితికి కారణాలు కాకపోగా దాని ఫలితాలేనని నా ఉద్దేశం అదే ఈ వ్యాసంలో వివరించబూనుకొన్నాను.

1914 తరువాత ప్రపంచంలో జరుగుతున్న సంఘటనల నన్నింటిని పరిశీలిస్తే ఇవన్నీ గ్రీకుల విషాదాంత నాటకాలలోవలె అనివార్య పరిణామాలుగా సంభవిస్తున్నవి ఈ అనివార్యతకు కారణం బాహ్యపరిస్థితులుకావు, నాటకంలోని పాత్రల శీలప్రవర్తనాదులే దానికి కారణం ఈ పరిణామంలోని ఒక్కొక్క మెట్టుని స్థూలంగా పరిశీలిద్దాం.

బ్రిటన్, ఫ్రాన్సు, రష్యాలకు ఉన్నంతటి విస్తృత సామ్రాజ్యాలను దౌర్జన్యంతో సంపాదించగల బలం తమకూ ఉన్నదని 1914 లో జర్మనీవారు అనుకొన్నారు, విశ్వసించారు తమ బలాన్ని ప్రయోగించి ఒక మహాసామ్రాజ్యాన్ని నిర్మించుకోవచ్చునని ఆశ పడ్డారు. కాని ఈ ఆశను అరికట్టటానికి బ్రిటన్, ఫ్రాన్సు, రష్యాలు ఏకమైనవి. ఈ ఆటలో రష్యా ఓడిపోయింది ఆతరువాత 1917 విప్లవంలో సంప్రదాయక సామ్రాజ్య వాదవిధానాన్ని విసర్జించింది. పాశ్చాత్యులు రష్యాకు కాన్‌స్టాంటినోపుల్ ఇస్తామని వాగ్దానం చేశారు కాని రష్యా ప్రత్యేకంగా తానుగా జర్మనీతో శాంతి సంధిచేసికోవటంతో ఈవాగ్దానం నెరవేర వీలులేకపోయింది, లేక అవసరం లేకపోయింది. జర్మనీవారు రష్యాను ఓడించిన తరువాత బ్రిటన్, ఫ్రాన్సులు అమెరికా సహాయంతో జర్మనీని ఓడించాయి ఈ పరాజయంతో జర్మనీ తనకు ఎంత అవమానకరంగా ఉన్నా 'వార్సెయిల్స్' సంధికి ఒప్పుకోక తప్పలేదు, యుద్ధనేరాన్ని తననెత్తిని వేసికొని అంగీకరించకనూ తప్పలేదు జర్మనీవారు యుద్ధం ప్రారంభించారు కనుక వారు 'పాపులు', ఇక రష్యావారు తమంతతాము ఒంటరిగా శాంతి ఒప్పందం చేసికొన్నారు కనుక 'పాపులు' అంతకంటె ముఖ్యంగా యుద్ధ ఋణాలను చెల్లించ నిరాకరించారు. కనుక 'పాపులు', బోల్షివిక్‌లపై పోరాడటానికి ఈ యుద్ధంలో గెలిచిన దేశాలన్నీ చేతులు కలిపాయి, కాని ఓడిపోయాయి. రష్యాకు తామంటే ఏమాత్రం స్నేహసద్భావాలు లేవని గ్రహించి ఆశ్చర్యపోయాయి. ఈదేశాలు ఈలోగా జర్మనీవారు అనేక బాధలకు లోనయ్యారు. అమెరికా రిపబ్లిక్ ప్రభుత్వం చేసిన తప్పిదంకారణంగా ప్రబలిన మాంద్యంలో జర్మనీ ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి. నిరంతర బాధల మూలంగా జాతిలో హిస్టీరియా తయారౌతుంది ఈ హిస్టీరియా 'హిట్లర్'ని తయారుచేసింది హిట్లర్ రష్యామీదకు దండెత్తి దాన్ని ఎదిరిస్తాడన్న ఆశతో పాశ్చాత్యదేశాలు హిట్లర్‌ని వ్యతిరేకించటం మానివేశాయి. పైగా హిట్లర్‌తో పోల్చిచూస్తే ఇంచుమించు నిర్దోషి అని చెప్పగల వీమర్ రిపబ్లిక్‌ని వ్యతిరేకించాయి హిట్లర్

తో స్నేహం చేశాయి ఇలా హిట్లర్‌తో మైత్రి నెరపటంద్వారా ఈ పాశ్చాత్యదేశాలు నైతిక ప్రమాణాలు అనేవే తమకు లేవని మానవజాతికి తమంతతామే రుజువుచేశాయి అదృష్టవశాత్తు హిట్లర్ వట్టి పిచ్చివాడు, ఈ పిచ్చిచేత తన పతనాన్నితానే కొని తెచ్చుకొన్నాడు. హిట్లర్‌ని పడగొట్టటానికి పాశ్చాత్యదేశాలు రష్యా సహాయం అంగీకరించాయి పైగా ఇలా రష్యా సహాయం స్వీకరించటానికి ఎంతో ఉల్లాసపడ్డాయి మొదటి ప్రపంచ యుద్ధాంతంలో రష్యా, జర్మనీలు రెండూ ఒకే రకంగా బలహీనంగా ఉండగా రెండవప్రపంచ యుద్ధాంతంలో రష్యా చాల బలవత్తరంగా తయారైంది. బ్రిటన్‌కి రష్యాకీ ఎప్పుడూ సరిపడదు, రష్యాఅంటే బ్రిటన్‌కి సంప్రదాయంగా ఒక వైరభావం ఉండేది కాని 1907 - 1917 సంవత్సరాల మధ్యకాలంలో జర్మనీ భయంతో రష్యాతో స్నేహం చేసికొన్నట్లు నటించి వ్యవహరించక తప్పలేదు రెండవ ప్రపంచ యుద్ధాంతంలో ఒక వినూతనమైన అంతర్జాతీయ పరిస్థితి ఏర్పడింది, పశ్చిమ యూరపు ప్రాధాన్యం చాల తగ్గిపోయింది. రష్యా అమెరికాలు రెండు మాత్రమే బలవత్తరంగా తయారయ్యాయి. ఇక ఇలాంటి పరిస్థితులలో గత చరిత్రలో జరిగినట్లే ఈ రెండు పెద్దశక్తులకు పరస్పరం వైరం, ద్వేషం ప్రబలింది ప్రపంచాధిపత్యం నాకంటేనాకె సంక్రమించే అవకాశాలున్నాయని భావించాయి ఈరెండు దేశాలు రెండవ ఫిలిప్, నెపోలియన్, కైజర్‌ల విధానం రష్యా అవలంబిస్తుంటే ఇక అమెరికా 18, 19 శతాబ్దులలో బ్రిటన్ అనుసరించిన విధానాలను సొంతం చేసికొన్నది

అనుసరించే పద్ధతులలోతప్ప దీనిలో కొత్త ఏమీలేదు బలవత్తర శక్తులకు వైరుధ్యం చరిత్రలో ఎప్పుడూ కానవచ్చేదే కాని పద్ధతులు మారాయి, ఈ మారిన పద్ధతులమూలంగా పెద్ద శక్తులు మరింత పెద్దవావటం, యుద్ధం సర్వ వినాశనకారిగా పరిణమించటం మాత్రం జరిగింది ఒకవేళ రష్యా సనాతన మతసంప్రదాయాలకే కట్టుబడి ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితిలో మార్పు ఉండేదికాదు రిష్యా ఒకవేళ మతసంప్రదాయానికే కట్టుబడి ఉండటం జరిగి ఉంటే గ్రీకుల మతాధికారాలలోను సంప్రదాయాలలోను ఏ మతద్వేషాలైతే ఉన్నాయని మనం (పాశ్చాత్యులు) అనుకొంటున్నామో అవన్నీ రష్యాలో ఉన్నాయని అనేవాళ్ళమే ఆ పరిస్థితిలో మన ప్రచారం ఎలా ఉండేదో క్రిమియన్ యుద్ధచరిత్ర పుటలను తిరగవేసేవారికి తేలికగా బోధపడుతుంది ఇలా అంటున్నానంటె ప్రస్తుత రిష్యా పరిపాలనను నేను సమర్థిస్తున్నానని మాత్రం అనుకోకండి జారుచక్రవర్తుల పరిపాలనను ఎంతగా సమర్థించగలనో ప్రస్తుత రష్యా ప్రభుత్వాన్ని అంతే సమర్థించగలను నేను చెప్పవచ్చింది ఒకేఒక్క విషయం, నేటి ప్రపంచంలోని ప్రధానశక్తులు రెంటిలో ఒకటి క్రైస్తవమైనా మరొకటి కాకపోయినా రెండూ ఒకటే, వీటిలో భేదాలేమీ లేవు ప్రస్తుతరష్యా ప్రభుత్వం క్రైస్తవ విశ్వాసపూరితమైనదే అయినా ఈ పరిస్థితి ఇలాగే ఉంటుంది కాని ఈషణ్మాత్రమైనా భేదం ఉండదనికూడ చెపుతున్నాను ఈ వైరుధ్యానికి కారణం అధికార రాజకీయాల ప్రాచీన సంఘర్షణలు ఇవి కొత్తగా ఈనాడే పుట్టుకొని వచ్చినవికావు ఈ వైరుధ్యానికి ప్రధానకారణం విశ్వాసం, విశ్వాసలేమి అనేవి కానేకావు అలాగే ఇది రెండు రకాల విశ్వాసాలమధ్య వచ్చిన ఘర్షణకూడకాదు ప్రపంచాధిపత్యంకోసం అఱ్ఱులుచాచి ఎదురు చూస్తున్న రెండు బలవత్తర సామ్రాజ్యాల మధ్య ఘర్షణ ఇది ఈ ఘర్షణే నేటి వైరుధ్యానికి కారణం

మొదటి ప్రపంచయుద్ధం మతవిశ్వాస లేమిచేతనే సంభవించిన దని ఎవరూ అనలేరు ఆయుద్ధంలో పాల్గొన్న ప్రధాన దేశాధీశుల కెవరికీ మతవిశ్వాసం కొరవడలేదు జారు,కైజరు ఆస్ట్రియా సమ్రాట్టు వీరందరు మతవిశ్వాసం కలవారే అలాగే సర్ ఎడ్వర్డ్‌గ్రే, ప్రెసిడెంట్ విల్సన్‌లుకూడ మతమంటే చిత్తశుద్ధితో విశ్వసించేవారే ఆకాలపు ప్రధాన రాజకీయవాదు

లలో క్రైస్తవుడుకానివ్యక్తి ఒకేఒక్కడున్నాడు అతడే జీన్ జార్స్,ఇతడు సోషలిస్టు, యుద్ధాన్ని వ్యతిరేకించాడు, క్రూరంగా హత్య చేయబడ్డాడు ఆనాటి ఫ్రెంచి క్రైస్తవులందరు ఇతని హత్యను ఆమోదించారు ఇక ఇంగ్లాండులో యుద్ధానికి ఆమోదించక వ్యతిరేకించి తన పదవికి రాజీనామా ఇచ్చిన ఏకైకమంత్రి లార్డ్ మార్లే, ప్రసిద్ధనాస్తికుడు అలాగే జర్మనీలో కూడ యుద్ధానికి ఒక్క నాస్తికులనుంచి మాత్రమే వ్యతిరేకత వచ్చింది, లీబ్ నిచ్ (Liebknecht) వారికి నాయకత్వం వహించాడు రష్యాలో నాస్తికులు అధికారంలోకి రాగానే వారు చేసిన మొట్టమొదటి పని శాంతి సంధి అయితే ఈ బోల్షివిక్కులు శాంతియుతంగా ఎంతోకాలంఉండలేవనుటకూడసత్యమే కాని దీనికి కారణం ఉన్నది విజయలక్ష్మిని చేపట్టిన క్రైస్తవదేశాలన్నీ కలసి వారిమీదదాడి జరపటంచేత బోల్షివిక్కులు శాంతియుతంగా ఉండకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు

ఈ రాజకీయ వివరాలను ఇంతతో వదిలివేసి మన అసలు విషయానికి వద్దాం తమ మతం, విశ్వాసం ప్రపంచానికి మంచిని చేకూరుస్తాయని ఇతరుల విశ్వాసాలు ప్రమాదకారులని క్రైస్తవుల అభిప్రాయం. అన్ని విశ్వాసాల పట్ల క్రైస్తవులు ఈ దృక్పథం అనుసరించరని ఎవరైనా అనవచ్చు, కమ్యూనిస్టు విశ్వాసాలను గురించిమాత్రం క్రైస్తవుల భావం ఇదేనని గట్టిగా చెప్పవచ్చు, ఇంతకూ నేను చెప్పవచ్చినదేమంటేసర్వవిశ్వాసాలు హానికరమైనవేనని విశ్వాసం అంటే ఏమిటో నిర్వచించకపోతే ఇక్కడ చాల చిక్కులు వస్తాయి యథార్థ ప్రపంచంలో సాక్ష్యం గోచరించని ఒక విషయాన్ని గట్టిగా నమ్మటమే విశ్వాసమని మనం నిర్వచించవచ్చు అంటే నిరూపించ వీలులేని నమ్మకాలను అంటిపెట్టుకొని ఉండటమే విశ్వాసం రుజువు, సాక్ష్యం ఉన్నచోట విశ్వాసం గురించి ఎవరూ మాటాడరు అవి లేనప్పుడే 'విశ్వాసం'గురించి ప్రస్తావిస్తారు రెండూ రెండూ కలసి నాలుగు, భూమి గుండ్రంగా ఉన్నది అనటంలో విశ్వాసంగురించి మనం మాటాడం, వీటిని సాక్ష్యాలతోనిరూపించవచ్చు. ఇలాంటి సాక్ష్యాలకు బదులు ఆవేశోద్రేకాలు ప్రవేశపెట్టి ప్రదర్శింపదలచినప్పుడే మనం విశ్వాసంగురించి మాటాడతాం ఇలా సాక్ష్యాలకు బదులు ఆవేశాలు ప్రవేశపెట్టడం అనేక తీవ్రవైరుధ్యాలకు దారితీయవచ్చు, తీస్తున్నది కూడాను భిన్నభిన్న సంఘాలు భిన్నభిన్న ఆవేశాలను ప్రవేశపెడతాయి కనుక దీనిమూలంగా వైరుధ్యాలు తప్పవు పునర్జన్మలో క్రైస్తవులకు విశ్వాసంఉన్నది. మార్క్స్ ప్రబోధించిన అదనపు విలువను కమ్యూనిస్టులు విశ్వసిస్తారు వీటి రెంటిలో దేనినీ హేతుబద్ధంగా నిరూపించి సమర్థించే అవకాశంలేదు. అందువేత వీటి రెంటినికూడ ప్రచారంతో అదీ చాలకుంటే యుద్ధంతో సమర్థించటం జరుగుతున్నది ఈ విషయంలో రెండూసమానమే హేతుబద్ధంగా నిరూపించి సమర్థించగల వీలులేని ఏదోఒక విషయాన్ని ప్రజలు విశ్వసించటం చాల ప్రధానమని మీరు భావిస్తే, ఆ 'ఏదోఒక విషయం' ఏదైనప్పటికి వాస్తవఫలితాలలో భేదం అణుమాత్రం కూడ ఉండదు ప్రజలందరు ఒక రాజకీయవిధానాన్ని విశ్వసించటం అవసరమని మీరు భావిస్తే, మరొకరు మతవిషయం విశ్వసించటం అవసరమని భావిస్తారు, ఇంకొకరు ఇంకొక విశ్వాసం ముఖ్యమని భావిస్తారు ఈ విశ్వాసాలను నిలబెట్టటానికి చేసే ప్రయత్నాలలోకూడ భేదం ఉండదు ప్రభుత్వం మీ చేతులలో ఉన్నదనుకోండి అప్పుడు మీరేం చేస్తారు? ఏ విషయాన్ని ప్రజలువిశ్వసించటం ముఖ్యమని మీరు భావిస్తారో ఆ విషయాన్ని, విశ్వాసాన్ని బాలబాలికలకు బోధిస్తారు మీ విశ్వాసానికి విరుద్ధమైన గ్రంథాలను నిషేధిస్తారు, అగ్నికి ఆహుతి చేస్తారు మీరు ప్రభుత్వంలో లేరనుకోండి, ఇక అప్పుడేం చేస్తారు? సైన్యాలను చేరదీయిగల శక్తిసామర్థ్యాలుంటే సైన్యం తయారుచేస్తారు, ఆయుధబలాలు పెంపొందిస్తారు, అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని

కూలద్రోయటం కోసం మీకు చేతనైన సర్వ ప్రయత్నాలు చేస్తారు. సాక్ష్యంతో నిరూపించ లేని దృఢవిశ్వాసాలు ఉన్నప్పుడు ఇవన్నీ అనివార్యంగా జరిగి తీరుతాయి. ఇవి జరగవు అని చెప్పాలంటే క్వాకర్లవలె మీరుకూడ మీ అల్పసంఖ్యలో సంతృప్తిపడాలి, మీ విశ్వాసాన్ని విస్తరించేకోరిక మీకు లేకుండాఉండాలి విశ్వాసం దృఢమైనదైనప్పుడు, పరులవిశ్వాసం మీ విశ్వాసానికి వ్యతిరేకమైనదైనప్పుడు ఈ కోరిక లేకపోవటం అసంభవం.

క్రైస్తవమతంలో విశ్వాసం పెంపొందించ గలిగితే యుద్ధం రాకుండా ఆపవచ్చునని కొందరు పెద్దలే భావిస్తున్నారు దానికి ఆధార మేమిటో నాకుమాత్రం అర్థం కావటంలేదు, పైగా చాల ఆశ్చర్యకరంగా ఉన్నది. ఇలాంటి వారు చరిత్రనుంచి ఏమీ నేర్చుకొనలేకపోతున్నారని అనవలసివస్తున్నది రోమన్ రాజ్యం కాన్‌స్టాన్‌టైన్‌కాలంలో క్రైస్తవంఅయింది, ఆనాటినుంచి ఆ రాజ్యం అంతరించే వరకు నిరంతరం యుద్ధాలుచేస్తూనే ఉన్నది. ఇక ఆ రోమన్ రాజ్యంపోయి దాని స్థానాన్ని ఆక్రమించిన క్రైస్తవదేశాలు కూడా తమలో తాము అంతర్యుద్ధాలు చేసికొంటూనే గడిపాయి, కాకపోతే అప్పుడప్పుడు క్రైస్తవేతర దేశాలతోకూడా యుద్ధాలకు దిగినవి. మత విశ్వాసం లేని దేశాలకంటేక్రైస్తవ దేశాల యుద్ధోన్మాదం తక్కువని నిరూపించటానికి కాన్‌స్టాన్‌టైన్‌నాటి నుంచి నేటివరకు చరిత్రలో ఎక్కడా అణుమాత్రమైన ఆధారాలు కనిపించవు, సాక్ష్యం లభించదు పైగా చరిత్రలోని అనేక ఘోరమారణ సంగ్రామాలకు క్రైస్తవమతంలోని విభేదాలే కారణమైనవి. లూథర్, లయోలాలు క్రైస్తవులు కాదనీ ఎవరూ అనలేరు, వారి ఇరువురి భేదాభిప్రాయాలు బహుళ హింసాప్రపూర్ణసంగ్రామాలకు కారణమైనవంటే ఎవరూ కాదనలేరు గదా!

మత విశ్వాసాల ఆవశ్యకతను గురించి మరొకవిధంగా వాదించేవారు కొందరున్నారు. క్రైస్తవమతం వాస్తవం కాకపోవచ్చు, కాని సాంఘికంగా ఐక్యతను రూపొందించి పెంపొందించటానికి అది చాల ఉపయోగకారి అని వీరు అంటారు. అలాగే క్రైస్తవమతం సమగ్రమూ నిర్దుష్టమూ కాకపోవచ్చు, కాని మరే ఇతర విశ్వాసంమూలంగాను సాధ్యం గానంతగా దానివలన సాంఘికా సామర్థ్యంసిద్ధిస్తున్నది,అని వీరువాదిస్తారు మార్క్సిజంప్రభావానికి లొంగిపోయేకంటే ఆ ప్రపంచమంతా క్రైస్తవమతాధిపత్యానికి లొంగటమే మేలని నేనూ అంగీకరిస్తాను, నాగరకజాతులు ఇంతవరకు అనుసరించిన విశ్వాసాలన్నింటికంటే మార్క్సిస్టు విశ్వాసం మహోపకారిగా కనిపిస్తున్నది, చరిత్రలో యెన్నడూ ఇంత తీవ్ర తిరోగమన విశ్వాసం ప్రబలినట్లు కానరాదు, ఒక్క అజ్‌టెక్స్ విశ్వాసంతప్ప అయితే, ప్రయోజనకారులైన అబద్ధాలు లేకుండా సాంఘికఐక్యత సాధ్యంకాదన్న అభిప్రాయాన్ని నేను ఏమాత్రం అంగీకరించను ఈ అభిప్రాయానికి ప్లేటో ఆమోదం ఉన్నదనీ, మరింకెంతోమంది రాజకీయవాదులు దీనికి తమ అంగీకారంచూపి తల లూచారనీ నాకుతెలుసు. కాని ఆచరణదృష్ట్యా పరికించినా ఇది తప్పుడు అభిప్రాయమే, ఆత్మరక్షణ విషయం తీసికొంటే ఆత్మరక్షణచర్యలను, ప్రయత్నాలను హేతుబద్ధంగా వివరించి సమర్థించగల అవకాశం ఉన్నప్పుడు ఈ విశ్వాసం అవసరంలేదు, 'ప్రయోజనకారులైన అబద్ధాలతో పనిలేదు కాని మతపోరాటానికిమాత్రం ఇవి అవసరమె ఏమతసమరమూ మానవాళికి చింతాకంత లాభం చేకూర్చినట్లు చరిత్రలో ఆధారాలులేవు, అదీకాక ఈ వాదంలో మరొకదోషంఉన్నది. క్రైస్తవమతాన్ని ప్రజలు పునరాయుధీకరణలో భాగంగా పరిగణించినప్పుడు దానిలో ఆధ్యాత్మిక విలువ ఏమైనా ఉంటే దాన్నికాస్తా నిష్ప్రయోజనంచేసి నిరోధించినట్లే అవుతుంది ఇదీకాక, పునరాయుధీకరణకు ఉపయుక్తమగు భాగంగా ఉండాలంటే మతవిశ్వాసం వీరోచితమైనదిగా కలహపూరితంగా ఉండక తప్పదని

మూర్ఖంగా, సంకుచితంగాకూడ ఉండవలసివస్తుందని సాధారణంగా అందరు చెప్పే విషయమే రష్యన్లతో పోరాడటానికి క్రైస్తవ మతం సహాయకారి అని ప్రజలు భావిస్తే ఆ క్రైస్తవం 'క్వాకర్ల'క్రైస్తవం కాదన్నమాట లేదా వారువిశ్వసిస్తున్న మతంలో క్వాకర్ల లక్షణం లోపించిందని చెప్పవలసివస్తుంది పోరాటాలకు మతం సహాయకారి అన్నభావంలో మతవిశ్వాసం ప్రబలితే అది సెనెటర్ మెకార్థీ ధోరణి అవుతుంది. యుద్ధంలో మతాన్ని సమర్థవంతంచేసేది దాని నిర్మాణాత్మక సూత్రాలు కావు, పరదూషణ విభాగమే అందుకు తోడ్పడుతుంది దీనినే మరొకవిధంగా చెప్పాలంటే ఇతర విశ్వాసాలపై ఆమతం ప్రకోపింపచేసే ద్వేషం వైరంమాత్రమే యుద్ధంలో ఆమతాన్ని సశక్తికం చేస్తాయి అంటే యుద్ధంలో మతం నిర్వర్తించే కర్తవ్యం ద్వేషాగ్నులను రగుల్కొల్పటమే. పరులపై ద్వేషాన్ని రెచ్చగొట్టలేని 'విశ్వాసం' యుద్ధంలో చెప్పుకోతగ్గ కర్తవ్యం నిర్వర్తించలేదు. అందుచేత ఈ మతవిశ్వాసాన్ని యుద్ధఆయుధంగా వాడటం ప్రారంభించగానే ఆ మతాన్ని విశ్వసించనివారిపై ద్వేషం ప్రధానస్థానం ఆక్రమిస్తుంది. పైపైకి పొంగివస్తుంది తత్ఫలితంగా రెండు విశ్వాసాలు యుద్ధానికి తలపడి పోరాడుతున్నపుడు ముందు బహిర్గతమయ్యేది వాటిలోని దుర్గుణాలే ఈరెండు విశ్వాసాలు ఒకదానికొకటి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్నట్లు కనిపిస్తాయి కాని ఒకొక్కప్పుడు పరస్పరం క్రౌర్యాన్ని ఎరువు తెచ్చుకోవటంకూడ కద్దు వైరిపక్ష విశ్వాసంలో యుద్ధోపకరణాలుగా వినియోగించే వాటిని అనుకరించటంకూడ జరుగుతుంటుంది

మూర్ఖత్వం, అంధవిశ్వాసాలు యుద్ధంలో జయించటానికి మార్గాలని మనలో చాలమందికి ఒక నమ్మకం ఉన్నది. ఇది కేవలం అవివేకం; ఈ అవివేకానికి 'వాస్తవికత' అనే ముసుగు కప్పి కనపడనీయకుండ చేస్తుంటారు. యుద్ధంలో విజయం సంపాదించటానికి మూర్ఖత్వం, అంధవిశ్వాసం సహాయకారు లనటానికి చరిత్రలో ఎక్కడా ఆధారాలు కనిపించవు. రోమన్లు మెడిటరేనియన్ దేశాలను జయించినప్పుడు మూర్ఖత్వంగాని, అంధవిశ్వాసంగానీ ఆ విజయంలో ఎలాంటిపాత్ర వహించనేలేదు మెడిటరేనియన్ దేశాలను జయించటంలో రోమన్ సేనానుల ఆశయాలు-లేక ఆశలే అందాం-రెండేరెండు మొదటిది దేవాలయాలలోని సువర్ణరాసులను కొల్లగొట్టటం, ఈ కొల్లగొట్టిన దానిలో సగం తాము, సగం సైనికులు పంచుకోవటం ఇక రెండవది ప్రజలదృష్టిలో తమ హోదాను, శక్తిసామర్థ్యాలను పెంపొందించుకోవటం, తద్వారారోములో ఎన్నికలలో నెగ్గి ఋణదాతల అప్పులకు సున్నాలుచుట్టటం, సీజర్ ఈ కోవలోనివాడే అలాగే క్రైస్తవులకు మహమ్మదీయులకు జరిగిన పోరాటాలు పరిశీలించినప్పటికీ ఆదిలోమూర్ఖత్వాన్ని అంధవిశ్వాసాలను ప్రదర్శించింది క్రైస్తవులే, కాని గెలుపుమాత్రం మహమ్మదీయులకే దక్కింది మహమ్మదీయులకు సహనం ఏకోశానా లేదని క్రైస్తవ ప్రచారగాధలలో చిత్రించారు. కాని ఇది ఆనాటి మహమ్మదీయులపట్ల యథార్థం కాదు అలెగ్జాండ్రియా గ్రంధాలయాన్ని కాలిఫ్ (మహమ్మదీయాధిపతి) విధ్వంసం చేస్తున్నగాధలను ప్రతిక్రైస్తవునికి బోధించి ఆకాశం ఎక్కించారు. వాస్తవానికి ఈ గ్రంథాలయాన్ని మొదటిసారిగా విధ్వంసం చేసినవాడు కాలిఫ్ కాదు. అది ఎన్నోసార్లు విధ్వంసం చేయబడటం పునర్నిర్మింపబడటం జరుగుతునే వస్తున్నది అలెగ్జాండ్రియా గ్రంథాలయాన్ని మొట్టమొదటిసారిగా విధ్వంసంచేసినవాడు జూలియస్‌సీజర్. చివరిసారిగా నాశనం చేసినవాడు ప్రాఫెట్; మహమ్మదీయులు మొట్టమొదటి రోజులలో క్రైస్తవులవలె అసహనం ప్రదర్శించక పరమతస్థులనుకూడ తమకు లోబడగానే సహనంతో సాకారు క్రైస్తవులు అలా చేయక తమ మతాన్ని విశ్వసించని అమాయకులగు హీధెన్లను క్రూరంగా హింసించి వధించారు తమ మతాన్ని విశ్వసించనివారిని ఉరికంబాల కెక్కించటంతో సంతృప్తి చెందక తమలోతామే

ఒకరినొకరు హింసించుకొన్నారు, చంపుకొన్నారు. మహమ్మదీయులకు ఆనాడు విశాలమైన సత్వం ఉండటంచేతనే వారిని ప్రజలు ఆహ్వానించారు. ఆ విశాలదృక్పథమే వారి విజయాలకు చాలవరకు కారణమైంది ఇక ఆతరువాతి కాలాలకువద్దాం. యూదులను, మూరులను మూర్ఖంగా ద్వేషించటంచేతనే స్పెయిన్ నాశనమైంది, హ్యూగ్ నాట్లను ఉరికంబాలకు ఎక్కించటంచేతనే ఫ్రాన్సు ఘోరదారిద్ర్యానికి గురి అయింది. అణుశక్తి పరిశోధనలలో యూదులను నియిమించుకోకపోవటంచేతనే హిట్లర్ పతనమయ్యాడు ఆర్కిమిడీస్ నాటినుంచికూడ యుద్ధం ఒకశాస్త్రం (సైన్సు)గానే ఉంటున్నది, విజ్ఞానశాస్త్ర పాండిత్యమే విజయాలకు ప్రధాన కారణంగా ఉన్నది ఈ విజ్ఞానశాస్త్ర పాండిత్యానికి అంధ విశ్వాసాలకు చుక్కఎదురు ఇవి రెండు ఒక ఒరలో అమరవు, వీటి రెంటిని కలపాలనుకోవటం అసాధ్య ప్రయత్నం లైసెంకో తప్పుడు సిద్ధాంతాలను సత్యాలుగా చిత్రించి రుజువుపరచటానికి రష్యా జీవశాస్త్రజ్ఞులను స్టాలిన్ ఆజ్ఞలక్రింద ఎంతగా వేధించి నిర్బంధించారో మనకందరకు తెలుసు. లైసెంకో సిద్ధాంతాలు రష్యా గోధుమ ఉత్పత్తిని పెంచటానికి ఏమాత్రం ఉపకరించవని శాస్త్రీయ పరిశీలనతో చూడగల ప్రతివ్యక్తికి విదితమే రష్యాలో స్టాలిన్ సృష్టించిన నిర్బంధపూరిత వాతావరణంలో అణుశక్తి పరిశోధన ఎంతకాలం కొనసాగగలదో చెప్పటంఅనుమానమే. (రస్సెల్ ఈ వ్యాసం 1953 లో వ్రాశాడు ఆ తరువాత రష్యాలోనివాతావరణంలో-ముఖ్యంగా శాస్త్రపరిశోధకుల స్వేచ్ఛ విషయంలో- చాల మార్పులు వచ్చినవి. అందుచేతనే నేటి రష్యా ఉపగ్రహాలను తయారుచేసి వదలగలుగుతున్నది - అనువాదకుడు) బహుశా రష్యాలో ఇకనుంచి నిర్బంధాలు సడలవచ్చు,అమెరికాలో అంధవిశ్వాసాలు ప్రబలి అణుశక్తి పరిశోధన కృషి మందగించవచ్చు. లేదా ఇలా జరగకపోవనూవచ్చు దీనినిగురించి నే నేమీ నిర్ణయం చేయబోవటంలేదు ఈ రెండు దేశాలలో ఏ వాతావరణం ప్రబలినా ఒక్క విషయంమాత్రం స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పవచ్చు వైజ్ఞానిక స్వాతంత్ర్యం లేకుండా శాస్త్రీయమైన యుద్ధాలలో ఇకముందు ఎవరికీ విజయంసాధ్యంకాదు, ఒకవేళ తాత్కాలికంగా పొరపాటున శాస్త్రవిజ్ఞానం లేనిదేశానికి ఒకటిరెండు సార్లు విజయం లభించినా అది ఎంతోకాలం నిలవదు విజ్ఞానశాస్త్రపాండిత్య పరిశోధనలలో వెనుకబడిన దేశానికి ఇకముందు జరిగే యుద్ధాలలో గెలుపు అసంభవమౌతుంది

ఈ అంధవిశ్వాసం అవసరమని చెప్పేవారి వాదాలను మరికొంత విశాలంగా స్థూలంగా పరిశీలిద్దాం యుద్ధంలో విజయం సంపాదించటానికి, సాంఘికంగా ఐక్యతను నిలబెట్టటానికీ అంధవిశ్వాసం అవసరమని కొందరు వాదిస్తున్నట్లు పైన గ్రహించాంగదా' కాని ఇలా వాదించేవారుమాత్రం మూర్ఖులుకారు, అంధవిశ్వాసపూరితులూకారు, ప్రేరితులూ కారు. తాము అంధవిశ్వాసపరులు కాకుండానే ప్రపంచానికి దానిఅవసరం ఉన్నదంటున్నారు వీరు. ఇలాంటివారివాదం కేవలం దోషభూయిష్ఠమైనదేకాక అమర్యాదకరమైనదీ నీచమైనదీనని నాఅభిప్రాయం వీరి వాదానికి అర్థమేమిటి? హేతువాది అయిన ఏమానవుడు విశ్వసించలేని అంధవిశ్వాసాలను విశ్వసింప చేయటంకోసం ఆలోచనను చంపివేసే విద్యద్వారానో లేక, హింసించి చంపివేయటంద్వారానో ప్రతివ్యక్తిని నిర్బంధంలో పెట్టి భయభ్రాంతుని చేయటం అవసరమని వీరిభావం, ఇలా జాతిలోని వ్యక్తులందరలో స్వతంత్ర విచారశక్తిని చంపి క్రూరదండనలు ప్రవేశపెట్టనిదే ఆజాతి నిలబడలేదనీ, ఐక్యంగా జీవించలేవనీ, విభేదాలకు తావలమై అనుమానాలకు ఆకరమై అనివార్యంగా విచ్ఛిన్నమై తీరుతుందనీ వీరిభావం. జాతి మనుగడకు, ఐక్యతకు, అభివృద్ధికి అంధవిశ్వాసాలద్వారా మూర్ఖత్వాన్ని ప్రవేశపెట్టి పెంపొందించటం అవసరమని వీరి వాదాలసారాంశంగా తేలుతున్నది. పైన వివరించినట్లు ఈ అభిప్రాయానికి చరిత్రలో సాక్ష్యం లేకపోవటం

అలా ఉంచి చరిత్రలో కానవస్తున్న సంఘటనలు, గుణపాఠాలు దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నవి. 1905 లో ఒక బ్రిటిష్ సైనికదళం లాసాపై దండెత్తిన విషయం మనకందరకు తెలిసినదే ఈ దండయాత్రను టిబెట్ సైనికులు మొదట్లో చాల ధైర్యసాహసాలతో ఎదిరించారు 'సీసం మిమ్ములను ఏమీచేయకుండ మామంత్రశక్తులు మిమ్ము రక్షిస్తుంటాయి, అని టిబెట్ మతగురువులు వారిలో కలిగించిన విశ్వాసమే దీనికికారణం. కాని గురువులు తమ మంత్రశక్తులను గురించి ఎంతగా ప్రబోధించినా టిబెట్ సైనికులు మృత్యుముఖాన పడనే పడ్డారు: వెంటనే గురువులు కారణం వివరించారు బ్రిటిషువాళ్ళ తుపాకిగుండ్లకు నికెల్ ఉన్నదనీ, అందుచేత సీసంమీద ప్రయోగించిన తమ శక్తులు నికెల్‌మీద పని చేయలేకపోయినవనీ సాకు చెప్పుకొన్నారు. గురువులు: ఈ సంఘటన అనంతరం బ్రిటిషు సైనికులను టిబెట్‌లో ఎదిరించినవారేలేరు మొదట్లో అంధవిశ్వాసంతో తీవ్రపోరాటం సాగించిన సైనికులు చచ్చిపోవటంచేత, చావక మిగిలినవారు ఈ అంధవిశ్వాసంతో మోసపోయామని విసిగి పశ్చాత్తప్తులు కావటంచేత బ్రిటిషు సేనలను ఎదిరించేవారు లేకపోయారు. అలాగే స్పెయిన్‌రాజు రెండవ ఫిలిప్‌నికూడ ఈ సందర్భంలో ఉదాహరణగా చూడవచ్చు. మతవిశ్వాసంలేని ద్రోహులపై, దైవద్వేషులపై తాను సాగిస్తున్న యుద్ధాన్ని దేవతలు తప్పక దీవించి విజయం సిద్ధించేటట్లు ఆశీర్వదిస్తారన్న విశ్వాసంతో ఆంగ్లేయులతోను టర్కులతోను యుద్ధం చేయటంలో గల తారతమ్యాన్ని గమనించనవసరంలేదనుకొన్నాడు రెండవ ఫిలిప్, ఫలితంగా పరాజయం పొందాడు ఇది ఇలా ఉండగా నేటి ప్రపంచంలో మరొక భావంకూడ ప్రబలంగా ఉన్నది ఒకప్రక్క అంధవిశ్వాసాలకు అంటిపెట్టుకొని ఉంటూ మరొకప్రక్క ప్రజలు శాస్త్రీయదృక్పథంతో వ్యవహరించగల అవకాశమున్నదని చాలమంది భావిస్తున్నారు వాస్తవిక పరిస్థితికి సత్యానికి విరుద్ధమైన అంధవిశ్వాసాలను ప్రజలకు ప్రబోధిస్తూనే మరొకవంక మరికొన్ని విషయాలలో ఆ ప్రజలే శాస్త్రీయ మనస్తత్వం పెంపొందించుకొనగలరని ఆశిస్తున్నారు. ఇది సత్యముకాదు, సంభవముకాదు మానవుడు ఒకవంక అంధవిశ్వాసాలతో మరొకవంక హేతువిచారంతో ప్రపంచంలో వ్యవహరించలేడు. వీటిరెంటిని సమ్మేళనం చేయబూనటం జరగనిపని హేతువిచారాన్ని అనుసరించటమంటే ప్రపంచంలో కానవస్తున్న సాక్ష్యాలను వాస్తవ పరిస్థితులను గమనించటం, వాటి కనుగుణంగ తన భావాలను దృక్పథాన్ని మార్చుకోవటం. మానవుడుకొన్ని విషయాలలో ఈ దృక్పథాన్ని అనుసరిస్తూ మరికొన్ని విషయాలలో ఈమార్గాన్ని త్యజించి దానికి విరుద్ధమైన అంధవిశ్వాసాలకు తల ఒగ్గటం అసంభవం ఒకవంక సాక్ష్యంతో వాస్తవికాధారాలతో నిరూపించలేని గుడ్డినమ్మకాలను విశ్వసించమంటూ మరొకవంక శాస్త్రీయ మనస్తత్వం అభివృద్ధి చెందిందని ఆశించటం గగనకుసుమాన్ని ఆఘ్రాణించ యత్నించటమే అవుతుంది

ప్రయోజనకారులూ సుఖదాయకాలు అయిన అబద్ధాలసాయం లేకుండా జీవితంలోని ఎగుడుదిగుళ్ళను, కష్టనష్టాలను, ఆటుపోటులను ఎదుర్కొనలేని మానవునిలో ఏదో బలహీనత, కొంత నైచ్యంకూడ ఉన్నదనే చెప్పాలి. జీవితాన్ని ఎదుర్కొనలేనివారు జీవితంలోని ఆటుపోటులను తేలిగ్గా నివారించగల కొన్ని అబద్ధాలచాటున దాగుకొని, అవేతమను కాపాడుతాయన్న విశ్వాసంతో బ్రతుకును దొర్లిస్తుంటారు కాని ఈ విశ్వాసం కేవలం నిర్హేతుకమైనదని అబద్ధమనీ అతనికి కూడతన అంతరంగంలో ఎక్కడో ఒకచోట తెలిసే ఉంటుంది అయినా ఆవిశ్వాసం తనకు కొంత సుఖదాయకంగా ఉండటంచేత దానిని విశ్వసిస్తాడు; విశ్వసిస్తున్నట్లు భావించుకొంటాడు. ఈ విశ్వాసం కేవలం నిరాధారమైన భావమని అతనికీ తెలుసు, కాని ఈ భావాన్ని అతడు ఎదుర్కొనలేడు, ఈ విశ్వాసం కేవలం అబద్ధంఅన్న సత్యాన్ని

లోలోపల దాచివేసికొంటాడేగాని ఆ సత్యాన్ని ధైర్యంగా ఎదుర్కొనలేడు. అందుచేత అతడు తన భావాలను తార్కికంగా కొనసాగించి చూచుకోలేడు. ఇది ఇలా ఉంచి తన విశ్వాసాలు నిరాధారమైనవని అతనికి అంతరంగంలో తెలిసే ఉండటంచేత, హేతుబద్ధంగా వాటిని స్థాపించగల అవకాశం లేదని అతనికి స్పష్టమే కనుక, ఆ విశ్వాసాలను ఎవరైనా అనుమానించి ప్రశ్నించటం మొదలుపెడితే వాదనకుబదులు క్రౌర్యం ప్రదర్శించాడు, తన విశ్వాసాలను శంకించేవారిని హింసించి ఉరి కంబాలకు ఎక్కిస్తాడు, సెన్సార్ ప్రారంభిస్తాడు బాలబాలికల లేతహృదయాలను సంకుచిత విద్యలో బంధిస్తాడు, ఈబంధించటం ప్రభుత్వ కర్తవ్యమని ప్రబోధం ప్రారంభిస్తాడు, తనకు సాధ్యమైనంతవరకు, వీలున్నంతవరకు ధైర్య సాహసాలులేని పిరికి పందలను తయారు చేస్తాడు, అభివృద్ధిని ఆకాంక్షించి సాధించలేని దద్దమ్మలతో సంఘాన్ని నింపివేస్తాడు సంఘాన్ని కొత్తవిషయాల జోలికిపోనీయకుండా ఉక్కుచట్రంలో బిగిస్తాడు నియంతృత్వ పరిపాలకులందరు ఇలాంటి సంఘాన్ని తయారు చేయటానికే ప్రయత్నించారు. ఈప్రయత్నంలో తాత్కాలికంగా విజయం పొందారు. కాని వారి విజయంతో దేశాలను నిర్జీవంచేసి ధ్వంసం చేశారు.

ఇక ఒక్క విషయాన్ని స్పష్టంచేసి ఈ వ్యాసం ముగిస్తాను అంధవిశ్వాసం కూడదని ఈవ్యాసంలో చెప్పిన అభ్యంతరాలు అన్నిరకాల అంధవిశ్వాసాలకు చెందుతాయి ఏరకమైన అందవిశ్వాసానికైనా ఈ అభ్యంతరాలు అనువర్తిస్తాయి. మీరు బైబిల్‌ని అక్షరాలా విశ్వసించవచ్చు, మరొకరు కొరాన్‌ని తుచ సర్వం నమ్మవచ్చు; ఇంకొకరు మార్క్సుకృత 'కేపిటల్'ని విశ్వసించవచ్చు, ఇవన్నీ ఒక్కటే, ఈ వ్యాసంలోని అభ్యంతరాలు వీటికన్నిటికి వర్తిస్తవి మీరు వీటిలో ఏ విశ్వాసానికి కట్టుబడినా వాస్తవసత్యాలను, సాక్ష్యాలను తిరస్కరించకతప్పదు ఇలా మీరు ఒక విషయంలో సాక్ష్యాన్ని తిరస్కరించి మనసుని సంకుచితపరచుకొని గోడలు కట్టుకొని బంధిస్తే మరొక విషయంలోకూడ అలాగే చేస్తారు కాని విశాల దృక్పధం అలవరచుకొని అనుసరించలేరు. దీనికి ఉదాహరణ వెల్లింగ్టన్ యువరాజు, ఈటన్‌లోని క్రీడారంగం విలువను శంకించటానికి అతడెప్పుడూ అంగీకరించలేదు అందుచేతనే పాతబడిన 'మాస్కెట్'కంటె రైఫిల్ చాల గొప్ప ఆయుధమని అతడు అంగీకరించలేకపోయాడు, దేవుని విశ్వసించటం ఈటన్‌లోని క్రీడారంగాన్ని విశ్వసించటమంత ప్రమాదకరం కాదని మీరు అనవచ్చు. ఈ విషయం మీద నేనేమీ వాదించను. కాని ఒక్కమాట మాత్రం చెపుతాను. మీరు దేవుని విశ్వసించవచ్చు, కాని మీ విశ్వాసం వాస్తవపరిస్థితికి, సాక్ష్యానికి యింతవరకు అనుకూలంగా లేదని మీరు మీఅంతరంగంలో శంకిస్తారో మీవిశ్వాసం అంతమేరకు ప్రమాదకారిగానే ఉంటుంది. మీ విశ్వాసానికి ఆధారంలేదని మీ అంతరంగానికి తెలియదా? ఆ అనుమానం మీకో ఎంత ఎక్కువగా ఉంటే మీ విశ్వాసం అంత ప్రమాదకారి అవుతుంది. అసలిక్కడ మీరు దేనిని విశ్వసిస్తున్నారనేది ముఖ్యంకాదు, ఎలా విశ్వసిస్తున్నారు అనేదే ముఖ్యం భూమి బల్లపరుపుగా చదరంగా ఉన్నదని విశ్వసించట ఒకప్పుడు హేతుబద్ధమే ఆనాడు దానిని ఇలాగే విశ్వసించారు అయితే ఆనాడు అలా విశ్వసించటంవలన ఇప్పుడు మనం అనుకొంటున్న అంధవిశ్వాసం మూలంగా కలిగే దుష్పరిణామాలేమీ కలగలేదు. కాని భూమి బల్లపరుపుగా చదరంగా ఉన్నదని నేటి మనకాలంలో విశ్వసించేవారుమాత్రం హేతువాదాన్ని తిరస్కరించి మనసులకు అడ్డుగోడలు కట్టుకొని సంకుచితులుకాక తప్పదు పైగా ఇలాంటి ఒక అసంబద్ధవిశ్వాసంతో ప్రారంభమై దాన్ని నిలుపుకోవటానికి అన్నిరకాల అంధవిశ్వాసాలకు అపహాస్యాలకు గురికావటం జరుగుతుంది, మావిశ్వాసం హేతుబద్ధమైనదని, సాక్ష్యంలో దాన్ని నిరూపించవచ్చుననీ మీరు భావిస్తే ఆ విశ్వా

సాన్ని మీరు చర్చలతో,వాదాలతో నిలబెడతారు కాని హింసలకు, హత్యలకు పాల్పడరు ఒక వేళ వాదంలో మీరు చూపిన హేతువులు నిరాధారాలని తేలితే ఆ విశ్వాసాన్నే మీరు విసర్జిస్తారు వాదంలో నెగ్గగలిగితేనే ఆ విశ్వాసానికి అంటిపెట్టుకొని ఉంటారు మీవిశ్వాసం హేతువులమీద కాక కేవలం విశ్వసించటంమీదనే ఆధారపడేదైతే వాదనతో, చర్చలతో ప్రయోజనం లేదని మీకు తేలికగానే బోధపడుతుంది

ఇక అందుచేత వాదించి మీ విశ్వాసాన్ని నిలబెట్టగల అవకాశంలేక, ఆ విశ్వాసాన్ని విసర్జించటం ఇష్టంలేకనూ దౌర్జన్యాలకు దిగుతారు, ప్రత్యర్థులను హింసిస్తారు, అధికారం మీ చేతులలో ఉంటే ఉరికంబాలకుకూడ ఎక్కిస్తారు, అదీచాలక 'విద్య' పేరుతో బాలబాలికల లేత మనసులను మీ యిష్టంవచ్చిన మార్గంలోకి మలిచి మరొక విధంగా మళ్ళకుండా కట్టివేస్తారు ఇలా పిల్లల మనసులను మూసలలో పోసి బంధించటంకంటె నీచం, మోసం మరొకటి ఉండదు ఆత్మరక్షణ చేసికొనలేని అపరిపక్వమైన లేతహృదయాలపై ఇలాంటి దాడి జరపటం పైశాచికచర్య.కాని దురదృష్టవశాత్తు ప్రతి నాగరకదేశంలోని పాఠశాలలోను ఈదారుణం కొద్దిగానో గొప్పగానో అమలు జరుగుతూనే ఉన్నది

అంధవిశ్వాసాలకు అనుకూలంగా పైన వివరించి పూర్వపక్షంచేసిన వాదాలనే కాక మరొక వాదంకూడ చేస్తున్నారు కొందరు అన్యాయుధాలను మరింత శక్తిమంతంచేయటానికి అనువుగా 'సెర్మన్ ఆన్ ది మౌంట్' సూత్రాలను వ్యాఖ్యానించాలని కొందరు అంటున్నారు. ఇంతకంటె అపహాస్యకరమైన వాదం, ఆక్షేపణీయమైన మార్గం మరొకటి ఉండదు. నేనే క్రైస్తవుణ్ణి అయిఉంటే ఇంతకుమించి సిగ్గుపడవలసింది మరొకటి ఉండదని భావించే వాడిని.

గోవిందరామాయణము

విశ్వామిత్ర శరణాగతి

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

తుంగ తరంగ మాలికలతో సరయూనదిగూడి యాడుచుఁ
ఖంగున ముందుకుందుముకు గంగను నీవు సముద్రగామినిఁ
బొంగుచు నావనూపుఁ బరిపూతను భక్తినిబద్ధహస్తులై
వంగి నమస్కరించి నృపబాలురు దాఁటిరి మౌనియుక్తులై.

ఘోరారణ్యము క్రూరజంతుతతి నిర్ఘోషప్రకృష్టమ్ము దు
ర్వార రౌద్రిక్తభయంకరా స్పదతరు ప్రక్షోభదుర్గమ్ము త
త్తీర వ్యాప్త పురాణదృశ్యమయముఁ దివ్యాద్భుతావిష్టముఁ
ధీరుండా రఘురాముఁడంతఁ గనియెఁ దేజఃప్రదీప్తాంకుఁడై.

కనికనిదాని గౌశికునిఁ గాంచుచు నీ వననామమేమి యె
వ్వని యిలయిద్ది యెవ్వరి నివాసము సర్వమునే వినందలం
తును వివరింపవేయని కుతూహలియై రఘురాముఁడాడ నా
తని మనసున్గ్రహించి ముని తత్కథఁ దెల్పఁగ సాఁగె నీగతిఁ.

ఇదె సుమ తాటకా విపినమియ్యది దాని నివాసభూమి య
య్యది వసియించు నీ యడవినామడ దూరముపైని క్రూరమై
తుది గనకుండె నిప్పటికి దుర్బలయుక్తుఁడు వీరుఁ డొక్కఁడా
ముదితను గామరూపిణినిఁ బోరజయింపఁగలాఁడు లేఁడకో.

మలదకరూశభూములు సుమా యివి మున్నుజనుల్ వసించు నీ
స్థలములు చాలయేండ్లు ధనధాన్యసమృద్ధిని వృద్ధినొంది యా
వలనిటు మాఱెఁ దాటక నివాసముచేయుచు నిర్జనంబుగాఁ
గలఁచుటఁజేసి, వీర చిర కాలముఁ బన్నగరీతి దుష్టయై.

దాని కొమరుండె మారీచ దానవుండు
దానిభర్తయె సుందుఁడు వానిఁజంపె
మున్నగస్త్యుండు దాన స్వపుత్రుఁగూడి
పోరుసల్పెను మునితోడ మూర్ఖమతిని.

అందకత్తెయైన యక్షసుకేతుని విమల పుత్రియువతి విదుషియంత
మౌనిశాపవశత మాఱె రక్కసిగాఁగఁ బుత్రుతోఁడ యిట్లు పుడమినేఁచ.

పాపయౌవన విమల స్వరూపమెల్ల నాడగస్త్యునిచేత వినాశమగుట
దారుణాకార క్రోధయాధాత్రి నేఁచు నిర్జనముగానిది యగస్త్య నేలయగుట.

చంపుమీ రామ తాటకఁజంపు మిపుడె
వీర గోబ్రాహ్మణ హితమ్ము గోరువాఁడ
అబల దుష్టపరాక్రమ యగుటఁజేసి
వధ్యురాలయ్యె నీచేతఁ బ్రజలకోఱకు.

వినుచుఁ దాటక దుష్ప్రవర్తనము నా వీరుండు రూఢాత్ముఁడై
కని నల్దిక్కుల, వధ్యయంచనెడి వాక్యంబుల్ వినుఁదోడనే
తనముందే గల కౌశికుఁ మునిని విద్యాబోధకుం జూచుచుఁ
గనుఱెప్పల్ దిగజార్చు యోజనము నాకాంక్షించు నెమ్మోముతో.

ఓహో ధర్మపరాయణా వినుము నీ వూహించు చందమ్మె వ్యా
మోహమ్మౌను ప్రజల్ సుఖమ్ముగనుటే భూపాలు ధర్మమ్మునే
నా హత్యఁ బురికొల్పువాఁడ, నిల లో కార్థంబు దుర్మార్గులఁ
బాపోటమ్ముగఁ జంపనొప్పునది పాపంబౌనె పుణ్యంబె కా.

జనబాహుళ్య సుఖార్థియై ప్రజకు రక్షంగూర్పఁగా భూపుఁడే
పనినైనఁ నెరవేర్ప నొప్పునది పాపంబేని పుణ్యంబయేన్
ఘనతఁ గూల్చెడిదేని క్రూరమయినఁ కాకుత్స్థభూపాల నం
బున నల్లేనిఁ బ్రజాసుఖమ్మునిడువే భూనాథు ధర్మంబగుఁ.

నాలుఁగు వర్ణముల్ సుఖమునఁ మనుఁదాటకఁ జంపితేని, భూ
పాల తనూజ స్త్రీవధకుఁ బాల్పడరాదని యెంతువేని, ము
న్నే లెడివారు స్త్రీల వధియింపరొ? శక్రుఁడు మంథరాంగనఁ
శ్రీ లలనావిభుండె సురసేవిత శుక్రునిభార్యఁ జంపరే?

ఎందఱొ మున్నుభూవరు లహీనపరాక్రమ వీర్యవంతులే
యెందఱొ పూరుషోత్తములె యింతులఁజంపరె? దుష్టలౌటచేఁ
గొందల మందఁగాఁ దగదుక్రూరులనేరి వధింపనైననిఁ
బొందదు హింస యిట్టియెడఁ బొందగలాఁడ వహింసధర్మమే.

అను ముని ధర్మ నిర్వచనమంతయు వించుఁదదేక దృష్టితో
నినకుల వంశజాతుఁడు నరేశసుతుండు దృఢవ్రతుండు నె
మ్మన మొక నిర్ణయంబుఁగన మౌనికిఁ బ్రాంజలియై వచించె మో
మున సరిక్రొత్త కాంతుల సమూహము మూఁగుచుఁ బ్రజ్వలింపగన్.

మునివర ధర్మనిర్వచనమున్ వినిపించితి వంతకంటె నా
జనకునియాన మిన్నయది సంస్మరణం బొనరించుచుంటినన్
బనిచెడినాఁడు దత్సభను బార్థివముఖ్యుఁడు నాదుతండ్రి నీ
వనెడి విధంబునన్ మెలఁగ నాజ్ఞనొసంగె వసిష్ఠుసన్నిధిన్.

ఆ యానస్జవదాఁట నేర నదె ధర్మార్థంబు నాకెప్డు నే
నీ యాజ్ఞన్వధియింతుఁ దాటకఁ బ్రజానీక ప్రమోదంబుగా
నాయా దేశములన్ని సస్యములు మున్నేరీతి వర్ధిల్లెనో
యాయారీతిగ సారమంతమయి సౌఖ్యంబే జనుల్పొందగన్

అనుచు న్వింటిని ముష్టిబట్టి నడుమల్లాడంగ నారిన్వడిన్
ధ్వని నల్దిక్కులు మ్రోగలాగెను బ్రతిధ్వానంబు సేయంగ నా
వని భూనాథసుతుండు తాటకయు విభ్రాంతిన్ మహాటంకృతిన్
వినుచున్వచ్చెను హుంకృతిన్ భయకరోద్వేగంబునన్ బైఁబడన్.

హాహాకార విజృంభమాణ భయదవ్యాపార సంరంభమౌ
దేహంబున్ పిదలించుచున్ గుపిత యేతెంచెన్ జుమాయద్దె భృ
త్సాహమ్మంచును మ్రొక్కభూమికిదె వత్సా లక్ష్మణా గూల్తు సం
దేహింపన్ బనిలేదు ముక్కుజెవులన్ నిర్మూలముం జేసెదన్.

ఆఁడుది దుష్టురాలయిన నాయువుదీయుట పాడియౌనె? చే
యాడదు నాకుఁగాని, జనులందఱు సౌఖ్యమునంద నామె పో
రాలెడి బాహువుల్ నఱికి యంతటఁ గాళ్లనుగూడఁ ద్రుంతునే
వాఁడ జరింపకుండనిటు పట్టి శవంబుగనుండ జీవియై

ఇత్తఱి క్రోధ ఘూర్ణితమహీయ రవమ్మున రాముపైకిఁ జే
యెత్తుచు హుమ్మటంచు వడినేఁగుచుఁ దాటక యల్లె దూకె నా
యత్త నిశాతబాణధరుఁడౌ రఘురాముఁడు గూడ నుగ్రుఁడై
మొత్తె శరాళిభిన్న భుజముల్ గలదానిగఁ దానిఁ జేయఁగన్.

బాహువులు లేని రక్కసిభామ యపుడు రాళ్లువర్షించి వర్షించి రాముపైన
రివ్వురివ్వున రాముని దవ్వుజేరి భూమిపైఁగూలి యలసటఁ బొందసాఁగె

కత్తితో ముక్కుచెవుల లక్ష్మణుఁడు కోసె నంతనైన బరాజయ మందినట్లు
పాఱిపోవక మాయావికారగతుల నంధకారమ్ము దెచ్చి పోరాడునామె.

రూపమును బాసి బహువిధ రూపమెత్తి
శాత్రవు నెదుర్చు దుర్భర సమరసరణి
కౌశిక మునీంద్రుఁడాస్థితిఁ గాంచిగాంచి
స్వస్తి జయరామ రఘురామ స్వస్తియనుచు

ఇంతవఱకుఁ గరుణ నింతిపైఁ జూపితి వంతెచాలు దుష్టయయ్యెఁ బిదప
మారవచ్చు ననెడి మహనీయబుద్ధితోఁ జంపవైతి వింకఁ జంపఁదగదొ.

తడవేలా వధియింపు మీ, కరుణకున్ దావిత్తువే వీరరా
ముడ! సాయంసమయమ్ము, ప్రొద్దుఁగ నా మూర్ఖాంగనా శక్తి వే
ముడుగుల్ పెంపగుమౌని, రాఘవుఁడు ధర్మంబెత్తి బాణంబునన్
వడిఁగొట్టెనురితో నిశాట వనితా వక్షస్థలంబందునన్.

హాయని భీకరధ్వనిఁ భయంకరరూపిణి నేలఁగూలె, నా
హాయని దేవతల్ మురిసిరంత దివిన్వడి ఢక్కమ్రోగెనో
హాయని నాల్గుదిక్కుల నరోత్తముని న్ప్రకటించు రీతి "రా
మాయ నమోనమోస్తు" నుచు మౌనులు మ్రొక్కిరి వారియాత్మలన్.

జనకుని యానమీరక విశాంపతి ధర్మము దీర్చిమౌనికిన్
వినయముఁజూపి తృప్తిగను వీరుఁడు రాముఁడు కౌశికుండొ బా
లుని దలమూర్కొనెన్మడిసి డుల్లుట రక్కసి మాయలాడి యా
వనమున దైత్యరాజ పరిపాలన మంతమునొందె నాఁటితోన్.

దినకరుఁడేగుటన్ దశరథేయులు మూడవనాటిరేయి న
మ్ముని వచనప్రకారముగ ముందరికేగక నిద్రజెందిరా
వనమున గాధిసూనుడు ప్రభాతమునందున వారిలేపి దా
ముని పరమౌమనమ్ము వెలిబుచ్చెడి మోమున మందహాసుడై.

తప్పుడు లెక్క

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

రెండురెండ్లు నాలుగూ అంటే, కాదు అయిదు అనేవాడు ఉంటాడాఅంటే, ఉంటాడు' ఉంటాడేమిటి? - ఉన్నాడు' అతనే మూర్తి

మూర్తి మొండిఘటం మనం అవునన్నది కాదంటాడు పట్టినపట్టు ఒకపట్టాన వదలడు తను పట్టిన కుందేటికి మూడేకాళ్ళంటాడు చిత్రం ఏమిటీ అంటే - అలా అని నిజంగా మూడేకాళ్ళు కాబోలునని - మనకూ భ్రమకలిగే టట్లు చేస్తాడు ఇదే మూర్తిలో గొప్పతనం,

మూర్తి మాట్లాడని విషయమంటూ లేదు ఆంధ్ర మంత్రివర్గం మొదలు అంతర్జాతీయ రాజకీయాలదాకా ఏకధాటిగా ఏకరువు పెడ తాడు పెట్టి ఎదుటివాడు ఎంత ఘటికుడయినా సరే, ఇట్టే పల్టీ కొట్టిస్తాడు

మూర్తికీ నాకూ ముప్ఫయిఏండ్ల స్నేహం ఇరువురం ఒక ఊరివాళ్ళం ఒకబళ్ళో చదువు కున్నాం కాని ఒకపాదులో పుట్టి ఒకపాదులో పెరిగిన రెండురకాల చెట్లు రెండురకాల పూలు పూసినట్లు, మా ఇరువురి జీవితాలూ వేరయి నాయి వాడు తొక్కినదోవ వేరు, నేను తొక్కిన దోవవేరు వాడు ఊళ్ళు ఏలుతున్నాడు, నేను ఉద్యోగాలు చేస్తున్నాను

ఉన్నచోట ఉండడు మూర్తి ఉన్నచోటు వదలను నేను

మూర్తి తిరగని ఊరులేదు అటు కాశ్మీరం నుంచి ఇటు కన్యాకుమారివరకు చుట్టివచ్చాడు ఏంచేస్తున్నావురా అని అడిగితే అన్నీ చేస్తు న్నానంటాడు, వాడు చేసేదేమిటో బ్రహ్మ- రుద్రుడికి తెలియదు వాడు వ్యాపారస్థుల్లో వ్యాపా రస్థుడు, వ్యవహారస్థులో వ్యవహారస్థుడు, నేను ఒక్క అధికారితో వేగలేక చస్తున్నా. వాడు ఇంతమంది జనంతో ఎట్లా వేగుతున్నాడో - ఆ ఏడుకొండలవాడికే ఎరుక!

అయినా మూర్తి జీవితంలో ఏలోటూలేదు అన్నీ ఉన్నాయి మనిషి పైలాపచ్చీసుగా ఉంటాడు నిముషానికో డ్రస్సు మారుస్తాడు ఫెళఫెళలాడే ఇస్త్రీబట్టలు - మడత మాయ నివ్వడు నిండుగా ఉంటాడు దిగులంటే ఏమిటో ఎరగడు దేశాన్నంతా తానేఏలుతున్న ట్లు కనుపిస్తాడు ప్రొద్దస్తమానం లెక్కలు విరు చుకుంటున్నా, ధరలు ఆకాశానికి అంటిన ఈ దౌర్భాగ్యపుకాలంలో ఒక్క కుటుంబాన్ని ఈదు కోలేక తల్లక్రిందులయి తన్నుకచస్తున్నాను నేను మరి మూర్తి? - మూర్తికి ఏబెడదాలేదు. కాలం ఎట్లాగన్నా ఉండనీ - వాడుమాత్రం పూలరంగడులా ఉంటాడు

అసలు కొందరు పెట్టిపుడతారు వాళ్ళ పుటకే అంత వాళ్ళ అదృష్టమే అంత, వాళ్ళ జీవితమే అంత - అందరికీ కావాలనుకున్నా అది అబ్బదు

ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, మూర్తికిఆర్థిక ఇబ్బందంటూ లేదు

రెండుచేతులా సంపాదిస్తాడు నాలుగు చేతులా ఖర్చుపెటతాడు ఎలా ఆర్జిస్తాడో ఎలా ఖర్చుపెడతాడో ఇంత ఆప్తుడనయిన నాకే అంతుపట్టదు

మూర్తి తరుచు నాదగ్గరికి వస్తుంటాడు. దిగులుగా, దీనంగా ఉన్న నాకు, తన ఉప న్యాసాలతో ధైర్యం నూరిపోసి మరీ కొడుతుం టాడు వాడి తత్వం నాకు తెలుసు కనుక, వాడు నాకు వశంకాడు కనుక నేనువాదించను నేనే వాడికి వశమై ఊరుకుంటాను

"సమాజాన్ని చూచి బెదరకూడదోయ్ బెది రినవాళ్ళను మరీ బెదరకొడుతుంది ఈసంఘం. అదే మనలనుచూచి బెదిరేటట్లు చెయ్యాలి'" అంటాడు మూర్తి.

"అది నావల్ల అయ్యే పనికాదు - "అంటాను నేను,

"అదే పనికిరాదు" అంటాడు మూర్తి

నా జీవితాన్ని మూర్తి జీవితంతో అనేక తడవలు పోల్చి చూచుకున్నాను వాడికీ నాకూ

ఎక్కడా పోలికలేదు ఏగొడవా పడకుండా గుట్టుగా సంసారం వెళ్ళ తీసుకోవాలని నా తాపత్రయం ఎన్నో గొడవలు పడాలంటాడు మూర్తి నాబ్రతుకు నేను బ్రతకాలంటాను నేను అందరి బ్రతుకూ మనం బ్రతకాలం టాడు మూర్తి. మోసం అన్యాయం,-ఇవి నాచేత కాదంటాను నేను బ్రతుకే ఒక పెద్దమోసం అంటాడు మూర్తి! మూర్తి ఎంత చిత్రమైన వాడు!

ఆనాడు ఆదివారం అప్పుడే నేను బట్టలు వేసుకుని బయటికివెళ్ళేప్రయత్నంలో ఉన్నాను అంతలో ఒక చిన్నకారు వచ్చి ఇంటిముందు ఆగింది ఎవరో అనుకున్నాను కాని నన్నే పిలిచారు. వాకిట్లోకి వెళ్ళి చూచాను. మూర్తి కారులో ఉన్నాడు

"ఎక్కు-కారు" - అన్నాడు

"ఎక్కడికి?" - అన్నాను

"అడగకూడదు" - అన్నాడు మూర్తి - "ఇవాళ ఆదివారంగా అలా వెళ్ళొద్దాం" - అన్నాడు

నేను మారుపలకలేదు ఎప్పుడూ ఎవరికీ ఎదురు చెప్పనివాణ్ణి - అందరికీ, అన్నిటికీ లొంగినట్లే మూర్తికీ లొంగాను అందరికీ లొంగినప్పుడు నాకు అన్యాయం జరిగినట్లని పించింది మూర్తి విషయంలో మాత్రం అలా అనిపించలేదు

వెళ్ళి కారులో ఎక్కాను. కారు కదిలింది. మూర్తి కారు నడుపుతున్నాడు నేను ప్రక్కనే కూచున్నాను తీరా చూద్దునుకదా, వెనకాల సీటులో ఒక స్త్రీ ఉంది నాకు కళ్ళు జిగేల్ మన్నాయి మెరుపును చూచినట్లు - కనులు మూతలుపడ్డాయి ఆవిడ ఎవరో శ్రీమంతురా లని తోచింది. చదువు-సంస్కారం అన్నీ ఉన్నట్లు కనుపించింది లోకంలో అందమంతా ఆవిడ కళ్ళలోఉంది!

"ఎవర్రా ఈచంచలాక్షి?"మూర్తిని మెల్లిగా అడిగాను

"అడగ్గూడదు-చూడు!"-అన్నాడు మూర్తి.

వెనక్కు తిరిగి చూడాలనిపించింది కాని అంతలోనే మనస్సు చివుక్కుమన్నది ఏవేవో ఆలోచనలు వచ్చి మనస్సునిండా ముసురుకు న్నాయి మూర్తి ప్రవర్తనపై అనుమానం కూడా కలిగింది కాని మౌనంగా ఉండి పోయాను.

కారు వెళ్ళి ఒక పెద్ద బంగళా ముందు ఆగింది ఆవిడ కారు దిగగానే నన్ను ఆవిడకు పరిచయం చేశాడు మూర్తి ఆవిడ ఆంగ్లంలో మాట్లాడింది చాలామర్యాదగా ప్రవర్తించింది ఆవిడ శీలాన్నిశంకించడానికి ఎక్కడా ఆస్కా రంలేదు

ఆవిడ ఎవరోకాదు. నేను పనిచేసే డిపార్టు మెంటు పెద్ద ఆఫీసరుగారి అర్ధాంగి ఆవిడ!

నాకు గుండెలు దడదడలాడాయి భయం లేదన్నట్లు నావీపు తట్టాడు మూర్తి.

ముగ్గురం బంగళాలోనికి వెళ్ళాం మూర్తి నా ప్రక్కనే ఉన్నాడు. అమెగారు ముందు నడిచివెళ్ళింది.

విశాలమైన హాలు. విద్యుద్దీపాలతో వెలిగి పోతోంది బల్లలు, కుర్చీలు, సోఫాలు, రంగు రంగుల వస్తువులు రకరకాల అలంకారాలు అక్కడ ఎంతోమంది ఉన్నారు స్త్రీలు, పురు షులుకూడా ఏదో స్వప్నజగత్తులో అడుగు పెట్టినట్టనిపించింది నాకు

నగరంలోని పెద్దలంతా అక్కడ పోగయి ఉన్నారు మూర్తి నన్నొక సోఫాలో కూచోబెట్టి వెళ్ళాడు నేనొక విచిత్రలోకాన్ని - ఎన్నడూ నాకు అనుభవంలేని లోకాన్ని వింతగా దర్శిస్తూ కూచుండిపోయాను

మూర్తి వాళ్ళందరి దగ్గరకీ వెళ్ళాడు అం దరూ అతన్ని ఆహ్వానిస్తున్నారు కరస్పర్శ కావిస్తున్నారు స్త్రీలు-పురుషులుకూడా

వారిలో కొందరిని నేను గుర్తుపట్టాను. వారంతా ఉన్నత కుటుంబాలకు చెందినవారు కొందరు ఉన్నతోద్యోగులు కొందరు ప్రముఖ వర్తకులు. కొందరు దేశనాయకులు. ఇంకా కొందరు కవులు, రాజకీయవేత్తలు, వారంతా

ఆధునిక ప్రపంచానికి ప్రతినిధులు! వారిలో కొందరిని నేను బాగా ఎరుగుదును. వారి బ్రతుకుదాచినా దాగదు బ్లాక్‌మార్కెట్ చేసి లక్షలు గడించే వర్తకులు - రెండు చేతులా లంచాలు పట్టే ఉన్నతోద్యోగులు, క్షణానికో రంగం మార్చి రంగు ఫిరాయించే రాజకీయవేత్తలు-కాంతా కనకాలకు దాసులై, పదవీ వ్యామోహంలో పడి, కన్నుకానక కొట్టుకుంటున్న దేశనాయకులు, సాహిత్యంపేర నానాబూతులూ అచ్చువేసి అంకితాలిచ్చి అరడజను బిరుదులు తగిలించుకున్న కవులు-సంఘసంస్కరణ, సమాజవికాసం-అనే పేర్లతో-ప్రచారానికి దిగి, కాలుజారి మళ్ళీ కడుక్కోలేక కాలం వెళ్ళతీస్తున్న కాంతామణులు, వీరంతా అక్కడున్నారు

ఒకప్రక్క ఒక దొరసాన్ల పిల్ల పియానోపై పాట పాడుతోంది. కొందరుస్త్రీలు పురుషులు కులాసాగా కబుర్లలో మునిగి తేలుతున్నారు,

నాకు అంతా అయోమయంగా ఉంది నేనెక్కడికి వచ్చాను? మూర్తి నన్ను ఎక్కడికి తీసుకొచ్చాడు? నాతల గిర్రున తిరిగిపోతోంది

వెయిటర్లు వచ్చి హాలు నలుమూలలా తిరుగుతున్నారు, కాసేపటికల్లా బల్లలూ, కుర్చీలూ సర్దారు ఫలహారాలూ, పానీయాలూ వచ్చాయి. తినడం, తాగడం మొదలయింది.

మూర్తి నాదగ్గరికి వచ్చి కూచున్నాడు. నా వంటిమీద తేళ్ళు- జెఱ్ఱులు పాకినట్టనిపించింది

"ఏమిటోయ్,ఎలాఉంది?-"అని అడిగాడు.

నేను సమాధానం చెప్పలేదు నేను ఒళ్ళు తెలియని కోపంలోఉన్నానని వెంటనే గ్రహించాడు మూర్తి పక్కననవ్వాడు ఇహ నేను కోపం పట్టలేకపోయాను

"ఇదేం క్లబ్బా పానశాలా, వ్యభిచారగృహమా, విలాసమందిరమా ఏమిటిది? నిన్నిక్కడికి ఎందుకు తీసుకొచ్చావురా?- ఛీ,ఛీ నీవింత చెడిపోయినావని కల్లోకూడా అనుకోలేదురా" ఫెళఫెళ అనేశాను

నవ్వుముఖంతోనే మూర్తి మళ్ళీ నావంక చూచాడు బుజంమీద చెయ్యివేశాడు

''అబ్బాయ్' ఆవేశం తెచ్చుకోకు ఒక్కమాట చెపుతాను విను ఇది క్లబ్బు, పానశాలా అని అడిగావుకదూ ఇది ఏదీకాదు కాని అవన్నీ ఇక్కడే ఉన్నాయి. చూడబ్బాయ్! ఎలా జీవిస్తున్నావని అనేకతడవలు నన్ను అడిగావు నేనెలా జీవిస్తున్నానో చూపడానికే ఇవాళ నిన్నిక్కడికి తీసుకొచ్చాను చూడమన్నాను చూచావుగా?" అన్నాడు మూర్తి.

"ఛీ,ఛీ! వీళ్ళతోనా నీకు పొత్తు? వీళ్ళంతా మానవులుకారు అన్యాయం, అసత్యం-కుట్ర, మోసం ఇదే వీళ్ళ జీవితం, ఇదే వీళ్ళచరిత్ర!" అన్నాను నేను మళ్ళీ గుక్క తిప్పుకోకుండా.

"నాకు తెలుసునోయ్ నీవు అలాగే అంటావు నీవు ఎన్నిఅయినా అను ఈనాడు జీవితం ఇదే వీళ్ళందరినీ నీవు పుండాకోర్లంటావు పొరపాటు వీళ్ళే ఈనాటి పెద్దమనుషులు సమాజమనే సౌధానికి మూలస్తంభాలు అబ్బాయ్, ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో నీవు జీవితంలో ఏదో కావాలనుకున్నావు. కాని ఏమీ కాలేదు నేను ఏదీ అక్కర్లేదనుకున్నాను కాని అన్నీ అయినాను.నీకూనాకూ తేడా ఇదేనోయ్' బ్రతుకంటే నాకొక బంతి ఆట, ఈబంతితో నాఇష్టంవచ్చినట్లు ఆడతాను నేను ఆడించినట్లల్లా ఆబంతి ఆడుతుంది మరి నీవో ఆబంతి ఆడించినట్లల్లా ఆడతావు నీవు అందుకే బ్రదర్,నీవు'లైఫ్'లో దెబ్బతిన్నావు నీ బ్రతుకు నీవు బ్రతుకాలనుకున్నావు నీవు. అందరి బ్రతుకూ బ్రతకాలనుకున్నాను నేను. అందుకే హాయిగా ఉన్నాను చూచావా వ్యత్యాసం? నేను చెడిపోయానని నీవు అనుకోవచ్చు కాని సంఘం దృష్టిలో నాఅంత సత్పురుషుడు లేడు ఈ కాలంలో సుఖంగా బ్రతకాలంటే ఈ ఒక్కసూత్రంగుర్తుంచుకోవోయ్.రెండు రెండ్లు నాలుగుకాదు, అయిదు ఈనాటి లెక్క ఇంతే-మనపూర్వులు చెప్పింది ఈనాడు తప్పుడు లెక్క!విన్నావా?-" అన్నాడు మూర్తి.

నాకు ఒళ్ళంతా దిగచెమటలు పెట్టాయి, మాట్లాడలేకపోయాను. మూర్తి మార్గం మంచిదో, చెడ్డదో తేల్చుకోలేకపోయాను. అతన్ని ఏమనాలో తోచలేదు.

బల్లమీది ఫలహారాలుకూడా ముట్టకుండా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాను.

ఇంటింట దీపావళి!

దేశవ్యాప్తంగా కొత్త ప్రణాళికలను అమలు కావించుతున్నప్పుడు ఆ ప్రణాళికలు ఇంటింటికి నూతన కళాకాంతులు తెచ్చే దీపశిఖలని మనం అలంకార పదంగా వ్యవహరించడం ఆచారం

అలంకారాలమాట అలాఉంచి- ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇంటి లోను కునుకుతీసి కొడిగట్టిపోయే గ్రుడ్డిలాంతర్లకు బదులు తళుక్కుమనే విద్యుద్దీపాలు స్థానం సంపాదించుకున్నవి. శీఘ్రతరవేగంతో పురోగమించుతున్న పంచవర్ష ప్రణాళిక సత్ఫలితాలలో ఇది ఒకటి.

ప్రథమ ప్రణాళిక తొలిరోజులలో రాష్ట్రంలోని విద్యుద్దీపాలు వెల్లివిరిసిన నగరాల, పల్లెలసంఖ్య 212 మాత్రమే. ఈనాడు 1769 వరకు ఈసంఖ్య పెరిగింది. ద్వితీయ ప్రణాళిక ముగిసేలోపున 1850 వరకు ఈ సంఖ్య పెరగగల అవకాశం ఉన్నది ప్రథమ ప్రణాళిక తొలిరోజులలో ఇంటికి 2.5 యూనిట్ల చొప్పున విద్యుత్తు వెచ్చింపబడేది ఇప్పుడు 12 యూనిట్లు వెచ్చింపబడుతున్నవి ఇక ముందు 15 యూనిట్లు వెచ్చింపబడే అవకాశం ఏర్పడగలదు.

ప్రథమ ప్రణాళిక ప్రారంభంలో విద్యుదుత్పాదకశక్తి 43100 కిలోవాట్లు మాత్రమే ఇప్పుడు విద్యుదుత్పాదకశక్తి 180000 కిలోవాట్లు. ద్వితీయ ప్రణాళికాంతంలోగా విద్యుదుత్పాదకశక్తి 284500 కిలోవాట్ల వరకూ పెరిగే అవకాశం ఉన్నది.

ప్రణాళికా విజయం ప్రజావిజయమే. ప్రజాజీవితంలో కొత్త కాంతి తళుకొత్తడమే!

సమాచార పౌరసంబంధముల శాఖ,
ఆంధ్రప్రదేశ్.

మాస ఫలములు

15-2-1960 — 14-3-1960

శ్రీ 'బుధ'

మేషము

(అశ్వి. భర. కృత్తి 1 పా.)

మీ గ్రహస్థితి మిగుల అనుకూలం భాగ్యభోగానుభవం చక్కగా వుంటుంది మీ ఆలోచనలు క్రియారూపంలో ఫలితాన్నిస్తూవుంటాయి ఉద్యోగములలో పదవి యందాధిక్యత, వేతనాభివృద్ధి గౌరవము మీ విజ్ఞానాత్మకమైన కృషి చక్కగా సాగుతుంది సాహితీమార్గములలో కృషి చేయువారికిది మంచి కాలం గ్రంధరచయితలకు, ప్రచురణకర్తలకు వారి కృషులు ఫలించి మంచి ఆదాయాన్నిస్తుంది లాభించగలదనే పూర్తివిశ్వాసంతో మీ వ్యాపారాన్ని కొనసాగించవచ్చు నూతన వ్యాపారములలో మీ పెట్టుబడులు లాభదాయకంగా వుంటాయి- వాయిదావ్యాపారములు లాభిస్తాయి- మీ శక్తిసామర్థ్యములు గుర్తించి సంఘము గౌరవిస్తుంది సాంఘిక, రాజకీయములలో అగ్రస్థానము లభిస్తుంది గౌరవబిరుదులు ప్రాప్తిస్తాయి సజ్జనుల, సంస్కారవంతులతో, స్నేహానుబంధము ఎక్కువవుతాయి- స్నేహితులతో కలసి వినోదయాత్రలు చేస్తారు విందు భోజనాలలో పాల్గొంటారు మీ బిడ్డల పురోభివృద్ధులు చక్కగావుండి సంతోషాన్ని కలిగిస్తాయి తలపెట్టిన శుభకార్యములు నెరవేరుతాయి దూర ప్రదేశములనుండి బంధుమిత్రులు రాగలరు- శుభవార్తలు అందుతాయి

వృషభము

(కృత్తి 2 3, 4. రోహిణి. మృగ 1, 2 పా)

అష్టమ శని తొలగకున్ననూ, ఈ నెలలో, భాగ్యరాజ్యములలో, రవి, బుధ, శుక్ర చలనం కొంత శుభఫలితాన్నిస్తుంది ఇంతవరకు యెటూ తేలకయున్న కొన్ని సమస్యలు పరిష్కరింపబడుతాయి వృత్తి ఉద్యమములలో యేర్పడియున్న ప్రతిబంధకాలు తొలగుతాయి పురోగమింప తగుఅవకాశములు యెర్పడుతాయి నూతనవికాసం కలుగుతుంది- ఉద్యోగములలో స్థిరత్వం చిక్కుతుంది అధికారము హోదా, పెరుగుతాయి- మీ విజ్ఞానాత్మకమగు కృషిని సాహిత్య పరిశ్రమను, సంఘము గుర్తించి గౌరవిస్తుంది అధికారుల సహాయసంపత్తులు కలుగుతాయి వ్యాపారస్తులకు అనుకూలవాతావరణం యేర్పడుతుంది వారి వ్యాపారములు లాభదాయకంగా ముందుకు నడుస్తాయి ఈ నెలలో ధనరాబడి బాగావుంటుంది ఆర్థిక యిబ్బందులు తీరుతాయి- మీ సామాజికజీవితం సుఖప్రదంగా వుంటుంది మీ ఆలోచనలకన్నిటికీ మిత్రుల ప్రోత్సాహం, సహకారం వుంటుంది. ఆధ్యాత్మిక చింతన, వేదాంతవిషయ పరిశీలన, తీర్థయాత్రాభిలాష దేవతారాధన భార్యాబిడ్డల సుఖసౌఖ్యములతో గృహస్థజీవితం సుఖప్రదంగా వుంటుంది- శుభపుణ్యకార్యాలు చేస్తారు మార్చి 6 నుండి 10వ తేదీలోగా ఉద్యోగులకు హెచ్చుజీతములమీద బదలీకాగల సూచనలున్నవి-

మిథునము

(మృగ 3, 4. ఆర్ద్ర. పున 1, 2, 3 పా)

ఈనెలలో మీ గ్రహస్థితి శుభాఽశుభ మిశ్రమ ఫలితాన్ని సూచిస్తుంది సాహితీమార్గములలో పరిశ్రమ చేయువారికి మాత్రం కొంత అనుకూలత యేర్పడుతుంది వారి విద్యావ్యాసంగములు చక్కగా కొనసాగుతాయి- విద్యనుగూర్చి నీతిశాస్త్రములగూర్చి గావించు మీ ఉపన్యాసములు- రచనలు, ప్రజానుమోదం పొంది గౌరవము చేకూరుస్తాయి విద్యాశాఖకు జెందిన ఉద్యోగులకు పదవి యందాధిక్యత- వేతనాభివృద్ధి తదితరశాఖలలో పనిచేయు ఉద్యోగులకు స్థితిగతులలో అస్థిరత- స్థానచలనం మొదలైన యిబ్బందులు కలుగుతాయి మీ వ్యాపారములలో తలవని తలంపుగా కొన్ని ప్రతిబంధకాలు యేర్పడుతాయి మీ బుద్ధిబలంతో వాటిని తొలగించుకొనుచు ముందుకు పోతుంటారు నూతన వ్యాపారములలో భారీ పెట్టుబడులు పెట్టుట తగదు- ఆర్థిక పరిస్థితులు తృప్తికరంగా వుండవు తుదిక్షణంలో దైవికంగా ద్రవ్యము సమకూడి అవసరములు తీరుతుంటాయి మీ వ్యక్తిగతాభిప్రాయాలకన్నా మిత్రుల అభిప్రాయాలతో యేకీభవించుటయే ఉత్తమం సాంఘిక జీవితమందు స్నేహితులమధ్య అభిప్రాయభేదాలు కలుగుతాయి- నిష్ఠురములు రాక తప్పవు తరచు అనారోగ్యకారణములచే గృహస్థజీవితం సుఖమునివ్వదు ప్రయాణములలో జాగ్రత్త అవుసరం మీ శరీర ఆరోగ్యాన్ని గూర్చి ఎక్కువ శ్రద్ధ వహించాలి

కర్కాటకము

(పున 4, పుష్య. ఆశ్రే)

ఈ నెలలో గ్రహస్థితి, మీకు చాలా ప్రతికూలంగా వుంది రవికి అష్టమస్థితి కుజునకు సప్తమస్థితి మిగుల చెడ్డవి- స్థితిగతులలో ఏర్పర్చుకొనిన శాంతి భద్రతలకు భంగము వాటిల్లగల ప్రమాద పరిస్థితులు యేర్పడుతాయి ఉద్యోగులకు సాంఘికంగా కొన్ని

చిక్కులు. పై అధికారుల ఆగ్రహావేశములకు గురియగుట - బదిలీ యగుట మీ వ్యాపారములు భాగస్థులతో పేచీలు రావడంతో సక్రమంగా ముందుకు నడువవు. మీ వ్యాపారలెఖ్ఖలలో లోపములను తొందరగా సవరించుకొనడం మంచిది. వ్యవహారికంగా కలిగిన చిక్కును తొలగించుకొనుటకు ఎక్కువ ధనవ్రయమగును. ఆర్థికపరిస్థితులు లాభదాయకంగా వుండవు. ద్రవ్యము కొరకుచేయు ప్రయత్నములలో ఆశాభంగమే ఎక్కువ. సామాజిక జీవితమందు శత్రు ప్రాబల్యం. మిత్రులే శత్రులవుచుందురు మీకుగాని మీకళత్రమునకుగాని ఆకస్మికంగా జబ్బు చేయగల ప్రమాదంవుంది. తృతీయమందున్న రాహుబలం, షష్ఠమమందున్న శనిబలం మీకు సహాయపడుచున్నందున పై యిబ్బందులనన్నిటిని మీ కార్య దక్షతతో తప్పించుకొని ముందుకు పోతారు. ప్రమాదములకు గురియగుట, అపజయంపొందుట జరుగదు.

సింహము

(మఖ, పుబ్బ, ఉత్త 1 పా:)

మీ జన్మరాశికి బృహస్పతి వీక్షణ. సప్తమస్థానములో నున్న రవి బుధులకు శని దృష్టి, షష్ఠమమందు అంగారకచలనం. మొదలైనవన్నియు శుభదాయకమైనవి. మీ బుద్ధిబలమునకు దైవబలంకూడా తోడవుచు యత్నకార్యములు జయప్రదమవుతుంటాయి. ఉద్యోగములలో, హోదా అధికారములు పెరుగుతాయి. లలితకళా పారిశ్రామికులకు పబ్లిక్ ప్రదర్శనము లిచ్చువారికి అనుకూల పరిస్థితులు యేర్పడుతాయి. మీ శాస్త్రపరిజ్ఞానమును, కళానైపుణ్యాన్ని సంఘము గుర్తించి గౌరవిస్తుంది. భారీపెట్టుబడులతో మీ వ్యాపారాన్ని నడిపే ఆలోచనలు చేస్తారు. అందు భాగస్థుల సహకారం పూర్తిగా వుంటుంది. వ్యాపారం నిమిత్తం యితర పట్టణములలో కొంతకాలం వుంటారు. వ్యాపార పరిస్థితులు లాభదాయకంగా వుంటాయి. సాంఘిక, రాజకీయ వ్యవహారములలో విజయం సంఘబలం సమకూరుతుంది. రాజీమార్గములలో మీకోర్టు వ్యవహారములు పరిష్కారమవుతాయి. సామాజిక జీవితంలో స్నేహితుల మూలకంగా భోగలాలసత్వమునకు గురియగు అవకాశం కలదు. ప్రేమమయ జీవితమందు ప్రణయ కలహములు, ప్రమాదములు సంభవిస్తాయి. గృహస్థ జీవితం సుఖంగా గడచిపోతుంది. వృత్తి ఉద్యమములననుసరించి యీ నెలలో ధనరాబడి అధికం.

కన్యా

(ఉత్త 2. 3,4, హస్త, చిత్త 1, 2 పా)

షష్ఠస్థానములో రవి, బుధ చలనశుభత్వం వలన అర్ధాష్టకంలో నున్న శని ప్రతిబంధకం కొంత తగ్గుతుంది యింతవరకు యేర్పడియున్న చిక్కుసమస్యలు ఆర్థికయిబ్బందులు కొన్ని పరిష్కారమవుతాయి. మీ జన్మరాశిని రాజ్యాధిపతిని శని చూచుచుండుటచే సాంఘిక రాజకీయ విషయ ప్రాముఖ్యతలు ఎక్కువవుతాయి. శత్రువులు కల్పించే చిక్కులనన్నిటిని ప్రతిఘటించి జయమును సాధిస్తారు. సాంఘికబలం సమకూరుతుంది. మీ ఉద్యోగవ్యాపారములలో అభివృద్ధి. పదవియందాధిక్యత, గౌరవము. ఎక్కువ పెట్టుబడులతో భారీపరిశ్రమలలో పాల్గొంటారు. వ్యాపారం లాభదాయకంగా నడుస్తుంది. ఆర్థిక పరిస్థితులు తృప్తికరంగా వుండవు. ఆదాయమునకు మించిన వ్రయం. శత్రువుల గురించి సంతతిగురించి ఎక్కువగా ధనవ్రయమవుతుంది. మీ కోర్టువ్యవహారములు రాజీమార్గములలో పరిష్కారమవుతాయి. మరికొన్ని వ్యవహారములు నూతనచిక్కులు కల్పిస్తూవుంటాయి. తరచు ప్రయాణములు. అనారోగ్యములచే మీ గృహస్థజీవితం సుఖంగా వుండదు. ప్రయాణములలో ఆకస్మికప్రమాదములకు గురియగు అవకాశం కలదు.

తుల

(చిత్త 3, 4 స్వాతి, విశా 1, 2 3 పా:)

పంచమకోణములో రవి బుధ చలనం మంచిది. ముఖ్యంగా మీమానసిక ప్రవృత్తిలో మంచిమార్పు కలుగుతుంది. మీ విజ్ఞానాత్మకమగు కృషి వేదాంత విషయపరిశీలన వైపుకు మళ్ళుతుంది. శాస్త్రపరిశోధనలలో నూతన విషయములు గోచరిస్తాయి. సభలలో పాల్గొని శాస్త్రప్రసంగాలు చేస్తారు. సాహితీమార్గములలో పరిశ్రమచేయువారికి మంచికాలం సామాజిక జీవితం సుఖప్రదంగా వుంటుంది. మీ ఆలోచనలకు మిత్రుల ప్రోత్సాహ సహకారాలుంటాయి. మీ బిడ్డల పురోభివృద్ధినిగూర్చి చేయుప్రయత్నములు అనుకూలిస్తాయి. వివాహాది శుభకార్యములు కలసివస్తాయి. ఉద్యోగ, వ్యాపారములు ప్రోత్సాహకరంగావుంటాయి ఆర్థిక పరిస్థితులు తృప్తికరంగావుంటాయి- వృత్తివుద్యమములలో ధనరాబడి అధికం- తలవనితలంపుగా కొంత ద్రవ్యము సమకూరుతుంది. ఈరాశిలో జన్మించిన కొంతమందికి కళత్రమూలకంగా ఆస్తిప్రాప్తిస్తుంది. నూతనగృహ నిర్మాణములు చేస్తారు.

వృశ్చికము

(విశాఖ 4 అనూ, జ్యేష్ట)

ఈ నెలలో మీ గ్రహస్థితి మంచిచెడుల మిశ్రమ ఫలితాన్ని సూచిస్తుంది. మీ ఉద్యోగములలో బాధ్యతలు ఎక్కువ- కార్యనిర్వాహణ మిగుల శ్రమగా వుంటుంది. సాటి ఉద్యోగులవలన కొన్ని చిక్కులు.

మీ బుద్ధిబలంతో వాటిని తప్పించుకొంటారు పదవి యందాధిక్యత వేతనాభివృద్ధి ఈ రాశిలో జన్మించిన అపయోగజాతకులకు నిర్లక్ష్యభావము, పట్టుదలలతో వచ్చిన అవకాశములనుకుడా పోగొట్టుకొంటారు సామాజికజీవితమందు బంధుమిత్రులతో వైరము జ్ఞాతి వైరం 4ట రవి బుధచలనంవలన విద్యాభివృద్ధి, శాస్త్ర పరిశోధనలు చేస్తారు సత్పురుషులసాంగత్యం బుధునకు రాజ్యాధిపతి సంబంధము, శని దృష్టివలన మీ వ్యాపార పరిస్థితులు లాభదాయకంగా నడుస్తాయి ధనస్థానమందు బృహస్పతియున్నందున మీవృత్తి ఉద్యమములలో ధనరాబడి నూతన వస్త్రాభరణాలు కొంటారు గృహస్థజీవితం సుఖంగా గడచిపోతుంది పుణ్యకార్యాలు చేస్తారు

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా)

జన్మరాశియందున్న శని తొలగకున్నను, విక్రమ స్థానములో రవి బుధ చలనంవలన కొన్ని శుభఫలితాలు జరుగుతాయి స్థితిగతులలో యిటీవల యేర్పడిన అస్థిరత్వము తొలగుతుంది ఉద్యోగ, వ్యాపారములలో నిలుకడ చిక్కుతుంది అభివృద్ధికి పోదగు అవకాశములు చిక్కుతాయి నూతన ప్రయత్నములు జయప్రదమవుతాయి మీ ఆలోచనలు క్రియారూపంలో ఫలితాన్ని యిస్తూవుంటాయి సామాజిక జీవితమందు చెదరిపోయిన సంఘబలాన్ని తిరిగి సంపాదించుకొంటారు మీ లక్ష్యాన్ని సాధించి పంతం నెగ్గించుకొంటారు మీ వ్యాపార పరిస్థితులకు అనుకూలంగా కాలం కలసివస్తుంది మీ పెట్టుబడులు లాభదాయకంగా వుంటాయి మీ శాస్త్రపరిజ్ఞానాన్ని కళానిపుణతను సంఘము గుర్తించి గౌరవిస్తుంది యిట్టి మీ కృషులకు ప్రభుత్వఆదరణ సహితం కలిగి ఉంటుంది మీ గ్రంధరచన నిర్విఘ్నంగా కొనసాగుతుంది శుభకార్యాలకై ధనవ్రయం అప్పుకూడా చేస్తారు బంధుమిత్రులతో విందు భోజనములలో గృహస్థజీవితం సుఖప్రదంగా వుంటుంది

మకరము

(ఉషా 2 3 4 శ్రవణ, ధని 1, 2 పా)

జన్మరాశిలో అంగారకుడు, 12ట శని, 2 ట రవి, మిగుల ప్రమాదకరమైనవి ఆకస్మికప్రమాదముల వలన ఒక్కసారిగా మీ పరిస్థితులు తారుమారవుతాయి ముఖ్యంగా మీఆరోగ్యం, మీకళత్ర ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించవలసి వుంటుంది ఉద్యోగులకు ట్రాన్సుఫర్లు ప్రజాసంస్థలలో పనిచేయు ఉద్యోగులకు మాత్రము యెట్టి ప్రతి[illegible]ములు రావు పైగా వారి ఉద్యోగాధికారములు పెరిగే యోగ్యతవుంది మీ వ్యాపారములు లాభించవు నూతన వ్యాపారములలో ఎక్కువ పెట్టుబడులు పెట్టుటతగదు వ్యవహారికంగా కూడా కొన్నిచిక్కులు రహస్యశత్రుత్వం ఆర్థిక చిక్కులు ప్రతి విషయంలోనూ ప్రతికూలం అయితే, కేంద్రకోణాధిపత్యముగల శుక్రుడు లగ్నగతుడై వుండుటచే, ఆపదలకు గురికారు స్త్రీలవలన, స్నేహితులవలన సహాయం

కుంభము

(ధని 3, 4 శత, పూభా 1, 2, 3 పా)

ఈనెలలో గ్రహస్థితి మిగుల అనుకూలం మీ జీవిత పురోగమనమునకు చక్కని అవకాశములు కలుగుతాయి మీ ఆలోచనలన్నీ క్రియారూపం తాలుస్తాయి లాభిస్తాయి జన్మరాశియందున్న రవి, బుధులకు ఏకాదశమందు శని, గురులుండుటచే సామాజిక జీవితమందు మీ పరపతి, పలుకుబడి హెచ్చుతుంది మిత్రుల ప్రోత్సాహసహకారములు లభిస్తాయి మీ విజ్ఞానాత్మకకృషి చక్కగా సాగుతుంది ఉద్యోగములలో పదవీ అధికారము పెరుగుతాయి మీవ్యాపారములు లాభదాయకంగా వుంటాయి కంట్రాక్టుపనులు లాభిస్తాయి మధ్యవర్తిత్వము వలన ధనలాభము ఆధ్యాత్మికచింత ధర్మకార్యాలు పరహితవునుగూర్చి పాటుపడుతారు శాస్త్రవిద్యలనే వృత్తిగాపెట్టుకొన్న వారికిది మంచికాలం శుభకార్యములు సాగుతాయి

మీనము

(పూభా 4. ఉభా, రేవ)

శత్రుస్థానాధిపతియైన రవి చలనం మంచిదికాదు మీశరీర ఆరోగ్యము దెబ్బతింటుంది ఉద్యోగములలో బాధ్యతలు ఎక్కువ కార్యనిర్వాహణ కష్టతరంగా వుంటుంది పై అధికారుల ఆగ్రహావేశములకు గురి అవుతారు శత్రు- రోగ- ఋణబాధలు ఎక్కువ మనశ్శాంతివుండదు వ్యవహారికంగా కలిగిన బాధా నివృత్తికై కొంతద్రవ్యము నష్టపడకతప్పదు ఒక వ్యాపారంలోవచ్చిన లాభాన్ని మరొకవ్యాపారపెట్టుబడులకై వెచ్చిస్తారు ఆదాయానికి మించిన ఖర్చు ఎప్పటికప్పుడు ధనంకొరకు ఎదురుచూడవలసివస్తుంది భూగృహవసతులనుండి కొంత ఆదాయం నూతన వస్తువాహనములుకొంటారు దీర్ఘప్రయాణాలు చేస్తారు నూతనగృహ నిర్మాణాదిప్రయత్నములు స్నేహితుల వలన మేలు- తరచు అనారోగ్యములతో గృహస్థ జీవితము సుఖమునివ్వదు

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2